ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఖమ్మం

: fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-9-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 228 పేజీలు: 8+16 వెల: 6.50

టిక్‌టాక్‌పై నిషేధం పొడిగించిన ట్రంప్ 5లో

తగ్గనున్న పాల ఉత్పత్తుల ధరలు: మదర్ డెయిరీ 6లో

## పటేల్ కలలుకన్న దేశాన్ని నిర్మిస్తున్నాం

### ఆ 'ఉక్కు మనిషి' చొరవతోనే భారత్‌లో హైదరాబాద్ విలీనం

### నియంతృత్వ పాలనపై జనం తిరుగుబాటుకు దర్పణం

### తెలంగాణ విమోచన దినోత్సవంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

### కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, కిషన్ రెడ్డి, బండి సంజయ్



బుధవారం హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినోత్సవంలో మాట్లాడుతున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్

**హైదరాబాద్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** నిజాం పాలనలో రజాకార్ల దారుణాలు పెచ్చరిల్లాయని కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. బుధవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ నిజాం పాలనలో రజాకార్లు అనేక దారుణాలు చేశారన్నారు. వారి ఆగడాలు తట్టుకోలేక ప్రజలు తిరగబడ్డారని, సర్దార్ వల్లభాయ్ పటేల్ సమర్ధత వల్ల హైదరాబాద్ రాజ్యం భారత్‌లో కలిసిందని అన్నారు. ఆపరేషన్ పోలో దేశ చరిత్రలో గొప్ప ఘట్టమని, పటేల్‌ముందు నిజాం తన ఓటమిని ఒప్పుకున్నాడని అన్నారు. ఈ రోజు భారత్ అంటే సాదాసీదా దేశం కాదన్నారు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా ధర్మ మార్గంలోనే నడుస్తామన్నారు. జాతీయ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొట్టాలన్నారు. పటేల్ కలలుగన్న దేశాన్ని నిర్మించేందుకు ప్రధానిమోడీ కృషి చేస్తు >>2

### నిజాంనుంచి హైదరాబాద్‌కు విముక్తి కలిగించిన పటేల్ - ప్రధాని మోడీ



**హైదరాబాద్,సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** నిజాం అకృత్యాల నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి పటేల్ సైన్యం కలిగించిన సెప్టెంబరు 17ను గతంలో ప్రభుత్వాలు విస్మరించేవని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అన్నారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని ధార్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని >>2

# ఒక్క చుక్క వదలం

## కృష్ణా, గోదావరిలో నీటి వాటా పూర్తిగా సాధిస్తాం

### ఎన్ని అడ్డంకులెదురైనా నిలబడతాం

### జీవన ప్రమాణాలు పెంచడమే మూసీ పునరుజ్జీవనం

### ప్రజాపాలనా దినోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి


బుధవారం హైదరాబాద్ పబ్లిక్‌గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవంలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు17:** ఎవరు ఎన్ని అవాకులు, చెవాకులు పేలినా పట్టించుకోమని, అడ్డంకులకు నిటారుగా నిలబడి తెలంగాణకు కావాల్సిన వాటా సాధించి తీరుతామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కృష్ణా, గోదావరి నదుల్లో మనకు హక్కుగా దక్కాల్సిన నీటి వాటాలపై రాజీ పడేది లేదు. గత పాలకుల తప్పులను సరిదిద్ది, ప్రతి చుక్కనీటిపై పక్కా హక్కులు సాధించే దిశగా కృష్ణా జలాల విషయంలో న్యాయ పోరాటానికి సిద్ధమయ్యామని చెప్పారు. బుధవారం పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రసంగించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన 904 టిఎంసిల వాటాను సాధించి తీరేలా వ్యూహరచన చేస్తున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో జరిగిన నష్టాన్ని భర్తీ చేస్తూనే... శాశ్వత హక్కుల సాధనలో విజయం సాధించేలా పని చేస్తున్నామని, 2027 డిసెంబరు 9 నాటికి ఎస్ఎల్‌బిసిని (శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్) ప్రజలకు అంకితం చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్‌ను తరిమికొట్టి, 3.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. గుజరాత్‌లో నర్మదా నది, యూపీలో యమునానదిని శుద్ధి చేశారని గుర్తుచేశారు. హైదరాబాద్‌లో మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుకు అడ్డంకులు కలిగిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి బ్రతుకుదెరువు కోసం వచ్చిన వారు మూసీ పక్కన నివసిస్తున్నారని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. మూసీకి >>2

## గుర్తులతోపాటు అభ్యర్థుల కలర్ ఫోటోలు

### ఇవిఎం బ్యాలట్లలో మార్పులు : ఇసి



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ఇవిఎంలపై కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఇవిఎం బ్యాలెట్ పత్రాల రూపకల్పనలో కీలక మార్పులు చేసింది. ఇవిఎంలపై గుర్తులతోపాటు అభ్యర్థుల కలర్ ఫోటోలను ముద్రించనుంది. ఈ మేరకు ఇవిఎం బ్యాలెట్ పత్రాలను రూపకల్పన, ముద్రణకు సంబంధించిన మార్గదర్శకాలను సవరించింది. ఎన్నికల నిర్వహణ నియమాలు, 1961లోని నియమం 49బి ప్రకారం, వాటిని మరింత చదవగలిగేలా, ఓటర్లకు అనుకూలంగా మార్చినట్లు కేంద్ర ఎన్నికల సంఘం బుధవారంనాడొక ప్రకటనలో తెలిపింది. త్వరలో జరుగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించింది. ఇసి కథనం ప్రకారం, కొత్త బ్యాలెట్ >>2

### సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌గా డా. ఏనుగు నరసింహారెడ్డి



**హైదరాబాద్ (రవీంద్ర భారతి), సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ, హైదరాబాద్ సంచాలకుడుగా మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డా. ఏనుగు నరసింహారెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం అండ్ కల్చర్ (సిఎ) విభాగం, తెలంగాణ ప్రభుత్వం 17 బుధవారం జిఒ విడుదల చేసింది. రెండు సంవత్సరాలపాటు జిఒ 1లో పేర్కొన్న నియమ నిబంధనల మేరకు డిప్యుటేషన్ ప్రాతిపదికన నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ఏర్పాటు చేసిన తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి కార్యదర్శిగా పనిచేసిన డా. ఏనుగు నరసింహారెడ్డి, అకాడమీ తొలి ఛైర్మన్ డా. నందిని సిధారెడ్డితో కలిసి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభలను విజయవంతంగా జరిపించి పేరుప్రఖ్యాతులు పొందారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యం

## అర్హులందరికీ అభయహస్తం గ్యారంటీ పథకాల అమలు

### అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా' స్కూళ్లు: డి సిఎం భట్టి


బుధవారం ఖమ్మంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మాట్లాడుతున్న డి సిఎం భట్టి

**ఖమ్మం బ్యూరో సెప్టెంబరు17, ప్రభాతవార్త:** పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతున్నదని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం ఉదయం నిర్వహించిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకలలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకావిష్కరణ చేసి ప్రజలను ఉద్దేశించి తన సందేశాన్ని తెలియజేసారు. రైతాంగం, కూలీలు భూమి కొరకు, భుక్తి కొరకు భూ పోరాటాలు చేసి, నిజాంప్రభుత్వ సాయుధ రజాకార్లను ఎదురించారని, నిజాం సంస్థానాన్ని సమాఖ్య భారతదేశం ప్రజా పాలనలో భాగంగా చేయుటకు ఎన్నో పోరాటాలు జరిగాయనీ, ఖమ్మం జిల్లాకు కూడా ఇట్టి పోరాటాలలో ప్రముఖమైన పాత్ర ఉందని తెలిపారు. ఆనాడు స్వామి రామానంద తీర్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సర్దార్ జమలాపురం కేశవ రావు మహనీయులు, కొమరం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ లాంటి అనేక మంది పోరాటంలో భాగస్వామ్యం అయ్యారని, రజాకార్లకు వ్యతిరేకంగా వీరోచితంగా పెద్ద ఎత్తున పోరాటం చేసి ఈ ప్రాంతాన్ని ప్రజాస్వామ్య పాలనలో భాగస్వామ్యం చేశారని, ఈ సందర్భంగా వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెలిపారు. మహాకవి దాశరథి ఖమ్మం జిల్లా నుంచి ప్రయాణం సాగించారని, ఆనాడు సంఘాల ఏర్పాటులో, గ్రంథాలయ ఉద్యమాలలో, రజాకార్లకు వ్యతిరేకంగా, వీరోచితంగా జరిగిన పోరాటంలో ఖమ్మంకు ప్రముఖ పాత్ర ఉందని, బొమ్మ కంటి సత్యనారాయణ రావు, రామ్ చందర్ రావు, శీలం సిద్ధారెడ్డి, నల్లమల్ల గిరిప్రసాద్, మహ్మద్ రజబ్ అలీ, వెంగళరావు లాంటి అనేక ప్రముఖులు మన జిల్లా నుంచి ప్రముఖ పాత్ర పోషించారని, ఖమ్మం ప్రాంతం నుండి ఇమ్రోజ్ ఉర్దూ పత్రికా ఎడిటర్ అయిన షోయబ్ ఉల్లా ఖాన్ నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా కలమెత్తి రజాకార్ల చేతిలో మరణించారని అన్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే అమలు చేయడం ప్రారంభించడం జరిగిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు అభయహస్తం గ్యారెంటీ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. తెలంగాణ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025ను >>2

### ఎపికి విద్యుత్ బకాయిల చెల్లింపుపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం - స్పష్టం చేసిన సుప్రీం కోర్టు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నలుగుతున్న విద్యుత్ బకాయిలపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్‌కో కు విద్యుత్ బకాయిలను చెల్లించాలని తెలంగాణ జెన్‌కో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టం చేసింది. ఈ రెండు రాష్ట్రాల మధ్య విద్యుత్ బకాయిల వివాదంలో పూర్తిస్థాయిలో విచారణ అవసరమని సుప్రీం ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా రాష్ట్ర విభజన సందర్భంగా తెలంగాణ డిస్కంలకు ఆంధ్రప్రదేశ్ జెన్‌కో విద్యుత్ సరఫరా చేసింది. ఈ క్రమంలో ఇరు రాష్ట్రాల మధ్య విద్యుత్ బకాయిల అంశంలో వివాదం ఏర్పడింది. ఆగస్టు 31,2021నాటికి రూ.2,841.90 కోట్ల వడ్డీతో సహా రూ.3,441.78 కోట్ల కలిపి మొత్తం రూ.6,283కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందని ఆంధ్రప్రదేశ్ >>2



బుధవారం హైదరాబాద్‌లో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న తీన్మార్ మల్లన్న

### ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'

#### రెండు రంగుల జెండా ఆవిష్కరణ

**హైదరాబాద్, సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** తెలంగాణలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ కొత్త రాజకీయ పార్టీని పెట్టారు. తన పార్టీకి 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'అనే పేరుప్రకటించారు. ఈ మేరకు బంజారా హిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కొత్త రాజకీయపార్టీ పేరు, జెండాను ఆవిష్కరించారు. తీన్మార్ >>2

## దేశానికి దిక్సూచిలా కొత్త విద్యావిధానం

### భాష, జ్ఞానం, నైపుణ్యం, క్రీడల మేళవింపు

### విజన్ డాక్యుమెంట్ 2047లో కొత్త విధానానికి ప్రత్యేక అధ్యాయం: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు17:** క్షేత్ర స్థాయి పరిస్థితులు, అధ్యయనం, భవిష్యత్ అవసరాలకు తగినట్లు రూపొందించే తెలంగాణ విద్యా విధానం (టిఇపి) భారతదేశ విద్యా విధానానికి దిక్సూచిలా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో భాష ఉన్న వారి దగ్గర జ్ఞానం లేదని... జ్ఞానం ఉన్న చోట భాష లేదని.. రెండు ఉన్న చోట నైపుణ్యాలు లేవని.. కానీ ఈ మూడింటి కలబోతగా విద్య ఉండాలని సిఎం పేర్కొన్నారు. తెలంగాణ విద్యా విధానం నివేదిక రూపకల్పనపై తెలంగాణ సెక్రటేరియట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో విద్యా రంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలని తాము నిర్ణయించుకున్నట్లు సిఎం తెలిపారు. గతంలో పేదరిక నిర్మూలనకు ప్రభుత్వాలు భూముల పంపకం... నిధుల పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టేవని... ఇప్పుడు పంపకానికి భూములు, తగినన్ని నిధులు లేవన్నారు. ఇప్పుడు పేదరిక నిర్మూలనకు విద్య తప్ప మరో ఆయుధం లేదని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా రంగం ప్రాధాన్యతను గుర్తించినందునే ప్రథమ ప్రధానమంత్రి జవహర్ లాల్ నెహ్రూ దేశంలో విశ్వ విద్యాలయాలు, ఐఐటీలు వంటి ఉన్నత విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు. కాలానుగుణంగా ఇంజినీరింగ్ కళాశాలలు వచ్చినందునే పెద్ద సంఖ్యలో సాఫ్ట్ వేర్ రంగంలో మన యువత రాణిస్తున్నారని సిఎం తెలిపారు. అయినప్పటికీ మన రాష్ట్రం నుంచి ఏటా బయటకు వస్తున్న లక్షలాది మంది ఇంజినీరింగ్ విద్యార్థుల్లో పది శాతం మందికి కూడా ఉద్యోగాలు దక్కడం లేదన్నారు. తగినంత నైపుణ్యం లేకపోవడమే అందుకు కారణమన్నారు.

ఆ రంగంలో నైపుణ్యాలు పెంచడంతో పాటు ఇంకా పలు రంగాల్లో అవకాశాలు విస్తృతమైనందున ఆ అవకాశాలు అందిపుచ్చుకునేలా విద్యా రంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని సిఎం తెలిపారు. ఉస్మానియా, కాకతీయ విశ్వ విద్యాలయాలు గతంలో సైద్ధాంతిక భావజాలలకు నిలయంగా నిలిచి ప్రజా సమస్యలపై ఆందోళనలు, ఉద్యమాలు చేపట్టేవని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. పాఠశాల స్థాయి నుంచి విశ్వ విద్యాలయాల స్థాయి వరకు విద్యా ప్రమాణాలు పడిపోవడం.. నైపుణ్యాల లేమితో ఉద్యోగాలు లభించకపోవడంతో విద్యార్థులు డ్రగ్స్ బారినపడి జీవితాలను కోల్పోతున్నారని సిఎం అన్నారు. దేశంలో ఐటిఐలు ప్రారంభించినప్పుడు ఉన్న >>2



బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి హైదరాబాద్ నగరమంతా సాగరంలా మారిపోయిన దృశ్యం

## నగరమంతా 'సాగర'మే!

### హైదరాబాద్‌లో మళ్లీ నిండుగా కుండపోత

### దాదాపు అన్ని ప్రాంతాల్లో 8 నుంచి 11 సెం.మీ వాన

### అధికారులు అప్రమత్తం కావాలి: సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు17:** హైదరాబాద్‌పై వరుణుడు మరోసారి విరుచుకుపడ్డారు. బుధవారం సాయంత్రం మూడు,నాలుగు గంటల పాటు క్లౌడ్ బరస్ట్ తరహాలో వర్షం కురిసింది. అత్యధికంగా మియాపూర్‌లో 9.7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. లింగపల్లిలో 8.2 సెం.మీ. హెసియు వద్ద 8.1 సెం.మీ.గచ్చిబౌలిలో 6.6 సెం.మీ. వర్షం కురిసింది. ఆయా ప్రాంతాల్లో మధ్యరాత్రి వరకు వాన పడింది. నగరంలోని చాలా రోడ్లు నదులను తలపించాయి. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. >>2

# ఒక్క చుక్క వదలం

>> వరద వచ్చినప్పుడు కొట్టుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఉద్యోగ, ఆర్థిక అవకాశాలు కల్పించి వారి జీవన ప్రమాణాలు పెంచడమే మూసీ పునరుజ్జీవం లక్ష్యమని పేర్కొన్నారు. మత సామరస్యానికి దిక్సూచిగా మూసీ వెంట అనేక కట్టడాలు కట్టారని తెలిపారు. మూసీ పునరుజ్జీవం చేసి తెలంగాణ వైతాళికుల విగ్రహాలు పెడతామని చెప్పారు. ఆనాటి ముఖ్య మంత్రులు హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌ను నిర్మించారని రేవంత్ గుర్తు చేశారు. నగరంలో పెరుగుతున్న అవసరాలను దృష్టిలో ఉంచుకుని 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నట్లు చెప్పారు. భూమిని సేకరించే విషయంలో కొంతమంది నాయకులు అక్కడ ఉన్న రైతులను రెచ్చగొట్టాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాముచేయనవి ఎవరూ.. చేయిద్దని వారు భావిస్తారని పేర్కొన్నారు. దానిని తెలంగాణ ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రేపు ప్రపంచ పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా ఫ్యూచర్ సిటీ మారబోతుందని నొక్కి చెప్పారు. నగరంలో 360 కిలోమీటర్ల మేర ఆర్ఆర్ఆర్ రాబోతుందని స్పష్టం చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు మధ్య 11 రేడియల్ రింగ్ రోడ్లు వేయనున్నట్లు పేర్కొన్నారు. బుల్లెట్ రైలు కావాలని... కేంద్రానికి ప్రతిపాదన చేశామని తెలిపారు. హైదరాబాద్ నుంచి అమరావతికి గ్రీన్ ఫీల్డ్ హైవేలు, బులెట్ రైలు ప్రతిపాదనలు ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిపై రాజకీయాలు చేసేవారు తెలంగాణ అభివృద్ధి నిరోధకులుగా మిగులుతారన్నారు. తాము చేసే అభివృద్ధితో కలిసిరండని ప్రతిపక్షాలకు పిలుపునిచ్చారు. తమతో కలిసిరావడం ఇష్టం లేకపోతే మౌనంగా ఉండండని సిఎం రేవంత్‌రెడ్డి హితవు పలికారు. తప్పులుంటే దిద్దుకుంటున్నాం. మంచి చేయడమే బాధ్యతగా భావిస్తున్నాం. అభివృద్ధిలో ప్రపంచంతో పోటీ పడాలన్న తపనతో పని చేస్తున్నాం అని చెప్పారు. ప్రతి పేదవాడి ముఖంలో ఆనందమే లక్ష్యంగా సంక్షేమ చరిత్రను తిరగ రాస్తున్నాం అని చెప్పారు. ఏడు దశాబ్ధాలుగా తెలంగాణ ఆశిస్తోన్న స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమానత్వమే మా ప్రభుత్వ ప్రథామిక ఎజెండా అని చెప్పారు. అభివృద్ధిలోనే కాదు... స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం విషయంలో కూడా తెలంగాణ దేశానికి రోల్ మోడల్‌గా ఉంటుందన్నారు.

మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి నినాదంతో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మేం చేపడుతున్న కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇందిరా మహిళాశక్తి పాలసీలో భాగంగా నారాయణపేట జిల్లాలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ద్వారా ఆరునెలల్లో రూ.15.50 లక్షల లాభాలు ఆర్జించింది. ఖమ్మం మహిళా మార్ట్" విజయవంతంగా నడుస్తోంది. రాష్ట్రంలో మరికొన్ని మహిళ మార్ట్ లను ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 25.35 లక్షల మంది రైతులకు, రూ.20,616 కోట్ల రుణాలు మాఫీ చేసి దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రైతులను ఆదుకున్నాం. ఇందిరమ్మ రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లో తొమ్మిది వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేసి పెట్టుబడికి భరోసా ఇచ్చామన్నారు. కేవలం ఏడాది కాలంలో లక్షా నాలుగు వేల కోట్ల రూపాయలు రైతుల ప్రయోజనాలపై ఖర్చు చేసిన ప్రభుత్వం ఈ దేశంలో మరొకటి లేదని, 7,178 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద చివరి గింజ వరకు ధాన్యం కొన్నామన్నారు. గత ఏడాది 2.90 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలిచాం. ఈ ఏడాది 280 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచామన్నారు. ప్రజా ప్రభుత్వం తొలి 20నెలల్లోనే ఎలాంటి వివాదాలకు ఆస్కారం లేకుండా సుమారు 60 వేల ఉద్యోగాల భర్తీ చేశాం, రాజీవ్ గాంధీ సివిల్స్ ఆభయ హస్తం ద్వారా లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి కారణంగా తెలంగాణ రెవెన్యూ వ్యవస్థ మొత్తం అస్తవ్యస్తమైందన్నారు. తమ దోపిడీకి అడ్డుగా ఉన్నారనే రెవెన్యూ ఉద్యోగులను, సిబ్బందిని దొంగలుగా, దోపిడీదారులుగా గత పాలకులు ముద్ర వేశారు. భూభారతి చట్టం తెచ్చాం. క్షేత్ర స్థాయిలో ఈ చట్టాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకుఇటీవలే 5 వేల మంది గ్రామ పాలనా అధికారులను నియమించామన్నారు.



బుధవారం ప్రజాపాలన దినోత్సవంలో పతాకావిష్కరణ చేస్తున్న సిఎం రేవంత్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు గ్రామాల్లో పేదల ఆత్మగౌరవ ప్రతీకలు. తొలి విడతగా 22,500 కోట్ల రూపాయలతో, ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. ఈ ఒక్క ఏడాదిలోనే నాలుగున్నర లక్షల మంది పేదలు సొంత ఇంటివారవుతున్నారని చెప్పారు. సన్నబియ్యం సంక్షేమ పథకానికి ఈ రోజు కేరాఫ్ అడ్రస్ తెలంగాణ. దేశంలో మరే రాష్ట్రంలో ఇటువంటి పథకం లేదు. రాష్ట్రంలోని 3.10 కోట్ల మందికి నిత్యం సన్నబియ్యంతో ఈ రోజు భోజనం చేయగలుగుతున్నారని చెప్పారు. 2035 నాటికి తెలంగాణ ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ప్రపంచానికి హైదరాబాద్ గేట్ వే గా మారుతుందని, ఆ దిశగా మొత్తం రాష్ట్రానికి మేం మాస్టర్ ప్లాన్ ను తయారు చేస్తున్నామని, రోడ్లు, విద్యుత్, రహదారులు, రవాణా సదుపాయాలు, మురుగు నీటి పారుదల, వాతావరణ స్వచ్ఛత ఇలా అన్నీ కోణాల్లో అత్యంత స్వచ్ఛమైన, సుఖమైన జీవన ప్రమాణాలతో కూడిన నగరంగా హైదరాబాద్‌ను మారుస్తామన్నారు. హైదరాబాద్ నగరానికి వచ్చే వందేళ్ల తాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కా రంగా గోదావరి జలాలు తీసుకువస్తున్నామన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని మత్తు మహమ్మారి గంజాయి పట్టిపీడిస్తోందని రేవంత్ తెలిపారు. మధ్య తరగతి యువత సైతం పెడధోరణి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రగ్స్ నివారణకు ప్రజల మద్దతుకావాలని కోరారు. కొంతమందికి ప్రభుత్వం చేసే ప్రయత్నం నచ్చకపోవచ్చు అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొందరు డ్రగ్స్‌ను గేట్ వే ఆఫ్ హైదరా బాద్‌గా మార్చారని మండిపడ్డారు.

గంజాయి, డ్రగ్స్ నివారణకు ఈగల్ సంస్థను తీసుకువచ్చామని గుర్తు చేశారు. డ్రగ్స్, గంజాయి వెనుక ఎంతపెద్దవారున్నా ప్రభుత్వం వదిలిపెట్టదని ఆయన హెచ్చరించారు. రాజకీయాల్లో ఉన్న వారికి ఫామ్‌హౌస్‌లు ఉండవచ్చు.. అలా అని డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తే ఊరుకునేది లేదని ఉద్ఘాటించారు. 138 దేశాలు పాల్గొన్న "వరల్డ్ పోలీస్ సమిట్ (డబ్ల్యూపిఎస్) 2025లో డ్రగ్ కంట్రోల్ కేటగిరీలో మన హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ ప్రథమ బహుమతి అందుకోవడం మనకు గర్వకారణం. డ్రగ్స్ అనే మాట తెలంగాణలో వినబడటానికి వీలు లేదు. ఆ దిశగా అవసరమైతే మరింత కఠిన చట్టాలు తెస్తాం. డ్రగ్స్ విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విమోచన దినోత్సవంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు మొమెంటో బహూకరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

# దేశాన్ని నిర్మిస్తున్నాం

>> న్నారని, దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఆర్టికల్ 370ని తొలగించి జమ్మూకశ్మీరు అభివృద్ధి చేస్తున్నామని, మనలో ఎన్ని విభేదాలున్నా దేశం విషయంలో అందరిదీ ఒకటే మాట అన్నారు. దేశ రక్షణ, భద్రత విషయంలో ప్రజలమంతా ఏకతాటిపైకి వస్తామన్నారు. భారత్ అంటే సాదాసీదా దేశం కాదని ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరుకుంటున్నాం అన్నారు. ఆపరేషన్ సిందూర్ మన సైనికులు సత్తాచాటారు. ఉగ్రవాది మసూద్‌అజార్ కుటుంబ సభ్యులను హతమార్చామని, పహల్గాంలో మతం పేరు అడిగి మరీ చంపిన వారికి బుద్ధి చెప్పామ న్నారు. ఆపరేషన్ సిందూర్ భారత శక్తిసామర్థ్యాలు, సైనిక సత్తాను ప్రపంచం చూసిందని, ఉగ్రవాదుల స్థావరాల్లోకి వెళ్లి మరీ వారిని హతమార్చామన్నారు. ఆపరేషన్ సింధూర్ ముగియలేదని, ఇప్పుడు చిన్న పాజ్ మాత్రమేఅన్నారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాంతం రజాకార్ల ఆరాచకాలను భరించిన నేల అని, వారిపై పోరాటం చేసిన శౌర్యమున్న భూమిఅని రాజ్‌నాథ్ కొనియాడారు. తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని రంభించిన రాజ్‌నాథ్. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలిపారు భారత్‌ను దక్షిణాదితో ఏకం చేసేనగరం హైదరాబాద్ అని అన్నారు. హైదరాబాద్ విముక్తికల్పించిన పటేల్ సుయావత్ భారతావని స్మరించుకుంటుదన్నారు.

**మజ్లిస్‌కు భయపడి ప్రభుత్వం చరిత్రను కనుమరుగు చేస్తున్నారు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు పల్లెలపై పడి దోచుకున్నారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. గ్రామాలపై పడి హత్యలు, అత్యాచారాలు చేశారన్నారు. కర్ణాటక, మహారాష్ట్రలో ముక్తి దివస్ చేసుకుంటే. ఇక్కడెందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. పేర్లు మార్చి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వేడుకలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. మజ్లిసుకు భయపడి చరిత్రను కనుమరుగు చేస్తున్నారని ఆరోపించారు. ఆపరేషన్ పోలోతో హైదరాబాదుకు విముక్తి కలిగిందని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. ప్రధాని మోడీ ఆదేశాలతో విమోచన దినోత్సవాన్ని కేంద్రం అధికారికంగా నిర్వహిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వారిని కేంద్రం గుర్తించి గౌరవిస్తుందని వెల్లడించారు. నిజాం నిరంకుశ పాలనకు చరమగీతం పాడేందుకు ఎంతో మంది ప్రాణాలు అర్పించారన్నారన్నారు. ఆపరేషన్ పోలోతో సర్దార్ వల్లబాయ్ పటేల్ హైదరాబాదుకు విముక్తి కల్పించారని వివరించారు. నిజాం బలవంతపు మతమార్పిడులు చేశారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నిజాం నిరంకుశ పాలన తలచుకుంటే ప్రజల రక్తం మరుగుతుందని అన్నారు. ఉర్దూను ప్రజలపై రుద్దేందుకు నిజాం ప్రయత్నించారన్నారు. బలవంతపు మతమార్పిడులు చేశారని.. మతం మారని వారికి ఎక్కువ పన్నులు వేసి ఇబ్బంది పెట్టారని ఆరోపించారు. ఓటు. బ్యాంకు రాజకీయాలతో రాష్ట్ర పాలకులు విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించడంలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పాటులో రాజానాథ్ సింగ్ ప్రముఖ పాత్ర పోషించారన్నారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యం

>> ప్రజా ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని అన్నారు. 2030 నాటికి లక్షా 98 వేల కోట్ల పెట్టుబడితో 20 వేల మెగా వాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసి లక్షా 14 వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించా లని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. ఇందిరా మహిళ శక్తి పథకం క్రింద మహిళా సంఘాల ద్వారా రెండు మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇందిరా సౌర గిరి జల వికాసం క్రింద మన జిల్లాలో మొదటి విడత క్రింద 550 లబ్ధిదారులను ఎంపిక చేసి సోలార్ పంపు సెట్ల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎస్సీ,ఎస్టి, బీసి, మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా 128 రెసిడెన్షియల్ పాఠశాలలో 20 వేల 502 మంది విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం వసతి కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలలో 20నుంచి 25 ఎకరాలవిస్తీర్ణంలో 200కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో, ఇంగ్లీష్ మీడియం బోధనతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టామని అన్నారు. రేషన్ కార్డులను అర్హులైన పేద కుటుంబాల అందరికీ పంపిణీ చేస్తున్నామని, మన జిల్లాలో నూతనంగా 24 వేల 818 కుటుంబాలకు రేషన్ కార్డ్ లను జారీ చేశామని అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కవరేజిని 5 లక్షల నుంచి 10 లక్షలకు పెంచామని, మధిర, సత్తుపల్లి పట్టణాలలో 34 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ 100 పడకల ఆసుపత్రి, కల్లూరులో 10 కోట్ల 50 లక్షలతో 50 పడకల కమ్యూనిటి హెల్త్ సెంటర్, పెనుబల్లి నందు 7 కోట్ల 50 లక్షలతో 30 పడకల కమ్యూనిటి హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయడం జరిగిందన్నారు. పాలేరు, సత్తుపల్లి పట్టణాల్లో 25 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ చేపట్టిన నూతన ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, వైరా పట్టణంలో 37 కోట్ల 50 లక్షలు ఖర్చు చేస్తూ చేపట్టిన 100 పడకల ఆసుపత్రి భవనం, ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి నందు 23 కోట్ల 50 లక్షలతో చేపట్టిన 50 పడకల క్రిటికల్ కేర్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు.

బీసి లకు 42 శాతం రిజర్వేషన్ తో సామాజిక తెలంగాణ సాధనకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో ఆర్ అండ్ బీ శాఖ ద్వారా 180 కోట్లతో మున్నేరు నదిపై తీగల వంతెన నిర్మాణ పనులు,130 కోట్లతో వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయనీ, 139 కోట్లతో 10 రెండు వరుసల రహదారిని 4 వరుసల రహదారులుగా విస్తరించడం జరిగిందనీ, సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా జిల్లాలో లక్షా 38 వేల 790 ఎకరాలలో కొత్త ఆయకట్టుకు సాగునీటి వసతి కల్పన చేస్తున్నామని, దీని ద్వారా నాగార్జున సాగర్ ఎడమ కాలువ, వైరా, లంక సాగర్ ప్రాజెక్టులు, చిన్న నీటి వనరుల సాగునీటి సప్లిమెంట్ చేసేందుకు పాలేరు లింక్ కాలువ నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు.

## విముక్తి కలిగించిన పటేల్

>> తల్లులు, సోదరీమణులకు అంకితం చేసినట్లు ప్రకటించారు. నిజామ్ పాలనలో హైదరాబాద్ సంస్థానంలో అనేక దారుణాలు జరిగాయని ప్రధానమంత్రి ఆవేదన చెందారు. సెప్టెంబరు 17వ తేదీ మరో చారిత్రాత్మక రోజు సర్దార్ వల్లభభాయ్ పటేల్ ఎంతో ధైర్య సాహసాలు చూపించినరోజు. హైదరాబాద్‌ను విమోచనం కలిగించిన రోజు దేశంలో హైదరాబాద్ సంస్థానంను విలీనంచేసిన రోజని ఆయన గుర్తు చేశారు. నిజాం దుష్టపాలననుంచి రజాకార్ల దాడులనుంచి హైదరాబాద్‌కు విమోచనం కలిగిందని చెప్పారు. తద్వారా నిజాం అకృత్యాల నుంచి హైదరాబాద్ సంస్థానానికి విముక్తి కలిగిందన్నారు. ఆ క్రమంలో హైదరాబాద్ విమోచన దినోత్సవాన్నిఘనంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.అణు బెదిరింపులకు భారత్ భయపడదని స్పష్టం చేశారు ప్రధాని. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాదులకు బుద్ధి చెప్పామన్నారు. ఆపరేషన్ సిందూర్ హీరోలపై ఈ సందర్భంగా ప్రధాని మోడీ ప్రశంసల వర్షం కురిపించారు.

# కొంతమందినైనా జైలుకు పంపిస్తే కానీ ఈ సమస్య తీరదు

## పంటవ్యర్థాల దహనంపై సుప్రీం అసహనం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** పంట వ్యర్థాల దహనంపై దాఖలైన పిటిషన్లపై తాజాగా విచారణ జరిపిన సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇందుకు పాల్పడుతున్న కొంతమందినైనా జైలుకు పంపితేనే మిగితా వారికి గట్టి సందేశం ఇచ్చినట్టవుతుందని వ్యాఖ్యానించింది. రైతులు మనకు అన్నం పెడుతున్నారని, అయితే దాని అర్థం పర్యావరణాన్ని పాడు చేస్తుంటే సైలెంట్‌గా చూస్తూ ఉండమని కాదని సిజెఐ బిఆర్ గవాయ్ అన్నారు. పంట వ్యర్థాలను తగులబెట్టకుండా రైతులకు సబ్సిడీలు, వివిధ పరికరాలు అందిస్తున్నట్టు కోర్టుకు అమికస్ క్యూరీ అపరాజిత సింగ్ తెలిపారు. అయితే ఉపగ్రహాలు ఆయా ప్రాంతాల్లో వెళ్తున్నప్పుడు కాకుండా మిగిలిన సమయాల్లో పంట వ్యర్థాలను కాల్చుకోవచ్చని అధికారులు తమకు చెప్పినట్టు రైతులు పదేపదే చెబుతున్నారని, దీనిపై ఎన్నిసార్లు ఉత్తర్వులు ఇచ్చినా ప్రయోజనం ఉండటం లేదని విన్నవించారు. దీంతో ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. కొందరినైనా జైలుకు పంపితేనే తక్కినవారికి సరైన సందేశం వెళ్తుందన్నారు. రైతులపై జరిమానా విధించే ఆలోచన ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. పర్యావరణాన్ని పరరిక్షించాలనే నిజమైన ఉద్దేశమే ఉంటే మీరెందుకు ఇలాంటి చర్యలకు దూరంగా ఉండాలని నిలదీశారు. వ్యర్థ పదార్థాలను తగులబెట్టేందుకు బయోఫ్యూయెల్స్ వాడుతున్నట్టు కూడా వార్తలు వస్తున్నాయని సిజెఐ అన్నారు. రైతులు ప్రత్యేకమైన వారే, వాళ్ల వల్లే మనకు అన్నం దొరుకుతుంది. అలాగని పర్యావరణాన్ని పాడుచేస్తుంటే చూస్తూ ఊరుకోలేం కదా అని ప్రశ్నించారు. కొన్ని రాష్ట్రాల్లోని పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల్లో ఖాళీలు ఉండటంపైనా సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. మూడు నెలల్లోగా అన్ని ఖాళీలను భర్తీ చేయాలని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజిమెంట్‌కు అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

ప్రతి ఏడాది శీతాకాలంలో ఢిల్లీ ఎన్‌సిఆర్‌లో వాతావరణ కాలుష్యం తీవ్రస్థాయికి చేరుకుంటోంది. పొల్యూషన్‌కు పంట వ్యర్థాలను తగులబెట్టడం ప్రధాన కారణంగా గుర్తించారు. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు మూడు వారాల్లోగా ప్రణాళికలు సమ ర్పించాలని సుప్రీంకోర్టు బుధవారం కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్, సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌లతో పాటు రాష్ట్ర కాలుష్య యంత్రణ బోర్డులను ఆదేశించింది. శీతాకాలం ప్రారంభానికి ముందు తమ ప్రణాళికలు అందించాలని సుప్రీంకోర్టు చెప్పింది.

# బీచ్‌లో 19 యేళ్ల యువతిపై సామూహిక లైంగికదాడి

**భువనేశ్వర్, సెప్టెంబరు 17:** ఒడిశాలోని పూరీ జిల్లాలో దారుణం జరిగింది. బాలిహర్చండి ఆలయం వద్ద ఉన్న బీచ్‌లో ఓ 19 యేళ్ల యువతిపై సామూహిక అత్యాచారం చేశారు. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి సేద తీరేందుకు బీచ్‌కు వెళ్లిన ఆ యువతిని గుర్తించిన కొందరు యువకులు వారిద్దరినీ ఫోటోలు, వీడియోలుతీసి బెదిరించారు. అనంతరం ఆ యువకుడు చూస్తుండగానే.. యువతిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడ్డారు. ఈ ఘటనలో ముగ్గురు యువకులను పోలీసులు అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న మరో యువకుడి కోసం గాలింపు చేపట్టారు. గత కొంతకాలంగా ఒడిశాలో ఇలాంటి ఘటనలు పెరిగిపోతుండటం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తన బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి వీకెండ్ సందర్భంగా బాలిహర్చండి ఆలయం వద్దకు చేరుకుంది. అక్కడే కూర్చుని వారు ముచ్చట్లు పెడుతుండగా నలుగురు వ్యక్తులు వారి వద్దకు చేరుకున్నారు. మొదట వారిద్దరినీ.. బెదిరించారు. అనంతరం ఫోటోలు, వీడియోలు రికార్డు చేశారు. అయితే ఆ వీడియోలు డిలీట్ చేయాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబ్బులు ఇచ్చేందుకు వారిద్దరూ నిరాకరించడంతో తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. దీంతో ఆ నలుగురు యువకుల్లో ఇద్దరు ఆ యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. మిగిలిన ఇద్దరు యువకులు ఆమె స్నేహితుడిని తీవ్రంగా కొట్టి పక్కనే ఉన్న ఒక చెట్టుకు కట్టేశారు. సామూహిక అత్యాచారం తర్వాత నిందితులు పారిపోగా బాధితులు తమ ఇంటికి చేరుకున్నారు. అయితే రెండు రోజుల తర్వాత బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసుకుని రంగంలోకి దిగిన పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయ్యే ముందే నిందితులు సదరు వీడియోలను తొలగించినట్లు పోలీసులు వెల్లడించారు. కొన్ని నెలలుగా ఒడిశాలో ఇలాంటి లైంగిక దాడులు పెరుగుతుండటం స్థానికంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఇటీవలే రాజధాని భువనేశ్వర్‌లో ఒక సింగర్‌ను ముగ్గురు వ్యక్తులు మత్తు పదార్థాలు కలిపిన డ్రింక్ ఇచ్చి అత్యాచారం చేశారు. ఆ కేసులో నిందితులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. అంతకుముందు ఈనెల 5వ తేదీన కంధమాల్ ప్రాంతంలో జరిగిన వినాయక నిమజ్జనాన్ని చూసేందుకు వెళ్తున్న 14 ఏళ్ల బాలికను లిఫ్ట్ ఇస్తానని చెప్పి ఒక వ్యక్తి కారులో ఆమెను తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజుల తర్వాత ఆ నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. గత నెలలోనూ మయూర్‌భంజ్ జిల్లాలో ఓ 10 ఏళ్ల గిరిజన బాలికపై లైంగిక దాడి జరిగింది. ఆ కేసులోనూ నిందితుడిని పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేశారు. తాజాగా మరో ఘటన చోటు చేసుకోవడంతో ఒడిశా పోలీసులపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలపై జరుగుతున్న నేరాలపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కలర్ ఫోటోలు

>> పత్రాలలో గుర్తులతోపాటు అభ్యర్థుల కలర్ ఫోటోలు ఉంటాయి. ఇవిఎంలపై కేటాయించిన స్థలంలో అభ్యర్థుల ఫోటోలు చాలా స్పష్టంగా కనిపించేలా ముద్రించనున్నారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో గత ఆరు మాసాల్లో 28 అంశాల్లో మార్పులు తీసుకొచ్చామని, అందులో ఇదొకటిని ఇసివివరించింది. అలాగేఅభ్యర్థుల క్రమ సంఖ్యలు, నోటా ఎంపికను మరింత ప్రముఖంగా ప్రదర్శిం చాలని కూడా కమిషన్ నిర్ణయించింది. స్పష్టత కోసం ఫాంట్ సైజు 30 బోల్డ్‌లో ఉంటుంది. ఏకరూపతను కొనసాగించడానికి అభ్యర్థుల పేర్లు, నోటా ఒకే ఫాంట్ రకం, పరిమాణంలో కనిపిస్తాయి. అదనంగా, బ్యాలెట్ పత్రాలను 70 జిఎస్ఎం కాగితంపై ముద్రిస్తారు. అసెంబ్లీ ఎన్నికల కోసం పేర్కొన్న ఆర్‌జిబి విలువలతో కూడిన గులాబీ రంగు కాగితం ఉపయోగించనున్నట్లు ఇసి పేర్కొంది.

# 'సాగర'మే!

>> హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అన్ని విభాగాలు సమన్వయంతో ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలని ఆదేశించారు.

చాలా చోట్ల రోడ్లపై నీళ్లు నిలిచాయని, ట్రాఫిక్ కు అంతరాయం ఉన్నచోట్ల వెంటనే పోలీస్, హైడ్రా, ట్రాఫిక్ విభాగాలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాలు, నాలాలున్న చోట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇండ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. జివాచ్ఎంసీ, విద్యుత్తు విభాగాల అధికారులు వర్షం ఎక్కువ కురిసిన ప్రాంతాల్లో తగిన సహాయక చర్యలు చేపట్టాలన్నారు.

## వారం - వర్జ్యం

18-09-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, కృష్ణపక్షం
ద్వాదశి రా.11.27,
పుష్యమి ఉ.6.32
వర్జ్యం : రా.7.38-9.16
దు.ఉ.10.01-10.50, 2)మ.2.53-మ.3.42
శుభసమయం: ఉ.6.30-7.30
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** రాబోయే కాలములో చెల్లించవలసిన ధనమును గూర్చి, ఇప్పుడే ఘర్షణ పడవద్దు.

**వృషభం:** ఆర్థిక విషయములలో నిజముగా సహాయపడే వారెవరో మీరు గ్రహించగలుగుతారు.

**మిథునం:** మీలోని వ్యక్తిగత ప్రతిభ, మంచి తనమును కార్యాలయములోని ఉన్నతాధికారుల గుర్తింపునకు నోచుకుంటాయి.

**కర్కాటకం :** దూర ప్రాంతాలలోని ఆత్మీయుల క్షేమ సమాచారం ఆనందం కలిగిస్తుంది.

**సింహం:** మిత్రవర్గంతో కలిసి చర్చలు సాగిస్తారు. చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తిచేసారు.

**కన్య :** మాటల చాతుర్యంతో ఎంతటి వారినైనా ఆకట్టుకుంటారు. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి.

**తుల :** సన్నిహితుల సహాయంతో ముందుకు సాగుతారు. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృశ్చికం:** మీ తొందరపాటు మాటల వల్ల మిత్రులతో శతృత్వం ఏర్పడుతుంది.

**ధనుస్సు:** ముఖ్యులతో పరిచయాలు ఏర్పడతాయి. కొత్తపెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**మకరం:** ప్రయాణాలు లాభిస్తాయి. సంతానం వలన మానసిక శాంతి గోచరిస్తోంది.

**కుంభం:** వివిధ సమాచార సాధనములను వినియోగించి కొని తగిన ప్రయోజనాలను విజయాలను సాధిస్తారు.

**మీనం :** ఉద్యోగ, ఉన్నతావకాశములు లభిస్తాయి. రాజకీయ అధికార ప్రాప్తి సూచనలు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

>> పవర్ జనరేషన్ కార్పొరేషన్ కేంద్రాన్ని ఆశ్రయించింది. దీనిపై రూ.3756 కోట్లను 30 రోజుల్లో చెల్లించాలంటూ తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. ఇది అన్యాయమంటూ తెలంగాణ ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించగా కేంద్రం ఆదేశాలను న్యాయ స్థానం రద్దు చేసింది. విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల (పిపిఎల) ప్రకారం మధ్యవర్తిత్వం ద్వారా ఇరు రాష్ట్రాల విద్యుత్తు సంస్థలు ఈ వివాదాన్ని పరిష్కరించుకోవాలని సూచించింది. ఇక ఆంధ్ర డిస్కమ్‌ల నుండి టిఎస్ జెన్కోకు చెల్లించాల్సిన బకాయిలను సర్దుబాటు చేసిన తర్వాత, ఎపిజెన్కోకు చెల్లించాల్సిన బకాయిలు వడ్డీతో సహా దాదాపు రూ.4,887 కోట్లని, రూ.6,283 కోట్లు కాదని తెలంగాణ విద్యుత్ సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎపి జెన్కో సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్ సిజెఐ, జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనంఎదుట విచారణకువచ్చింది. బకాయిలు మొత్తంకాకపోయినా, కనీసం వివాదం లేని మొత్తాన్ని అయినా తెలంగాణ డిస్కంలు వెంటనే చెల్లించేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని ధర్మాసనం వద్ద ఎపి విద్యుత్ అధికారులు విజ్ఞప్తిచేశారు. అయితే, తక్షణమే మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం నిరాకరించింది. విషయ తీవ్రతను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం ఈ అంశంలో సమగ్ర విచారణ అవసరమని, డిసెంబరులో దీన్ని చేపడతామని స్పష్టం చేసింది.

# కొత్త విద్యావిధానం

>> డీజిల్ ఇంజిన్ మెకానిక్, ఫిట్టర్ వంటి సంప్రదాయ కోర్సులే నేటికీ ఐటిఐల్లో ఉన్నాయని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చాక ఆధునిక పారిశ్రామిక అవసరాలకు అవసరమైన నైపుణ్యాలు అందించే కోర్సులను అందించేందుకు ఐటీఐల్లో కోర్సులను మార్చామని, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రానున్న 25 ఏళ్ల వరకు విద్యా వ్యవస్థకు దిశానిర్దేశం చేసేలా తెలంగాణ విద్యా విధానం ఉండాలని సిఎం అన్నారు. ఆశించిన స్థాయిలో తెలంగాణ విద్యా విధానం అమలయ్యేందుకు వివిధ ఫౌండేషన్లు, ఎన్జీవోల సహకారం తీసుకోవాలని సిఎం సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమగ్రంగా వినియోగించుకునేలా విద్యా విధానం ఉండాలన్నారు. విద్యాభివృద్ధికి తీసుకునే రుణాలను ఎఫ్ఆర్‌బీఎం పరిమితి నుంచి తొలగించాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కోరామని సీఎం తెలిపారు. తెలంగాణ విద్యా విధానం ఛైర్మన్ కేశవరావు మాట్లాడుతూ విద్యా కమిషన్, ఇతర భాగస్వాములతో తాము విస్తృత సంప్రదింపులు చేశామన్నారు. గణాంకాల కన్నా నాణ్యత ప్రధానమని, విద్యార్థి కేంద్రంగా బోధన ఉండాలనేది తమ అభిప్రాయమన్నారు. ఎఐ వంటివి ఎన్ని వచ్చినా అవి గురువుకు ప్రత్యామ్నాయం కావన్నారు. విశ్రాంత ఐఎఎస్ అధికారి ఐ.వి.సుబ్బారావు దేశ యువతలో మూడో వంతు నీట్‌గాఉన్నారని...దాని అర్థం నాట్ ఇన్ ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ అని ఓ సర్వే తేల్చిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సేవలను విద్యా రంగానికి వినియోగించుకోవాలని, విద్యా వలంటీర్‌గా వినియోగించుకోవాలని కోరారు.

# 'తెలంగాణ రాజ్యాధికార పార్టీ'

>> మల్లన్న పార్టీజెండాను రెండురంగులతో ప్రత్యేకంగా రూపొందించారు. జెండాపై ఆత్మగౌరవం, అధికారం, వాటాఅనే నినాదాన్నికూడా ముద్రించారు. ఈకార్యక్రమంలో పలువురు బిసి మేధావులు, ఉద్యమకారులు పాల్గొన్నారు. కాగా కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్సీ అయిన తీన్మార్ మల్లన్న ఆ తర్వాత పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినట్లు పెద్దఎత్తున ఆరోపణలు వచ్చాయి. బిసి కులగణన సర్వేపై అనుచిత వ్యాఖ్యలు, పార్టీ విధానాలు ఉల్లంఘించడం వంటి చర్యలకు పాల్పడినట్లు కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్ అయ్యింది. దీంతో పిసిసి క్రమశిక్షణ కమిటీ ఈ యేడాది ఫిబ్రవరి 5న ఆయనకు షోకాజ్ నోటీసు జారీ చేసింది. అయితే మల్లన్న నుంచి ఎలాంటి వివరణ రాకపోవడంతో మే 1న కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయన్ని సస్పెండ్ చేశారు. ఈ మేరకు బిసి భావజాలాన్ని ప్రజల్లోకి మల్లన్న బలంగా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా తెలంగాణ రాజ్యాధికార పార్టీని ప్రకటించారు.

# నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ర్యాగింగ్

## కేసునమోదు చేసిన పోలీసులు

**హైదరాబాద్ (నాచారం), సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ర్యాంగింగ్ ఘటన కలకలం రేపింది. దీంతో నాచారం పోలీసులు కేసు నమోదుచేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గత నెల 29న ఓ విద్యార్థి పుట్టిన రోజు వేడుకల్లో ర్యాగింగ్ పేరుతో తోటి విద్యార్థులు ప్రైవేట్ పార్ట్స్‌పై కాళ్లతో తన్ని వెకిలి చేష్టలు చేశారు. దీంతో ఓ బాలుడు గాయాలపాలయ్యాడు. నాచారం పోలీసుల కథనం ప్రకారం.. కొత్తపేటకు చెందిన విద్యార్థి(14) నాచారంలోని ఢిల్లీ పబ్లిక్‌స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆగస్టు 29న పుట్టినరోజు కావడంతో తోటి విద్యార్థులు మధ్యాహ్నం విరామ సమయంలో సరదాగా చేసిన చేష్టలతో ఆ విద్యార్థి మర్మంగాలకు గాయమై రక్తంవచ్చింది. విషయం తెలుసుకున్న ప్రిన్సిపల్ ఆ విద్యార్థిని ఆసుపత్రికి తరలించి తల్లిదండ్రులకు సమాచారంఇచ్చారు. తల్లిదండ్రులు మెరుగైన వైద్యం కోసం బంజారాహిల్స్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. మర్మంగాల నుంచి రక్తం రాకుండా చేసిన శస్త్ర చికిత్సతో ప్రాణాపాయం తప్పింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో బాధ్యులైన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. దీంతో వారు డిపిఎస్ స్కూల్‌పై నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కాల్పుల విరమణ ప్రకటన వేళ

# నెత్తురోడిన ఛత్తీస్‌గఢ్

## ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు పౌరులను హతమార్చిన మావోయిస్టులు

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు నక్సల్స్ హతం

**రాయ్‌పూర్, సెప్టెంబరు 17:** ఆయుధాలు వదిలేస్తాం... శాంతి చర్చలకు సిద్ధం, ఓ నెల రోజుల పాటు యాంటీ- మావోయిస్టుల ఆపరేషన్ నిలిపివేయాలని కోరుతూ మావోయిస్టులు ప్రకటించిన 24 గంటల్లోనే నక్సల్స్ దుశ్చర్యకు పాల్పడారు. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్, దంతేవాడ జిల్లాల్లో ఇద్దరు పౌరులను పోలీస్ ఇన్‌ఫార్మర్ల నెపంతో హతమార్చారు. ఈ రెండు ఘటనలు మంగళవారం అర్ధరాత్రి జరిగినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. అటు బీజాపూర్ జిల్లాలో భద్రతా బలగాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా బుధవారం మధ్యాహ్నం 3గం.ల సమయంలో మావోయిస్టులు ఎదురుపడగా, కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతిచెందినట్లు బీజాపూర్ పోలీసులు తెలిపారు. ఘటనా స్థలం నుంచి ఒక 303 రైఫిల్, ఒక బ్యారెల్ గ్రనేడ్ లాంచర్(బీజీఎల్), పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

# అమెరికా నేతలు అవినీతిపరులు

## పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్

**ఇస్లామాబాద్, సెప్టెంబరు 17:** ఓ పక్క పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అమెరికా పర్యటనకు రంగం సిద్ధం చేసుకుంటుంటే.. మరోవైపు ఆయన మంత్రివర్గ సభ్యులు మాత్రం అగ్రరాజ్యాన్ని ఇరుకున పడేస్తున్నారు. తాజాగా ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అమెరికా నేతలు అవినీతిపరులని.. వారు ఇజ్రాయెల్ నుంచి లంచాలు స్వీకరిస్తున్నారని ఆరోపించారు. పాక్‌కు చెందిన జియో టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ మాట్లాడుతూ 'మేము లంచాలు స్వీకరించామని తీవ్ర అపవాదులు ఎదుర్కొన్నాం. కానీ, అమెరికా రాజకీయ నాయకులు ఇజ్రాయెల్ నుంచి బహిరంగంగానే లంచాలు తీసుకున్నారు. అదే నేను లంచం స్వీకరించాల్సి వస్తే.. ఎక్కడో చాటుగా తీసుకుంటాను. మేము నిందలు మోశాం కానీ.. వారు బహిరంగంగానే చేస్తున్నారు' అని అన్నారు. అమెరికా మిలిటరీ అధికారులు, ప్రతినిధుల సభ సభ్యులు, ఉన్నత స్థాయి పాలకులు తాము ఇజ్రాయెల్ నుంచి నిధులు అందుకున్నట్లు అంగీకరించారన్నారు.



**ట్రంప్‌నకు షాకిచ్చిన ఇషాక్‌దార్!**

మరోవైపు పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్‌దార్ ఏకంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు షాక్ ఇచ్చారు. భారత్ ఎప్పుడూ మూడో దేశం మధ్యవర్తిత్వాన్ని అంగీకరించలేదన్నారు. ఆయన అల్-జజీరాతో మాట్లాడుతూ 'మూడో పక్షం పాత్ర ఉన్న మేము ఏమీ అనుకోం. ఆది ద్వైపాక్షిక అంశమే అని భారత్ పేర్కొంది. సరే ఏ చర్చలు జరిగినా.. ఉగ్రవాదం, వాణిజ్యం, జమ్మూకాశ్మీర్‌పై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆర్మీ చీఫ్ అసిం మునీర్ త్వరలోనే అమెరికాలో పర్యటించనున్నారు.



దిశాపటాని ఇంటి వద్ద కాల్పులు జరిపిన

# నిందితుల ఎన్‌కౌంటర్!

## గోల్డీబ్రార్ గ్యాంగ్ సభ్యులుగా పోలీసులు వెల్లడి

**లక్నో, సెప్టెంబరు 17:** బాలీవుడ్ నటి దిశాపటాని ఇంటివద్ద కాల్పులు జరిపిన ఇద్దరు నిందితులను తప్పించుకుంటున్న తరుణంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.రోహిత్ గోదారా గోల్డీబ్రార్ గ్యాంగ్ సభ్యులుగా ఉన్న వీరిద్దరూ బరేలిలోని దిశాపటాని నివాసం వదనద కాల్పులుజరిపారు. గజియాబాద్‌సమీపంలోని ట్రోనికా సిటీవద్ద వీరిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తుండగా నిందితులు ఎదురుదాడికి దిగడంతో ఆత్మరక్షణార్థం జరిగిన కాల్పుల్లో చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌ను ఢిల్లీపోలీస్ స్పెషల్‌సెల్, యుపి ఎస్‌టిఎఫ్, హర్యానా ఎస్‌టిఎఫ్‌లు సంయుక్తంగా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. హర్యానాలోని రోహతక్‌కు చెందిన రవీందర్ ఒకరుకాగా అదేరాష్ట్రంలోని సోనిపట్‌కు చెందిన అరుణ్‌గా రెండో నిందితుడిని గుర్తించారు. ఎస్టీఎఫ్ స్పెషల్ సెల్ పోలీసులకు కూడా గాయలయ్యాయని ఎస్టీఎఫ్ అధికారులు తెలిపారు.బరేలి కాల్పుల్లో వీరిద్దరే పాల్గొన్నట్లు ఆధారాలునాననయని, హైప్రొఫైల్ ప్రముఖలను బెదిరించి బ్లాక్‌మెయిల్‌చేయడం వీరికి అలవాటు అని వ్యూహాత్మకంగా వారిని బెదిరించి ఆపై సొమ్ములు భారీ మొత్తం డిమాండ్‌చేస్తారని ఢిల్లీ స్పెషల్‌పోలీసులు తెలిపారు. నటి దిశాపటాని బరేలి నివాసం వద్ద తెల్లవారుఝామున 3.45 గంటలకు ఈనెల 12వ తేదీ అనేకరౌండ్లు కాల్పులుజరిపి భయభ్రాంతులకు గురిచేసారు. బరేలిలోని కొత్వాలి పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదయింది. సీఎంయోగి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నోయిడా యూనిట్‌ఎస్‌టిఎఫ్, ఢిల్లీ పోలీసులు నిందితులిద్దరినీ ట్రోనికా సిటీవద్ద గుర్తించారు. పోలీసులను చూసినవెంటనే వీరు కాల్పులుజరపడంతో పోలీసులు కూడా ఎదురుకాల్పులుజరిపారు. వీరిద్దరో గోల్డీబ్రార్ గ్యాంగ్‌లో చురుకుగా ఉన్నారని రవీంద్రకు గతంలో అనేక కేసులతో సంబంధం ఉందని కూడా ఎడిజి తెలిపారు.

# అప్పుల బాధతో ఇద్దరు రైతుల బలవన్మరణం

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** వ్యవసాయం కలసి రాక, అప్పుల్లో కూరుకుపోయి వాటిని తీర్చే మార్గం లేక రాష్ట్రంలోని పలువురు రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ విధంగానే రాష్ట్రంలో ఇద్దరు రైతులు అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలు రాజన్న సిరిసిల్ల, వరంగల్ జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. స్థానికుల వివరాలు ప్రకారం రాష్ట్రంలోని రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని సేవాలాల్ తండాకు చెందిన భూక్య శంకర్ నాయక్ (55)కు భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు. ఇద్దరు కూతుర్ల పెండ్లిళ్లు గతంలోనే చేశారు. ఆయనకు నాలుగెకరాల పొలం ఉన్నది. అందులో వరి సాగు వేయగా సరైన దిగుబడి రాలేదు. మరోపక్క రెండేండ్ల క్రితం ఇల్లు కట్టుకున్నారు. అప్పుడు రూ.5 లక్షల దాకా అప్పు చేశారు. అప్పటి నుంచి వ్యవసాయంలో నష్టాలు వస్తూ చేసిన అప్పులు పెరిగి వాటిని ఎలా కట్టాలో తెలియక ఆందోళన చెందారు. దీంతో మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి పొలానికి వెళ్లి బావి వద్ద చెట్టుకు ఉరేసుకుని ప్రాణాలు కోల్పోయారు. అలాగే వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం రామవరంలో ఉడుత అఖిల్ (22) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉన్నారు. ఐదేండ్ల క్రితం తండ్రి గట్టయ్య మృతి చెందడంతో అఖిల్ వ్యవసాయం చేస్తున్నారు. తనకున్న మూడున్నర ఎకరాల్లో మక్కజొన్న, పత్తి, వరి సాగు చేస్తున్నారు. పంటలకు పెట్టుబడిగా రూ.5 లక్షల మేరకు అప్పులు చేశాడు. వారం రోజుల నుంచి యూరియా బస్తాల కోసం తిరుగుతుండటంతో పొలం వద్దకు వెళ్లలేకపోయారు. దీంతో కోతులు మక్కజొన్న, పత్తిని పాడు చేశాయి. ఆర్థికఇబ్బందుల్లో ఉన్న అఖిల్ అప్పులు ఎలా తీర్చాలో తెలియక వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన గడ్డిమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డారు.

# మై ఫ్రెండ్ నరేంద్ర..!

## ప్రధాని మోడీకి అమెరికా అధ్యక్షుడు ఫోన్

## జన్మదిన శుభాకాంక్షలు చెప్పిన డొనాల్డ్ ట్రంప్

## పలువురు దేశాధినేతల నుంచి అభినందనలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మంగళవారం అర్ధరాత్రి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫోన్ చేశారు. తెల్లారితే మోడీ 75వ జన్మదినం... ఈసందర్భంగా ట్రంప్, మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దాదాపు 37 నిముషాలు పాటు ఇరువురు ఫోన్‌లో సంభాషించుకున్నట్లు సోషల్ మీడియాలో ఇరువురు నేతలు వెల్లడించారు. "నా మిత్రుడు భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఫోన్ చేశా. జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశా. నరేంద్ర అద్భుతంగా పనిచేస్తున్నారు. రష్యా - ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని ముగించడంలో మద్దతు ఇస్తున్నందుకు ధన్యవాదాలు' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ ఖాతాలో వెల్లడించారు.

'75వ పుట్టినరోజు సందర్భంగా ఫోన్ చేసిన శుభాకాంక్షలు తెలిపినందుకు మిత్రుడు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ధన్యవాదాలు. మీలాగే నేను కూడా భారతదేశం - అమెరికా సమగ్ర, ప్రపంచ భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి పూర్తిగా కట్టుబడి ఉన్నాను. ఉక్రెయిన్ వివాదానికి శాంతియుత పరిష్కారం కోసం మీరు చేసే చొరవలకు తాము మద్దతు ఇస్తున్నాము' అని ప్రధాని మోడీ తన ట్విట్టర్ ఖాతాలో రాసుకొచ్చారు. భారత్‌పై అదనపు సుంకాల విధింపు, రష్యాతో చమురు కొనుగోలు నిలిపేయాలని అమెరికా ఒత్తిడి చేయడంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య, దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ నేపథ్యంలో ట్రంప్, ప్రధాని మోడీకి ఫోన్ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

**మోడీకి శుభాకాంక్షల వెల్లువ**

రష్యా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, చైనా తదితర దేశాధినేతలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, కేంద్ర మంత్రులు, ఎన్‌డీఏ నేతలు, వివిధ రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్య మంత్రులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ట్విట్టర్‌లో ట్వీట్స్ చేశారు. మోడీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆలయాలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. నరేంద్రమోడీ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ హోమాలు చేశారు.

# ఎడిఇ అంబేద్కర్ బినామీలపై రెండవ రోజునా దాడులు

## వారం రోజుల కస్టడీకి ఎసిబి పిటిషన్

## బినామీలను కూడా అరెస్టు చేసే అవకాశం

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** టిజిఎస్‌పిడిసిఎల్ చరిత్రలో తొలిసారిగా ఎసిబికి పట్టుబడ్డ అక్రమార్క అధికారి ఎడిఇ ఏరుగు అంబేద్కర్ రిమాండు రిపోర్టులో సంచలన విషయాలు వెలుగు చూశాయి. అంబేద్కర్ వద్ద 250 కోట్ల రూపాయల ఆస్తులను ఎసిబి గుర్తించగా ఈ కేసులో మ రిన్ని విషయాలను వెలుగులోకి తెచ్చేందుకు వారం రోజుల పాటు కస్టడీ కోరాలని ఎసిబి నిర్ణయించినట్లు సమాచారం. దీనిపై గురువారం నాడు కో ర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. మరోవైపు అంబేద్కర్ బినామీలపై బుధవారం కూడా ఎసిబి దాడులు నిర్వహించి వారి వద్ద కూడా కోట్లాది రూపాయల ఆస్తులున్నట్లు నిర్ధారించింది. బినామీల అరెస్టుకు ఎసిబి రంగం సిద్ధం చేసిందని తెలిసింది. టిజిఎస్‌పిడిసిఎల్ ఇబ్రహీంబాగ్ డివిజన్ ఎడిఇగా వున్న అంబేద్కర్‌ను ఎసిబి అధికారులు మంగళవారం ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో అరెస్టు చేయడం తెలిసిందే. అనంతరం అతన్ని రిమాండులో భాగంగా చంచల్‌గూడ జైలుకు తరలించడం విదితమే. ఈ సందర్భంగా మూడు కోట్ల రూపాయల నగదుతో పాటు రాష్ట్రంలోని పలుచోట్ల వ్యవసాయ పొలాలు, నివాస ప్లాట్లు, సూర్యాపేటలో ఓ రసాయన పరిశ్రమ, కోట్ల రూపాయల విలువచేసే బంగారు నగలు, ఖరీదైన కార్లు, టూ వీలర్లు పట్టుబడ్డాయి. ఈ క్రమంలో పదిచోట్ల 15 బృందాలతో ఎసిబి అధికారులు దాడులు నిర్వహించి అంబేద్కర్ బంధువులు, సన్నిహితుల ఇళ్లలో దాడులు నిర్వహించి అక్రమాస్తులను వెలికితీశారు. వీటి విలువ బహిరంగ మార్కెట్లో 250 కోట్ల రూపాయలుగా తేల్చారు. ఇటీవలే టిజిఎస్‌పిడిసిఎల్‌లో చేరిన అంబేద్కర్ అంతకు ముందు బల్దియాలో ఎఈగా పనిచేశారు. ఆ సమయ ంలో ఇతనిపై అనేక ఆరోపణలు వచ్చాయి. విద్యుత్ శాఖలో చేరాక అంబేద్కర్ అవినీతి తారాస్థాయికి చేరిందని ఎసిబి విచారణలో తేలింది. ఇదే వి షయాన్ని ఎసిబి అధికారులు కోర్టుకు సమర్పించిన రిమాండు రిపోర్టులో వెల్లడించారు. ఇంతకు ముందు అంబేద్కర్‌పై విజిలెన్స్ విభాగం సర్కారుకు అందించిన నివేదికను కూడా ఎసిబి అధికారులు కోర్టుకు ఇచ్చినట్లు తెలిసింది. అంబేద్కర్ కోట్ల రూపాయలను అక్రమంగా సంపాదించడానికి పటాన్ చెరువు పారిశ్రామిక వాడ, కెపిహెచ్‌బి, గచ్చిబౌలిలోని ఐటి కారిడార్ లలో గల హైరైజ్ భవనాలు ముఖ్య కారణంగా ఎసిబి తేల్చింది. ఇక్కడ భారీగా హెచ్‌టి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాల్సి వుండడంతో లోడ్ నెపంతో నిర్వాహకుల నుంచి కోట్లాది రూపాయలు లంచంగా తీసుకున్నట్లు ఎసిబి తేల్చింది. ఇక వట్టినాగుల పల్లిలో వివాదంలో వున్న రియల్ ఎస్టేట్ వెంచర్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వరాదని హైకోర్టు ఆదేశాలు వున్నా వాటిని అంబేద్కర్ ఖాత రు చేయకుండా లంచాలు తీసుకుని ఇచ్చినట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో అంబేద్కర్‌ను మరింతగా విచారించేందుకు వారం రో జుల పాటు తమ కస్టడీకి తీసుకుని విచారించాలని ఎసిబి అధికారులు భావిస్తున్నారు. దీనిపై గురువారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. మరోవైపు అంబేద్కర్ బినామీలుగా ఎసిబి అధికారులు గుర్తించిన టిజిఎస్‌పిడిసిఎల్ అధికారులు పలువురి ఇళ్లపై బుధవారం దాడులు జరిగాయి. వీర ంతా రంగారెడ్డి జిల్లాలో పలుచోట్ల పనిచేస్తున్నట్లు సమాచారం. వీరి వద్ద కూడా కోట్లాది రూపాయల ఆస్తులు గుర్తించినట్లు తెలిసింది. వీరిని ఒకటి రెండు రోజుల్లో అరుస్టు చేసే వీలుంది.

# శాస్త్రీయ సామ్యవాదానికి తిరుగులేదు

## ముస్లిం వ్యతిరేక పోరాటంగా ఆర్ఎస్ఎస్, బిజెపి చిత్రీకరణ

## తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపుసభలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంఎ బేబీ

**ఖమ్మం, ప్రభాతవార్త :** శాస్త్రీయ సామ్యవాదానికి తిరుగు లేదని సీపీఐ (ఎం) అఖిల భారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ అన్నారు. మోడీ, షా, ఆర్ఎస్ఎస్ త్రిశూలంలా వ్యవహరిస్తూ మెజార్టీ ప్రజానీకాన్ని మత ప్రాతిపదికన విభజించాలని చూస్తున్నాయని తెలిపారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని సైతం వక్రీకరించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం రాత్రి నిర్వహించిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సభలో బేబీ ముఖ్య వక్తగా హాజరయ్యారు. సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన



ఏర్పాటు చేసిన ఈ సభకు ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరులకు జోహార్లు తెలుపుతూ ఎంఏ బేబీ ప్రసంగించారు. సాయుధ పోరాట ఫలితంగానే కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో తొలుత భూ సంస్కరణలు అమలు అయ్యాయని, ఆ తర్వాతే దేశవ్యాప్తంగా విస్తరించారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ ఎక్కడ స్వాతంత్రం కోసం, నైజాం ప్రభువుకు వ్యతిరేకంగా పోరాడ లేదన్నారు. మోడీ, షాకు మాత్రమే రక్షణ మంత్రిగా వ్యవహరిస్తున్న రాజ్‌నాథ్‌సింగ్ వీర తెలంగాణ పోరాటానికి మతం రంగు పులుముతున్నారని ఆరోపించారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో.. పార్టీ 24వ జాతీయ మహాసభల్లో తీసుకున్న నిర్ణయం మేరకు విశాల ప్రాతిపదికన ఎర్రజెండా ఉనికిని విస్తరింప చేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ విద్యావేత్త ఐ వీ రమణారావు బేబీ ఉపన్యాసాన్ని తెలుగులోకి అనువదించారు. సెప్టెంబరు 17వ తేదీని ఆయా పార్టీలు విద్రోహ దినం, విలీన దినం, విమోచన దినంగా పేర్కొంటున్నాయన్నారు. ఎవరెలా చెప్పినా సాయుధ పోరాటం ఎర్ర జెండా పోరాటం తప్ప మరి ఏదీ కాదన్నారు.

# విద్యుత్ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం

## ఇంధన పనితీరు, సామర్థ్యం పెంపు

## వినూత్న సాంకేతిక పరిజ్ఞానంవైపు అడుగులు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** దేశంలోని ఇంధన ప్రధానంగా విద్యుత్ పరిశ్రమ సామర్థ్యం, పనితీరును మెరుగుపరచడానికి కేంద్రం అత్యధిక ప్రాధాన్యత నిస్తోంది. ఇదే సమయంలో విద్యుత్ రంగ సామర్థ్యం పెంపుదలతో పాటు, డౌన్‌టైమ్, కార్యాచరణ, నిర్వహణ ఖర్చులను తగ్గించేందుకు వినూత్న సాంకేతిక పరిజ్ఞానాలను వినియోగించే దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఇందుకు గాను ఇంధన రంగంలో కృత్రిమ మేధస్సు, యంత్రాల వినియోగం (ఎ1, ఎమ్‌ఎల్) వంటి సాధనాలను ఉపయోగించడం ద్వారా డేటా ప్రాసెసింగ్‌ను వేగవంతం చేస్తాయని కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు భావిస్తున్నాయి. అధునాత సెన్సార్లు, టెలిమెట్రీ వ్యవస్థలు రియల్ టైమ్ డేటాను పంపడంలో ఎ1/ఎమ్‌ఎల్ తదిత వాటిని నిర్వహించేందుకు శిక్షణ ఇవ్వనుంది. తద్వారా లోపాలను ముందుగానే గుర్తించి వాటిని నివారించడం, తద్వారా ఖర్చులను నియంత్రించవచ్చని అంచనా వేస్తోంది. దీనికి సంబంధించి ఈ నెల 24, 25 తేదీల్లో ఢిల్లీలోని లె మెరిడియన్‌లో ఇంటరాక్టివ్ ఇటి ఎనర్జీ వరల్డ్ వర్క్‌షాప్ జరపాలని నిర్ణయించింది. కాగా పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడానికి, ఉద్యోగాల సృష్టిని పెంచడానికి మరియు పునరుత్పాదక శక్తిని స్వీకరించడాన్ని వేగవంతం చేయడానికి, తద్వారా ఉద్గారాలను తగ్గించడానికి ఈ మార్పుల సామర్థ్యాన్ని కూడా కొత్త నిబంధనలలోకి వస్తున్నాయి. మరో కీలక అంశం ఓపెన్‌యాక్సరీ ఛార్జీల హేతుబద్ధీకరణ చేపడుతోంది. కొన్ని రాష్ట్ర నియంత్రణ కమిషన్లు విధించిన అధిక ఛార్జీలు గతంలో వినియోగ దారులచే ఓపెన్‌యాక్సలరీలను సమర్థవంతంగా ఉపయోగించడాన్ని అడ్డుకున్నాయి. సవరించిన నియమాలు దేశవ్యాప్తంగా ఈ ఛార్జీలను మరింత సహేతుకమైన మరియు ఏకరీతిగా ఉండేలా చేయడం, వాణిజ్య సంస్థలు మరియు పరిశ్రమలు పోటీ ధరలకు విద్యుత్తును పొందేందుకు వీలుకల్పిస్తాయని అంటున్నారు. అదనంగా, నియమాలు ఖర్చు ప్రతిబింబించే టారిఫ్లను తప్పనిసరి చేయడం ద్వారా విద్యుత్ రంగం ఆర్థిక స్థిరత్వాన్ని సూచిస్తాయని అంచనా వేస్తోంది. ఆమోదించబడిన వార్షిక రాబడి అవసరాలు, ఆమోదించబడిన టారిఫ్ల నుండి అంచనా వేయబడిన వార్షిక రాబడి మధ్య ఏదైనా అంతరం సహజ వైపరీత్యాల వంటి అసాధారణ పరిస్థితులలో మినహా కనిష్టంగా ఉంచబడు తుందని ఇంధన మంత్రిత్వ శాఖ స్పష్టం చేస్తోంది.

# మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ కట్టుబాటు

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** మహిళ సాధికారత కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండటమే కాకుండా చిత్తశుద్ధితో పనిచేస్తోందని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం గాంధీభవన్ ప్రకాశం హాల్‌లో పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా మదర్‌సొసైటీ చైర్మన్ సంధ్యారెడ్డి కుట్టమిషన్లను పంపిణీచేశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ కోటీ మంది మహిళలను కోటీశ్వరులు చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందని పునరుద్ఘాటించారు. ప్రభుత్వ పరంగా బిసి, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల నుంచి కుట్టు మిషన్ల కోసం బడ్జెట్ మంజూరు కోసం డిప్యూ టీ సిఎంతో చర్చిస్తా అని హామీ ఇచ్చారు. జనహిత పాదయాత్రలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల మహిళల కళ్లలో చూసిన ఆనందం మాటల్లో చెప్పలేను అని అన్నారు. చదువుకున్న వారి జీవితం కలర్ టీవీ లాంటిది. నిరక్షరాస్యులు జీవితం బ్లాక్ అండ్ వైట్ టీవీ లాంటిదని ఆయన అభిప్రాయపడ్డారు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన కల్పించడానికి మదర్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. మదర్ ఫౌండేషన్ చైర్మన్ బొజ్జ సంధ్యారెడ్డి మాట్లాడుతూ విలీనంరోజు ఇలాంటి కార్యక్రమం చేపట్టడం అభినంద నీయమని అన్నారు. కర్ణాటక, తెలంగాణలో తప్ప మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఎక్కడ లేదని ఇలాంటి పథకాలు నడపడం ఆషామాషీ కాదని అన్నారు.




బుధవారం గాంధీభవన్‌లో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

# తెలుగు రాష్ట్రాల్లో బంగారు నగల దుకాణాలపై ఐటి దాడులు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో బంగారు నగల దుకాణాలపై బుధవారం నాడు ఐటి అధికారులు దాడులు నిర్వహించా రు. బంగారం కొనుగోలులో పన్ను చెల్లింపులో భారీగా అక్రమాలు జరిగినట్లు గుర్తించిన ఐటి అధికారులు ఇందులో భాగంగా హైదరాబాద్, విజయవాడ, వరంగల్‌లలో 15 బృందాలతో సోదాలు నిర్వహించారు. ముఖ్యంగా క్యాప్స్ గోల్డ్ కంపెనీ దుకాణాలపై ఐటి అధికారులు అనేకచోట్ల సోదాలు చేశారు. మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ నుంచి క్యాప్స్ గోల్డ్ కంపెనీ భారీగా బంగారం కొనుగోలు చేసి, వాటిని రిటైల్ దుకాణాలకు అమ్మిన సమయంలో పన్నులు సక్రమంగా చెల్లించలేదని ఐటి అధికారులు గుర్తించారు. బంజారాహిల్స్‌లోని క్యాప్స్ గోల్డ్ ప్రధాన కార్యాలయంలో ఆరు గంటలకు పైగా ఐటి అధికారులు సోదాలు నిర్వహించి పలు పత్రాలను జప్తు చేశారు. దీంతోపాటు ఈ కంపెనీకి అనుబంధంగా వున్న హెచ్ సేల్ అనే మరో సంస్థపైనా ఐటి అధికారులు దాడులు చేశారు. ఈ కంపెనీతో పాటు మరో నాలుగు బంగారు నగల దుకాణాలు బ్లాక్ మార్కెట్‌లో బంగారం కొంటూ నగలను తయారుచేస్తున్నట్లు ఐటి అధికారులకు సమాచారం అందినట్లు తెలిసింది.

**వాసవి రియల్ ఎస్టేట్ కంపెనీ కార్యాలయాల్లోనూ సోదాలు**

ఇదిలా ఉండగా వాసవి రియల్‌ఎస్టేట్ కంపెనీ కార్యాలయాల్లోనూ ఐటి అధికారులు ఇదే సమయంలో సోదాలు నిర్వహించారు. వాసవి రియల్ ఎ స్టేట్ సంస్థపై ఇటీవల వచ్చిన ఆరోపణలపై ఈ దాడులు జరిగినట్లు తెలిసింది. దాడుల సందర్భంగా పలుచోట్ల పత్రాలను ఐటి అధికారులు జప్తు చేశారు.



# మధుయాష్కిగౌడ్‌కు మంత్రులు వివేక్, పొన్నం పరామర్శ

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** స్వల్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ ని మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొన్నం ప్రభాకర్ గౌడ్ పరామర్శించారు. బుధవారం బంజారా హిల్స్ లోని ఆయన నివాసానికి వచ్చి మంత్రులు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తగిన విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.

# ఎన్నికల ప్రణాళిక అమలు చేయండి

## నిరుద్యోగులు అధైర్య పడకండి.. ఆందోళన బాట పట్టకండి

## మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

**హైదరాబాద్ సెప్టెంబరు17,ప్రభాతవార్త:** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా నిరుద్యోగుల ఆహ్వానం మేరకు బుధవారం గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్తూపానికి మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే నివాళులర్పించారు.మేనిఫెస్టో హామిలకు అనుగుణంగా యువతకు ఉద్యోగ అవకాశాలు భర్తీ చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులు పోషించిన పాత్ర వెలకట్టలేనిదని,కాంగ్రెస్ ప్రభుత్వం అనుకున్నస్థాయిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.రాష్ట్రంలో నిరుద్యోగ యువత కష్టాల్లో ఉన్నారని . ప్రభుత్వానికి, నిరుద్యోగులకు మధ్య వారధిగా పనిచేస్తానని రాజగోపాల్ ప్రకటించుకొన్నారు.ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలని నిరుద్యోగ యువత చేస్తున్న డిమాండ్ సరైనదే అని రాజగోపాల్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. నిరుద్యోగులకు దారి చూపించే బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని, నిరుద్యోగులకు ఉపాదికల్పన చేసి కాపాడుకునే బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. గ్రూప్-1 అవకతవకలపై ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్తామని చెప్పారు.నిరుద్యోగులు అధైర్య పడకండి నిరసనలు ధర్నాలు మానుకోండి మీ సమస్యలు వినడానికి అవసరమైతే అశోక్ నగర్ చౌరస్తా, సెంట్రల్ లైబ్రరీకి, దిల్‌సుఖ్‌నగర్‌కు నేనే వస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

# ఎసిబి వలలో తహశీల్దార్, గిర్దావర్, ఆపరేటర్

**తల్లాడ, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** 15 కుంటల భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ. 10 వేలు డిమాండ్ చేయడంతో ఇష్టం లేని రైతు ఏసిబిను ఆశ్రయించడంతో ముగ్గురిని ఏసిబి డిఎస్‌పి ఆధ్వర్యంలో సిబ్బంది పట్టుకుని కేసు నమోదు చేశారు. ఏసిబి డిఎస్‌పి వై. రమేష్ వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు ఇటీవల ప్రభుత్వం భూ భారతి కార్యక్రమంలో భాగంగా పట్టా కోసం దరఖాస్తు చేయగా పాస్‌బుక్ కోసం రెవెన్యూ అధికారులను సంప్రదించగా రూ. 12 వేలు డిమాండ్ చేయగా అంత ఇవ్వలేనని చెప్పి రూ. 10 వేలకు ఒప్పుకోగా బుధవారం సాయంత్రం రూ. 10 వేలకు రూ. 200 తగ్గించి ఇస్తుండగా తహశీల్దార్ వి. సురేష్‌కుమార్, గిర్దావర్ భాస్కర్, ధరణి ఆపరేటర్ రాథోడ్‌ను పట్టుకుని రిమాండ్‌కు తరలించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం డిమాండ్‌చేస్తే తమను సంప్రదించాలని కోరారు. అయితే రైతు ప్రభుత్వ కార్యాలయాల్లో డబ్బులు డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ 1064కు ఫిర్యాదు చేయాలని కోరారు.




వార్త

మీ ప్రతిమాటనూ, చర్యనూ పొగిడేవారి గురించి పట్టించుకోకూడదు. మీ పొరపాట్లను చెప్పగలిగేవారి గురించి ఆలోచించాలి.

-డబ్ల్యు ఎమర్సన్

# వలసల బెడద !

ప్రపంచంలోని ఎన్నో దేశాల ప్రజలు ఇతర దేశాలకు బ్రతుకు తెరువు కోసం వలస వెళ్తున్నారు. కొన్ని దేశాలు కరవుతో అల్లాడుతుంటే మరికొన్ని దేశాలు యుద్ధ జ్వాలల్లో చిక్కుకునినిలువ నీడ, ఆకలి దప్పులు తీరే దారిలేక శరణార్థులుగా ఇతర ప్రత్యామ్నాయ ప్రాంతాలను ఎంచుకుంటున్నాయి. నిన్నగాక మొన్న బ్రిటన్ ప్రజలు తమ దేశంలోకి వస్తున్న వలసదారుల సంఖ్య పెరిగిపోయిందన్న ఆందోళనతో తమ దేశాన్ని తమకే వదిలేయాలన్న డిమాండ్‌తో వీధుల కెక్కారు. నియంత్రణ లేని వలసలతో బ్రిటన్ వేగంగా పతనమైపోతోందంటూ ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మాస్క్ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయవాద నేత టామీ రాబిన్సన్ నేతృత్వంలో లక్ష మందికిపైగా నిరసనకారులు యుకె జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు పాలస్తీనా, ఇస్లామిక్ స్టేట్ జెండాలను చించి నిరసన ప్రకటించారు. రాబిన్సన్ బృందాన్ని జాత్యహంకారులుగా చిత్రీకరించి ఒక రకంగా అంతర్యుద్ధాన్నే తలపించారు. ఆఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాల నుంచి వలసల ద్వారా వచ్చే శరణార్థుల సంఖ్య పెరిగిపోతోందని, వారిలో నేర స్వభావం ప్రబలుతోందని బ్రిటన్ వాసుల ఆరోపణ. యు.కెలో ప్రస్తుతం 2024 నాటికి 5 లక్షల మందికిపైగా శరణార్థులు ఆశ్రయం పొందుతున్నారు. చట్ట విరుద్ధంగా అంతకుమించే ఉండొచ్చుననే అంచనా ఉంది. ఇదిలా ఉండగా గతవారం గాజాలో కాల్పుల విరమణ అంశంపై చర్చించేందుకు దోహా సమావేశంలో హమాస్ నేతలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. ఇది తన ప్రతిపాదన మేరకు జరిగిన సదస్సు అయినా మరోపక్క ఇజ్రాయెల్ వైమానిక దాడులకు పాల్పడడంతో అమెరికా ఆగ్రహం వెలిబుచ్చింది. గాజా విషయం ఎంతో తీవ్రతరమైన విషయం. ఆచితూచి స్పందించాల్సి ఉన్నా ఇజ్రాయెల్ దూకుడుకు కళ్లెం వేయడం అమెరికాకు కూడా సాధ్యమయ్యేటట్లు లేదు. గాజాలో పరిస్థితి అతి భయానకంగా ఉంది. పది లక్షల మంది పాలస్తీనియన్లు తలదాచుకుంటున్న నగరం 'గాజా' కాగా ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులతో ఆకాశహర్మ్యాలను సైతం కూల్చేస్తోంది. భవన శిథిలాల కింద కనిపించేవన్నీ హృదయ విదారకదృశ్యాలే. గాజా సిటీలో తలదాచుకున్న పాలస్తీనీయులు దక్షిణ ప్రాంతంలోని తీర ప్రాంతంవైపు పరుగులు తీస్తున్నారు. తాజా దాడుల్లో వందకుపైగా జనం మృతి చెందారు. గాజాసిటీలో హమాస్ మిలిటెంట్లు ఉండి ఉంటారన్న అనుమానంతో ఇజ్రాయెల్ దళాలు దాడులకు తెగపడుతున్నాయి. ఇజ్రాయెల్‌కు తొలి లక్ష్యం ఎలా ఎంచుకున్నా ప్రస్తుతానికి, హమాస్ మిలిటెంట్లను ఏరిపారేయడమే అత్యవసరంగా భావిస్తోంది. గాజా సిటీని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ రక్షణ దళం ఆదేశించింది. ఉన్నట్టుండి కట్టుబట్టలతో ప్రాణాలరచేత పట్టుకుని దాదాపు 3.5 లక్షల మంది ఖాళీ చేసి వెళ్లిపోయారు. సోమవారం నాడు దాదాపు 2 లక్షల మందికిపైగా ఖాళీ చేసేశారు. ఒకే రోజు అంత మంది ఆ ప్రాంతం నుంచి భయానక వాతావరణంలో ఖాళీ చేయడమంటే విధివిలాసం అలాంటిది. ఇలాంటి జాతి విధ్వంస సన్నివేశాలపై ఐక్యరాజ్యసమితి నోరు మెదపలేని పరిస్థితి ఉంది. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమం సృష్టిస్తున్న విషయం ఐక్యరాజ్యసమితికి తెలిసినా సమస్త జాతి జనులకు రక్షణనిచ్చి భరోసా కల్పించాల్సిన సమితి నివ్వెరపోయి చూస్తోంది. కనీసం ఒక విజ్ఞాపన కూడా లేదు. ఇజ్రాయెల్ దాడులు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు. యమెన్‌లోని తీర ప్రాంత పట్టణం హోడైడాపై కూడా తీవ్రస్థాయిలో దాడులు చేసింది. కాగా ఇరాన్ మద్దతుతో ఇజ్రాయెల్ దళాలతో తలపడుతున్న హోతీ రెబల్స్ కూడా తమ గగనతల రక్షణ వ్యవస్థను సంరక్షించుకున్నట్లు ప్రకటించాయి. వారం రోజుల క్రితం ఇజ్రాయెల్ దాడులో 31మంది మృతిచెందారు. ఇలా ఒకరిపై ఒకరు లక్ష్యంగా చేసుకుని జరుపుకుంటున్న దాడులను నిలువరించే ప్రక్రియలో జననష్టం గురించి చెప్పుకోవడమే మిగిలింది. అమెరికా ఎన్నివార్నింగ్‌లు ఇచ్చినా, ఆదేశానికి మిత్రదేశంగా వ్యవహరిస్తున్నా ఇజ్రాయెల్ స్పందించకపోవడం ట్రంప్‌కు కోపం తెప్పిస్తుందో లేదో కానీ 'గాజా' విధ్వంసాన్ని చూపిస్తోంది. ఇలా దేశాల మధ్య పెచ్చరిల్లుతున్న ద్వేషవిద్వేషాలను తగ్గించేందుకు ప్రపంచ దేశాలు కృషి అవసరం ఎంతో ఉంది. ఎడాపెడా 'గాజా తగలపడుతోం'దంటూ ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఆనందానికి అవధుల్లేవు. హమాస్ ప్రతిపాదించినట్లు కాల్పుల విరమణకు సుతరామూ ఇజ్రాయెల్‌కు ఇష్టం లేదు. అందుకే గాజా రావణకాష్టంలా మానవ హక్కుల ఉల్లంఘన తీవ్రంగా ఉందని గుర్తించినా ఐక్యరాజ్యసమితి ఇజ్రాయెల్‌ను ఏమాత్రం చెప్పుచేతుల్లోకి తీసుకోలేకపోతోంది. తమ దేశానికి వలస వచ్చిన వారిని బయటకు పంపేయాలని కొన్ని దేశస్థులు భావిస్తోంటే ఉన్న ప్రాంతంలో దుష్కృత్యాలు, దురాగతాలను బీషణ హెచ్చరికలను భరించలేక వలసవెళ్లి పోయేందుకు ఆఘమేఘాల మీద పరుగులు పెడుతున్న జనం మరొకవైపు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఉదంతాలు చూస్తూ మౌనముద్ర వేసుకోవడం ఐక్యరాజ్యసమితికి తగని పని! ఇజ్రాయెల్ అమానుష చర్యలకు వ్యతిరేకంగా కలిసికట్టుగా వ్యవహరించేందుకే ఖతార్ రాజధాని దోహాలో అరబ్, ముస్లిం దేశాల నేతల సమావేశం కూడా ఎలాంటి నిర్ణయ మూ తీసుకోలేకపోయింది. ఇజ్రాయెల్ హమాస్‌ల మధ్య యుద్ధాన్ని దౌత్యపర ఒత్తిడిల ద్వారా ముగించేలా చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలను ఏ దేశమూ కాంక్షించడం లేదు.


మన శక్తియుక్తుల్ని మానవ కళ్యాణానికి వినియోగించాలి. వినాశనానికి కాదు.

షేక్‌స్పియర్


విజయమే అంతిమ లక్ష్యమూ కాదు. అపజయం మరణమూ కాదు. రెండింటి కంటే ముఖ్యమైంది ధైర్యం.

లావోసు

# అగ్రదేశాలు అమెరికాను నియంత్రిస్తాయా?

**ఆర్థికాభివృద్ధిలో ప్రముఖస్థానంతోపాటు జనాభాలో ప్రథమ స్థానం వహించటంతో ప్రపంచ దేశాలే భారత్ 'గ్రేట్ పవర్' దిశగా పరుగులెత్తుతున్నదని వ్యాఖ్యానించాయి. చైనా పహల్గాం ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తన పంథా భారత్ పట్ల మార్చుకుంటున్న సంకేతాలు బహిరంగ పర్చ టంతో, చైనా, భారత్‌తో ఉన్న ఘర్షణా విధానాన్ని పక్కన పెట్టి స్నేహపూరిత వాతావరణాన్ని అభిలషిస్తున్నదని తేట తెల్లమయింది. రష్యా, చైనా, అమెరికా దుందుడుకు ప్రవర్తన నేపథ్యంలో నిర్దిష్టమైన విధానాన్ని అమెరికాను నియంత్రించే దిశగా తీసుకోబోతున్న సూచనలు కనపడుతున్నాయి. ఇజ్రా యిల్, ఉక్రెయిన్‌లను పావులుగా అమెరికా వాడుకొని వాణిజ్య పరంగా లాభపడాలని ప్రయత్నిస్తూ రాజకీయం చేస్తున్నది. ప్రస్తుతం అగ్రదేశాలు రంగంలోకి దిగి ఈ ఘర్షణలన్నిటికీ పరిష్కారాలు కనుగొన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. దేశాల మధ్య ఎప్పుడు ఏం జరుగుతుం దో, ఎవరు ఎవరితో కలిసి ఉంటారో చెప్పటం కష్టం. భారత్, రష్యా, చైనాల మధ్య తాత్కాలికంగా ఏర్పడ్డ కలయిక వల్ల అంతర్జాతీయంగా ఎలాంటి మార్పులు సంభవి స్తాయో భవిష్యత్తు మాత్రమే నిర్ణయించగలదు.**


రావులపాటి సీతారాం రావు

బంగ్లాదేశ్ తర్వాత నేపాల్ దేశం స్వపరిపాలన విషయంలో పిల్లి మొగ్గలు వేయటంతో ప్రధాని మార్పుతప్పనిసరి అయింది. ఆసియా దేశాలను పట్టి పీడిస్తున్న సమస్య అవినీతి. ఏ రకమైన పాలనను ప్రజలు ఆదేశాల్లో ఆశ్రయిస్తున్నారన్నది ముఖ్యం కాదు. ఎలాంటి పాలనను అవలంబించినా నాయకులు అధికారంలో ఉండటం మూణ్నాళ్ల ముచ్చటగానే మారుతున్నది. దానికి కారణాలు పెద్దగా శోధించాల్సిన అవసరం లేదు. ప్రధానంగా చెప్పుకోవాల్సింది మౌలికంగా రాజ్యాంగ విధానంలో సరిచేయలేని తప్పులు ఉండటం వల్లనే. పాకిస్థాన్‌తోసహా ఈ మధ్యకాలంలో భారత్ సరిహద్దు దేశాలలో విచ్చలవిడిగా అవినీతి పెచ్చరిల్లటంపెద్ద సమస్యగా మారింది. అవినీతితోపాటు యువత నిరుద్యోగ సమస్య ఈ దేశాల్లో విలయతాండవం చేస్తున్నది. ఒక దేశం బాగుండాలంటే వ్యవసాయంతోపాటు పరిశ్రమలూ ఉద్యోగాలూ వృద్ధి మార్గంలో ఉంటేనే చిన్నచిన్న సమస్యలే పరిష్కారానికి ఉంటాయి కానీ అధికారంలోని నాయకులను మార్చే పెద్ద సమస్యలు ఉత్పన్నం కావు. అఫ్ఘనిస్థాన్‌ను వెంటాడుతున్నది తాలిబన్ సమస్య. పాకిస్థాన్‌ను అతలాకుతలం చేస్తున్నది వికృత రాజకీయ క్రీడతోపాటు అణిచివేయలేని ఉగ్రవాద సమస్య శ్రీలంక, నేపాల్ దేశాలలో రాజరికాలు పోయి కమ్యూనిస్టుల సారథ్యం దిశగా నాయకత్వం, అదుపులేని పాలనతో బోల్తాపడక తప్పని పరిస్థితి. ఈ దేశాలలో కేవలం అంతర్గత సమస్యలే ప్రభుత్వాల పతనానికి, అస్థిరత్వానికి కారణంగా భావిస్తే పొరబడినట్లే. అగ్రరాజ్యాలు ముఖ్యంగా చైనా, అమెరికా లాంటి దేశాలు వీలున్నప్పుడల్లా మాయమాటలతో, ఆర్థిక సహాయంతో అధికారంలో ఉన్న నాయకులనూ, పార్టీలను వశపర్చుకొని కొద్ది కాలంలోనే దాదాపు వలస రాజ్యాలుగా మార్చుకోవటంలో విజయాన్ని సాధిస్తున్నాయి. ప్రజాబలం, విలువలు లేని పార్టీలు కొన్నాళ్ల వరకే అధికారాన్ని హస్తగతం చేసుకోగలవు. పోనీ ఆ కొన్నాళ్లయినా సుపరిపాలనను ప్రజలకు అందించగలిగితే ప్రజలే ప్రభుత్వాలను కాపాడుకోగలవు. బహు నాయకత్వం, బలహీన నాయకత్వం అధికారంలో కొనసాగటం కష్టం. అందుకే ఆర్మీ పాలన తప్పనిసరి అవుతున్నది. ఆర్మీ వల్ల ప్రజాస్వామ్య పాలనకు దాదాపు చోటు లేకుండాపోతున్నది. పాకిస్థాన్ భారతదేశం నుంచి విడిపోయిన తర్వాత ఏనాడూ భారత్‌తో స్నేహం దృఢతరం చేసుకోటానికి ప్రయత్నించలేదు. సాలినా వైరం పగతో మొదలై పగతోనే జీవిస్తుందన్న నానుడి పాకిస్థాన్ విషయంలో నూటికి నూరుపాళ్లు నిజం అయింది. కాశ్మీర్ సమస్యను తెరమీదికి తెచ్చి, చైనాకు జోహుకుం అనే విధాంగా లొంగిపోయి, ప్రజల అభివృద్ధిని పట్టించుకోకుండా భారత్‌తో తలపడటమే తమ ధ్యేయంగా ప్రతి ప్రభుత్వమూ పాకిస్థాన్‌లా వ్యవహరించడంతో ఆర్మీ అధికారాన్ని అప్పుడప్పుడూ ఒప్పచెప్పక తప్పడంలేదు. భారత్ సత్సంబంధాలకోసం ఎంతగా కృషి చేసినా ఫలితం శూన్యం! అక్కడి అధినేతలు వివక్ష చూపినందుకు ఈస్ట్ పాకిస్థాన్, బంగ్లాదేశ్‌గా విడిపోయిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం బెలూచిస్థాన్ కూడా ఆ మార్గంలోనే పయనిస్తుండటం దురదృష్టకరం. పాకిస్థాన్ ఇతర దేశాలతో శత్రుత్వం పెంచుకోవాలని ఎవరూ అభిల



షించరు. అంతేగాదు చైనాతో వాణిజ్యపరంగా, మరో విధంగా దగ్గరకావటం ఎవరూ కాదనరు. కానీ పాలనను గాలికొదిలేసి ప్రజలను అధోగతిపాలు చేసి, అన్ని విధాలా అసమర్థపాలనతో ప్రజల జీవితాలతో ఆడుకోవటం, ఉగ్రవాదాన్ని, తాలిబన్లను ప్రోత్సహించడం వల్లనే ప్రజలు అతలాకుతల పరిస్థితులను ఎదుర్కోక తప్పటంలేదు. పాకిస్థాన్ ప్రజలు సర్వతోముఖాభివృద్ధిని సాధిస్తున్న భారత దేశంతో, భారత ప్రజలతో స్నేహాన్ని హృదయపూర్వకంగా అభిలషిస్తున్నారని ఆ మధ్యకాలంలో ప్రధాని వాజ్‌పాయ్ ఆ దేశానికి బస్సు ప్రయాణాన్ని పునరుద్ధరించినప్పుడు నిర్ధారణ అయింది. దురదృష్టవశాత్తు వారి పాలకుల ఆలోచనా వైఖరి భిన్నంగా ఉండటంతో రెండు దేశాలూ విభిన్న మార్గాలలో పయనించక తప్పటం లేదు. పహల్గాం ఘటన పాకిస్థాన్‌లోని ప్రజల దృష్టిమళ్లించడానికి చేసిన విఫల ప్రయత్నంగా భావించక తప్పదు. ఈ సంఘటన ఒక విధంగా భారత్ ఎంత బలమైన దేశంగా మారిందో ప్రపంచదేశాలకు చెప్పటానికి ఉపయోగపడింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆడిన నాటకాలు ప్రపంచ దృష్టిలో పడ్డాయి. ట్రంప్ తన దేశాభివృద్ధి కోసం తగు చర్యలు తలపెట్టడంలో తప్పులేదు కాని టారిఫ్‌ను ఆయుధంగా మల్చి భారత్ లాంటి దేశాలను ఇబ్బంది పెట్టడం ప్రపంచ దేశాలు హర్షించటం లేదు. రష్యా, చైనాలు కూడా అమెరికా ద్వంద్వ ప్రమాణాలనూ, కుటిల వైఖరిని గుర్తించడం వల్లనే టియాన్‌జిన్ సమ్మిట్(ఎస్.సి.ఓ) భారత్‌తోసహా మూడు అగ్రదేశాల కలయికగా తీర్చిదిద్దింది. అమెరికా అత్యుత్సాహానికి ఆ సదస్సు నీళ్లుజల్లింది. పాకిస్థాన్ ఇప్పటికైనా భారత్ నిజాయితీని గుర్తించి తమ దేశాభివృద్ధికి తోడ్పాటును అందుకుంటే రెండు దేశాలూ పురోగతిని బహుళ రీతిలో సాధించగలవు. పొరుగు దేశాలు అయిన శ్రీలంక, నేపాల్, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్ ఒక తాటిపైకి వచ్చి అంతర్గత సమస్యను పరిష్కరించుకొనే దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైంది. ఎంత త్వరగా ఈ పరిస్థితిని ఈ దేశాలు గుర్తించగలుగుతే అంత త్వరగా ఆ దేశాల ప్రజలకు మేలు చేసినవారవుతారు. రష్యా, భారత్ లాంటి దేశాలు కూడా అరమరికలు లేకుండా సహాయ సహకారాలు అందించగలవు. చైనా కూడా పరిస్థితులను ఆకళింపు చేసుకొని సమయానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉంది. ఈ మధ్యన కొన్ని విదేశీ పత్రికలు పనిగట్టుకొని భారత్‌కు వ్యతిరేకంగా కథలు అల్లుతున్నాయి. భారత్ ప్రాముఖ్యతను తగ్గించే విధానంలో భాగంగా బహుశా అమెరికా వెనక ఉండి నడిపిస్తుండొచ్చని కొందరివిజ్ఞుల అభిప్రాయం కూడా! 'ఫారిన్ అఫైర్స్' పేరిట వచ్చిన ఒక కథనంలో భారత్ 'గ్రేట్ పవర్'గా తనను తాను ఊహించుకొని చైనా, రష్యాలతో సమంగా ఉండే ప్రయత్నం చేస్తున్నదని విపరీతపోకడలతో వచ్చిన ఒక అర్థంపర్థం లేని కథనం విశ్లేషకులు ముక్కున వేలేసుకొనే విధంగా వెలువడింది. అమెరికా, చైనాలతో భారత్ ఈ 'గ్రేట్ పవర్' రేస్‌లో లేనేలేదన్న అభిప్రాయాన్ని కూడా హైలైట్ చేసింది. 'బిగ్ పవర్'నని భారత్ ఎన్నడూ చెప్పుకోలేదు. ఆర్థికాభివృద్ధిలో ప్రముఖస్థానంతోపాటు జనాభాలో ప్రథమ స్థానం వహించటంతో ప్రపంచ దేశాలే భారత్ 'గ్రేట్ పవర్' దిశగా పరుగులెత్తుతున్నదని వ్యాఖ్యానించాయి. చైనా పహల్గాం ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తన పంథా భారత్ పట్ల మార్చుకుంటున్న సంకేతాలు బహిరంగ పర్చటంతో, చైనా, భారత్‌తో ఉన్న ఘర్షణా విధానాన్ని పక్కన పెట్టి స్నేహపూరిత వాతావరణాన్ని అభిలషిస్తున్నదని తేట తెల్లమయింది. రష్యా, చైనా, అమెరికా దుందుడుకు ప్రవర్తన నేపథ్యంలో నిర్దిష్టమైన విధానాన్ని అమెరికాను నియంత్రించే దిశగా తీసుకోబోతున్న సూచనలు కనపడుతున్నాయి. ఇజ్రాయిల్, ఉక్రెయిన్‌లను పావులుగా అమెరికా వాడుకొని వాణిజ్య పరంగా లాభపడాలని ప్రయత్నిస్తూ రాజకీయం చేస్తున్నది. ప్రస్తుతం అగ్రదేశాలు రంగంలోకి దిగి ఈ ఘర్షణలన్నిటికీ పరిష్కారాలు కనుగొన్నా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. దేశాల మధ్య ఎప్పుడు ఏం జరుగుతుందో, ఎవరు ఎవరితో కలిసి ఉంటారో చెప్పటం కష్టం. భారత్, రష్యా, చైనాల మధ్య తాత్కాలికంగా ఏర్పడ్డ కలయిక వల్ల అంతర్జాతీయంగా ఎలాంటి మార్పులు సంభవిస్తాయో భవిష్యత్తు మాత్రమే నిర్ణయించగలదు. •

# ప్రకృతికి వరం, మానవునికి ఆధారం వెదురు

రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ వెదురు దినోత్సవాన్ని ప్రతిసంవత్సరం సెప్టెంబర్ 18న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. ఈ రోజును వెదురు ప్రాముఖ్యతను తెలియ జేయడం, దాని వినియోగాన్ని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్రను గుర్తు చేయడం ప్రధాన లక్ష్యంగా ఏర్పాటు చేశారు. 2009లో థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో జరిగిన ఎనిమిదవ ప్రపంచ వెదురు కాంగ్రెస్ సందర్భంగా ప్రపంచ వెదురు సంస్థ దీనిని అధికారికంగా ప్రకటించింది. అప్పటి నుంచి ప్రపంచ దేశాలు, ముఖ్యంగా ఆసియా దేశాలు, ఈ దినోత్సవాన్ని విశేషంగా పాటిస్తున్నాయి. వెదురు ఒక గడ్డి జాతికి చెందినప్పటికీ చెట్లంత ఎత్తుగా పెరిగి మానవ జీవన విధానంలో కీలక పాత్ర పోషిస్తున్నది. దీనిని అద్భుత మొక్క అని, పేదల ఉక్కు అని పిలవడం దాని బహుముఖ వినియోగాల వలన. రోజుకు కొన్ని అడుగుల వరకు పెరిగే వేగవంతమైన పెరుగుదలతో పాటు ఇతర చెట్ల కంటే ఎక్కువ ఆక్సిజన్ విడుదలచేస్తూ వాయు మండలంలో ఉన్న కార్బన్ డయాక్సైడ్‌ను అధికంగా గ్రహించడం ద్వారా పర్యావరణ సమతుల్యతకు విశేష సహాయం చేస్తుంది. భూసారాన్ని కాపాడడం, వరదల ప్రభావాన్ని తగ్గించడం, నేలలో తేమ నిల్వ ఉంచడం వంటి ప్రకృతి సంరక్షణలో కూడా వెదురు ఒక అద్భుతమైన సహజ వనరుగా నిలుస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా వెదురుకు 1200కుపైగా జాతులున్నాయి. వాటిలో సుమారు 136 జాతులు భారతదేశంలోనే లభ్యమవుతున్నాయి. అసోం, త్రిపుర, మణిపూర్, మేఘాలయ, అరుణాచల్ వంటి ఈశాన్య రాష్ట్రాలు వెదురు సమృద్ధిగా పెరిగే ప్రాంతాలుగా గుర్తింపు పొందాయి. నేషనల్ బాంబూ మిషన్ నివేదిక ప్రకారం భారత దేశంలో సుమారు 13.96 మిలియన్ హెక్టార్ల విస్తీర్ణంలో వెదురు పెరుగుతోంది. ఈ విస్తీర్ణంలో సగం కన్నా ఎక్కువ భాగం ఈశాన్య రాష్ట్రాల్లోనే ఉంది. భారతదేశ వెదురు ఉత్పత్తి ప్రపంచ ఉత్పత్తిలో దాదాపు 45 శాతం ఉండటం విశేషం. గ్రామీణ



జీవన విధానంలో వెదురు ఒక అవిభాజ్య భాగంగా నిలుస్తూ ఇళ్ల నిర్మాణం, చిన్న వంతెనలు, నీటి కాల్వలు, మేడలు, బావులు, గోడల కట్టడాలు అన్నీ వెదురుతోనే సాధ్యమవుతున్నాయి. లక్షలాది మంది వడ్రంగులు, బుట్టల కార్మికులు, పూలమాలలు చేసే వృత్తిదారులు, పతంగి తయారీదారులు, నూలు వృత్తి నిపుణులు, వాయిద్య కారులు ఉపాధి కోసం వెదురు పైనే ఆధారపడి ఉన్నారు. కాగితం పరిశ్రమలో వెదురు ముడిసరుకుగా ఉపయోగపడుతుండగా, ఆధునిక కాలంలో ఫర్నిచర్, అంతర్గత అలంకరణ వస్తువులు, ఫ్లోరింగ్, బట్టలు, వంట పాత్రలు, టూత్ బ్రష్‌లు, బొమ్మలు, సంగీత వాయిద్య పరికరాలు వంటి ఎన్నో వస్తువులు కూడా వెదురుతోనే తయారవుతున్నాయి. అంతేకాక వెదురు మొగ్గలు ఆసియా దేశాల్లో ఆహారంగా వినియోగించబడుతూ పోషక విలువలతో కూడిన ప్రత్యేకమైన పదార్థంగా గుర్తింపుపొందాయి. వెదురు పర్యావరణ పరిరక్షణలో అపూర్వ సహాయం చేస్తుంది. భూమి తాపాన్ని తగ్గించడం, గాలి నాణ్యతను మెరుగుపరచడం, వాతావరణ మార్పుల దుష్ప్రభావాలను నియంత్రించడం వంటి అనేక విధాలుగా తోడ్పడుతుంది. మూడేళ్లలోనే పూర్తిగా ఎదిగే వెదురు వేగవంతమైన పచ్చదన విస్తరణకు కారణమవుతుంది. ఈ కారణంగానే పర్యావరణ శాస్త్రవేత్తలు వాతావరణ సంక్షోభానికి వెదురును సమర్థవంతమైన పరిష్కారంగా సూచిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, చిన్నతరహా పరిశ్రమల విస్తరణలోకూడా వెదురు ఒక కీలకవనరుగా మారింది. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ సంఘాలు వెదురుతో మరిన్నిపర్యావరణ అనుకూల ఉత్పత్తులు తయారు చేయడానికి, పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నాయి. మొత్తం మీద వెదురు మానవ జీవనవిధానం, పర్యావరణ సమతుల్యత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, సుస్థిర అభివృద్ధి అన్నీ కలిపిన జీవనాధారమని చెప్పవచ్చు. యుగాలుగా మానవుడి జీవితంలో భాగమైన ఈ ఆకుపచ్చ బంగారాన్ని సంరక్షించడం, విస్తరించడం మన అందరి బాధ్యత. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 18న జరుపుకునే ప్రపంచ వెదురు దినోత్సవం ఈ బాధ్యతను మనకు గుర్తుచేస్తూ పచ్చదనానికి, భవిష్యత్తు తరాల భద్రతకు మనం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిస్తోంది. •

# ప్రజావాక్కు



### నిధులు కేటాయించాలి

ప్రయివేటు కాలేజీలకు ఫీజు రీయింబర్స్మెంట్ చేయడం సంవత్సరాల తరబడి రాష్ట్రప్రభుత్వం చెల్లించని కారణంగా వెయ్యికిపైగాకాలేజీలు బంద్‌పాటించడం ఒక విధంగా తమ నిరసనను తెలియజేయడం సబబే అనిపిస్తోంది. బకాయిలు వేల కోట్లకు చేరుకుంది. తెలంగాణా రాష్ట్రానికి రాబడికన్నా ఖర్చులుఎక్కువవుతున్నాయి. ఆంధ్రలో కూడా ఇదే పరిస్థితి నెలకొల్పబడింది. ప్రభుత్వం నడపడానికి అనేక ఉచిత అనుచిత పథకాలకే సరిపోవడం లేదు. కాలేజీ యాజమాన్యాలు ప్రభుత్వం చెల్లించవల సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలనుసాకుగా చేసుకుని ఉపాధ్యాయులకు జీతాలను నెలల తరబడి చెల్లించడంలేదు. ప్రతీ సంవత్సరం తప్పనిసరిగా చెల్లించవలసిన బిల్లులకు బడ్జెట్ కేటాయించాలి.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సుప్రీం ఉత్తర్వులు భేష్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్‌చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైనకేసులో సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు వెలువరించింది. ఆ చట్టాన్ని అమలు చేయకుండా స్టే ఇవ్వాలన్న విజ్ఞప్తిని తిరస్కరిస్తూ, కొన్ని అభ్యంతరకర నిబంధనల్ని కొట్టివేస్తే చాలునన్న అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ ఉత్తర్వులపై అధికార, ప్రతిపక్షాలు హర్షం వ్యక్తం చేయడం, తమతమ అభిప్రాయాల్ని గౌరవించినట్లు భావించడం విశేషం. ఈ మధ్యకాలంలో ఇలా వైరిపక్షాలు రెండూ సంతృప్తి వ్యక్తం చేసిన ఆదేశాలు ఇవే కావొచ్చు. వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, సక్రమ వినియోగం ఉద్దేశించిన ఈ చట్టం కూడా రాజ్యాంగ పరిధికి లోబడి ఉన్న కారణంగా కొట్టివేయ దగ్గది కాదన్నది కోర్టు ఉద్దేశ్యం.

- డా.డి.వి.జి. శంకరరావు, పార్వతీపురం

### వ్యవస్థకే ముప్పయ్యారు..

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో కాంట్రాక్ట్ లెక్చరర్ల వ్యవస్థను గతప్రభుత్వం చట్టం చేసి రెగ్యులర్ చేయకుండా గతఎన్నికలలో ఓడిపోయింది. ఆచట్టం పరిధిలో ఈప్రభుత్వమైనా రెగ్యులర్ చేస్తుందేమోనని అర్హులైన వారు ఎదురుచూస్తుంటే, అర్హత లేకుండా అడ్డదా రులలో నియామకమైనవారు రెగ్యులర్‌కు మోకాలడ్డుతూ, ఆనెల రెమ్యూనరేషన్ కోసం అర్రులు చాస్తున్నారు.

- డా.దన్నాన అప్పనాయుడు, చీపురుపల్లి

### పర్యవేక్షణ అవసరం

అన్నిరాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు కూడా జీఎస్టీ ఎగవేతదారులను గుర్తించడానికి ఒక ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టాల్సిన అవసరం ఉంది. దేశవ్యాప్తంగా వ్యాపారులు పన్నుల చెల్లింపులో అక్రమాలకు పాల్పడుతున్నారనేది స్పష్టంగా కనిపిస్తున్న వాస్తవం. జీఎస్టీ 2.0 వంటి నూతన పన్ను విధానాలు కొన్ని ఆదాయ నష్టాన్ని కలిగించవచ్చు, కానీ వ్యాపారులు, వాణిజ్య పన్నులశాఖలోని అవినీతి అధికారులు, అలాగే కొన్నిసార్లు పాలకపక్ష నాయకుల మధ్య ఉన్న లోతైన సంబంధాల కారణంగా పన్నుల ఎగవేత యథేచ్ఛగా కొనసాగుతోంది. ఈ పరిస్థితిలో ప్రభుత్వం నిర్దేశించిన పన్ను వసూళ్ల లక్ష్యాలను చేరుకోవడం అసాధ్యంగా మారుతోంది. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా, మన దేశంలో వస్తువులవారీగా వాణిజ్య లావాదేవీలన్నింటినీ పర్యవేక్షించడానికి ఒక కేంద్ర వ్యవస్థ లేకపోవడం దురదృష్టకరం. అలాంటి వ్యవస్థ ఉంటే, జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రభుత్వం కచ్చితంగా అంచనా వేయగలిగేది.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### సిమెంటు రోడ్లతో తిప్పలు

నేడు మన దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పట్టణాలు నుండి పల్లెల వరకు జన సంచారం లేని ఇరుకు సందుల్లో కూడా వేలం వెర్రిగా సిమెంటు రోడ్లు వేస్తూ మార్జిన్లు కూడా వదలకుండా సిమెంటు మయం చేస్తున్నారు. ఇవి తారు రోడ్ల కంటే ఎక్కువకాలం మన్నికగా వుండవచ్చేమోగానీ, వర్షం వచ్చినపుడు నీరు పీల్చుకునే అవకాశం లేక రోడ్లు జలమయమై ఇళ్ళలోకి సైతంనీరుచేరుతుంది. కొన్ని పట్టణాల్లో రోడ్లు జలమయమై ప్రజలెంతో నష్టపోవటమేగాక, కొందరు ప్రాణాలుసైతం కోల్పోయారు. భూమిలో నీరు ఇంకెలా చేయాలి.

-డి. చాంద్ బాషా, కర్నూలు

### లోక్ అదాలత్‌తో సమస్యల పరిష్కారం

ఇటీవల జాతీయస్థాయిలో లోక్ అదాలత్ నిర్వహణ జరిగినది. ఆర్థికస్థితి బాగులేనివారు కూడా కోర్టును ఆశ్రయించడం తప్పని పరిస్థితి ఉంటుంది. దీని ఉద్దేశ్యం పూర్తి ఫలితాన్ని ఇచ్చింది. ఊహించని సంఖ్యలోకేసులు పరిష్కరించుకున్నారు. లోక్ అదాలత్ న్యాయమూర్తులకు వారంతా కృతజ్ఞులు. ఇక జరగబోయే అదాలత్‌కు కాస్తవ్యవధితో బాగా ప్రచారం, సలహాలు, సహకారంతో పెరిగిపోతున్న కేసులకు ఉత్తమ్ విధానం. విషయం తెలిసిన వారు చెప్పడం కూడా మేలే అవుతుంది.

- బొల్లోజు మేఘనాథం, విశాఖపట్నం

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# జిఎస్‌టి మార్పులు ప్రజా ప్రయోజనకరం!

వి.వి.కే.సురేష్

మన దేశ రైతుల వీరోచితమైన, చారిత్రకమైన పోరాటం వల్లనే కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చి మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసింది. గత కొన్ని సంవత్సరాలుగా ప్రజల నుండి, వివిధ సంస్థలు, సంఘాల నుండి వ్యక్తమైన గట్టి అభిప్రాయాలు, అభ్యంతరాలకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం జి.ఎస్.టి కౌన్సిల్ తప్పనిసరి పరిస్థితుల్లో వస్తుసేవల పన్నుల్లో మినహాయింపులు, తగ్గింపులు ఇవ్వక తప్పలేదు. మొత్తం నాలుగు శ్లాబుల్లోని 12 శాతం, 28 శాతం శ్లాబులను రద్దు చేసి, 5,18 శాతం శ్లాబులను కొనసాగించారు. వస్తు సేవల పన్ను (జి.ఎస్.టి) అమలు ఎన్.డి.ఏ ప్రభుత్వ హయాంలో జూలై 1, 2017న ప్రారంభమైంది. చాలా హడావిడిగా, ఎటువంటి సవివరమైన చర్చలు చేయకుండా ఆనాడు జి.ఎస్.టి వ్యవస్థను ప్రకటించారు. ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం తెలియజేశాయి. 'ఒకే దేశం ఒకే పన్ను' అనే నినాదంతో ప్రభుత్వ పెద్దలు తీవ్ర స్థాయిలో ప్రచారం చేశారు. వివిధ రకాల పన్నుల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఒకే పన్ను వల్ల ప్రజలకు ఉపశమనం కలుగుతుందని నాటి కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ దేశ ప్రజలకు హామీ ఇచ్చారు. కానీ అనుభవంలో మాత్రం పరిస్థితులు పూర్తి భిన్నంగా మారిపోయాయి. పెనుభారంగా పరిణమించిన ఈ పన్నును చివరకు గబ్బర్ సింగ్ పన్నుగా సంబోధించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. 2017 నుండి జి.ఎస్.టి కౌన్సిల్ ఎన్నో సార్లు సమావేశమైంది. నాటి నుండి పలుమార్లు జి.ఎస్.టి విధానంలో మార్పులు చేశారు. ప్రజలు ముఖ్యంగా కోట్లాది మంది సామాన్యులునిత్యం ఉపయోగించే వస్తువులపై పన్నుల భారం మోపడం వల్ల ప్రభుత్వ నిర్ణయాలు వారి జీవన ఆర్థిక స్థితిగతులను తీవ్రంగా ప్రభావితం చేశాయి. జి.ఎస్.టి వసూళ్లు ప్రభుత్వానికి ఒక పెద్ద ఆదాయ వనరుగా మారాయి. జిఎస్‌టి లోని రెండు స్లాబ్‌లను రద్దు చేయటం వలన దరిదాపు కేంద్ర ప్రభుత్వానికి నెలకి 48 వేల కోట్ల రూపాయల పన్ను ఆదాయం తగ్గుతుంది. అంటే వినియోగదారుల వద్ద ప్రోగుపడిపోయిన ఆ ఆదాయంతో వినియోగం పెంచాలని ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తుంది. అదే సందర్భంలో వివిధ రంగాలపై దుష్ప్రభావం పడింది. సామాన్యులువాడే పాలు, పెరుగు, పాప్‌కార్న్, షాంపూ, టూత్ పేస్ట్, చిన్న పిల్లల వస్తువుల వంటి వాటిని కూడా చివరకు ప్రభుత్వం వదల్లేదు. వైద్య పరికరాలపై ఘోరంగా 18 శాతం పన్ను ఉండేది.




రైతులు ఉపయోగించే ట్రాక్టర్లపై 18 శాతం పన్ను విధించారు. మరోప్రక్క కార్ల అమ్మకాలు పడిపోయాయి. జి.ఎస్.టి భారాల వల్ల వేలాది చిన్నచిన్న పరిశ్రమలు మూత పడ్డాయని, లక్షల మందికి ఉపాధి పోయిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సి.ఎమ్.ఐ.ఇ) తన నివేదికలో పేర్కొంది. కోట్లాది మంది పట్టాదారులు దాచుకున్న బీమా ప్రీమియం సొమ్ముపై 18 శాతం జి.ఎస్.టి విధించడం దేశీయ పొదుపు వ్యవస్థను దెబ్బతీయడమేనని, దీన్ని దృష్టిలో పెట్టుకుని బీమా ప్రీమి యంపై ఈ భారీ పన్ను వసూలును రద్దు చేయాలని బీమా ఉద్యోగులు విస్తృత ప్రచారం నిర్వహించారు. 2017ముందు బీమా ప్రీమియంపై సర్వీస్ టాక్స్ వసూలు చేసేవారు. మొత్తం లోక్ సభ, రాజ్యసభ సభ్యులను కలసి వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ రంగ ఇన్సూరెన్స్ సంస్థల్లో అతిపెద్ద యూనియన్‌గా ఉన్నటువంటి ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పెద్ద ఎత్తున ప్రచార ఉద్యమం సాగించింది. దేశ వ్యాప్తంగా పలు సెమినార్లు, సదస్సులు, ప్రెస్‌మీట్స్ ఆర్గనైజ్ చేసింది. ఉద్యోగులు కలిసిన వారిలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, ప్రహ్లాద్ జోషీ వంటి ప్రముఖులు కూడా ఉన్నారు. బీమా ప్రీమియంపై జి.ఎస్.టి భారాన్ని మోపడం సమంజసం కాదని, తక్షణమే దీన్ని ఉపసంహరించాలని కోరుతూ 2017 లోనే బీమా ఉద్యోగులు పాలసీదారులను కలసి వారినుండి సేకరించిన మొత్తం 45లక్షల సంతకాలను కేంద్ర ఆర్థిక మంత్రికి పంపించారు. ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నీతి ఆయోగ్‌కు ఉత్తరాలు రాసింది. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఉద్యోగుల అసోసియేషన్ ఒక లేఖ వ్రాసి ఆయన కూడా ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఇప్పుడు బీమా ప్రీమియంను జి.ఎస్.టి స్లాబ్ 18 శాతం నుండి పూర్తిగా మినహాయించారు. పాలసీదారులకు, మొత్తం బీమా రంగానికి ఈ నిర్ణయం ఉపకరిస్తుంది. ప్రభుత్వ రంగంలోని బీమా సంస్థలను శక్తివంతం చేసేలా ప్రభుత్వ విధానాలు ఉండాలి. ఈ సంస్థల ద్వారా ప్రజల నుండి వసూలయ్యే కోట్లాది రూపాయల ప్రీమియం సొమ్ముదేశీయ పెట్టుబడిగా మారుతోంది. ఫలితంగా దేశ ప్రగతికి మార్గం సుగమం అవుతుంది. మనది సమాఖ్య వ్యవస్థ. రాష్ట్రాలు ఆర్థికంగా బలంగా ఉండాలి. కానీ కేంద్ర ప్రభుత్వం గత కొన్నేళ్లుగా రాష్ట్రాల హక్కులను హరిస్తోందని, వాటిపై పెత్తనం చెలాయిస్తోందని తీవ్ర విమర్శలు ఉన్నాయి. జి.ఎస్.టి మార్పుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని సమూలంగా మార్చుకోవాలి. రాష్ట్రాలకు ఎటువంటి పన్ను బకాయిలు పెండింగ్‌లో లేకుండా చూడటమే కాకుండా, వసూలైన పన్నుల్లో న్యాయబద్ధమైన వారి వాటాలను సకాలంలో అందజేయాలి. రాష్ట్రాలను బలోపేతం చేయాలి. అప్పుడే దేశ సుస్థిర ప్రగతి సాధ్యం. •

# అమెరికాకు తగ్గుతున్న భారత్ ఎగుమతులు

## ట్రంప్ విధించిన సుంకాల ప్రభావం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు భారత ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అవుతున్న వస్తువుల ధరలు అక్కడ భారీగా పెరిగిపోయాయి. దాంతో అమెరికా మార్కెట్‌లో పోటీని తట్టుకోలేని స్థితి నెలకొంది. ఈ విషయాన్ని 'గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనిషియేటివ్ సంస్థ వెల్లడించింది. ఆగస్టు నెలలో అమెరికాకు ఎగుమతులు 16.3 శాతం తగ్గి 6.7 బిలియన్ డాలర్లకు చేరాయి. టారిఫ్‌లు 50 శాతానికి పెరగడంతో ఒక్కసారిగా ఎగుమతుల్లో తగ్గుదల కనిపించింది. గత మూడు నెలల నుంచి ఎగుమతుల్లో వరుసగా తగ్గుదల కనిపిస్తోంది. జూలైలో ఈ తరుగుదల 3.6 శాతంగా నమోదైంది. జూన్‌లో 5.7 శాతానికి తగ్గింది. అమెరికాకు భారత ఎగుమతులు చివరి సారిగా మే నెలలో పెరిగాయి. అప్పుడు 4.8 శాతం వృద్ధి చెంది 8.8 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అంతకుముందు నెల అంటే ఏప్రిల్‌లో 8.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. టారిఫ్‌లలో భారీగా పెరుగుదల ఎగుమతుల్లో తరుగుదలకు కారణమైందని జీటీఆర్ఐ వ్యవస్థాపకులు అజయ్ శ్రీవాస్తవ వెల్లడించారు. గత మూడు నెలల ట్రెండ్‌ను బట్టి చూస్తుంటే సెప్టెంబర్ నెలలో ఎగుమతుల పతనం మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. పూర్తిస్థాయిలో టారిఫ్‌ల దెబ్బ తీవ్రత ఈ నెలలోనే తెలుస్తుందని అన్నారు. ఏప్రిల్ 4 వరకు అమెరికా మోస్ట్ ఫేవర్డ్ నేషన్ హోదాలో భారత సరుకులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఎగుమతి అయ్యాయి. ట్రంప్ అన్ని దేశాలకు 10 శాతం పన్నులు విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇది కూడా వ్యాపార సంబంధాలపై పెద్దగా ప్రభావం చూపలేదు. దీంతో మే నెలలో కూడా ఎగుమతులు పెరిగాయి. కానీ ఆ తర్వాత నుంచి పలు దేశాలను లక్ష్యంగా చేసుకొని టారిఫ్‌లు విధించడం ప్రతికూల ప్రభావం చూపింది. ముఖ్యంగా ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చిన సుంకాలు భారత ఎగుమతులను తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ నెలలో తొలుత 25 శాతం ఆ తర్వాత మరో 25 శాతం పన్నులు భారత్‌పై పడ్డాయి. అయితే భారత్ నుంచి ఎగుమతి అయ్యే ఫోన్‌లు, ఔషధాలకు మాత్రం మినహాయింపు లభిస్తోంది. అయినా ఈ స్థాయి తరుగుదల నమోదైందంటే మిగిలిన ఉత్పత్తులు అనుకున్న దానికంటే తీవ్రంగా ప్రభావితం అవుతున్నట్టే లెక్క. లేబర్ ఆధారిత పరిశ్రమలైన దుస్తులు, రత్నాలు, ఆభరణాలు, లెదర్, రొయ్యలు, కార్పెట్‌ల లాంటివి ఒత్తిడికి గురికానున్నాయి. వీటిల్లో 3060 శాతం మధ్య ఎగుమతులు అమెరికాకే వెళ్తాయి. 2026 ఆర్థిక సంవత్సరం మొత్తం ఈ టారిఫ్‌లు కొనసాగితే 3035 బిలియన్ డాలర్ల మేరకు అమెరికాతో వ్యాపారాన్ని భారత్ నష్టపోతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

# కోర్టు ఆవరణలోనే ఎస్ఐని చితకబాదిన లాయర్లు



**వారణాసి, సెప్టెంబరు 17:** కోర్టు విచారణకు హాజరైన ఒక పోలీస్ అధికారిని న్యాయవాదులు చుట్టుముట్టారు. ఆయనపై పంచులిచ్చి కొట్టారు. ఆ పోలీస్ అధికారితోపాటు ఆయన వెంట ఉన్న కానిస్టేబుల్ కూడా లాయర్ల దాడిలో గాయపడ్డాడు. వారిద్దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో ఈ సంఘటన జరిగింది. బరగావ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన భూ వివాదంలో ఒక న్యాయవాదితో సహా రెండు వర్గాలపై 37 ఏళ్ల ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతి చలాన్లు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆ పోలీస్ అధికారి తన పట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు దాడి చేసినట్లు ఆ లాయర్ ఆరోపించాడు. కోర్టు విచారణ కోసం ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతి కానిస్టేబుల్ రాణా ప్రసాద్‌తో కలిసి వారణాసి కోర్టుకు హాజరయ్యారు. అయితే న్యాయవాదిపై దాడి చేసిన ఆయనపై ప్రతీకారం కోసం కొందరు న్యాయవాదులు గుంపుగా వేచి ఉన్నారు. జిల్లా మేజిస్ట్రేట్ పోర్టికో సమీపంలో పోలీస్ అధికారి మిథిలేష్ ప్రజాపతిని చుట్టుముట్టి కొట్టారు. పారిపోతున్న ఆయన వెంటపడి పంచులిచ్చారు. మరోవైపు స్పృహ కోల్పోయిన ఆ ఎస్ఐను ఒక కార్యాలయంలోకి న్యాయవాదులు ఈడ్చుకెళ్లారు. అక్కడ తిరిగి దాడి కొనసాగించారు. కొంతసేపు బంధించారు. కోర్టులోని మిగతా పోలీసులు జోక్యం చేసుకుని ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతిని కాపాడి అక్కడి నుంచి తీసుకెళ్లారు. న్యాయవాదుల గుంపు దాడిలో ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతితో పాటు ఆయన వెంట ఉన్న కానిస్టేబుల్ రాణా ప్రసాద్ కూడా గాయపడ్డాడు. వారిద్దరిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఎస్ఐ మిథిలేష్ ప్రజాపతికి 16 కుట్లు పడటంతోపాటు అంతర్గతంగా గాయాలయ్యాయి. ఆయన ఫిర్యాదుపై పది మంది న్యాయవాదులతో పాటు గుర్తు తెలియని సుమారు 60 మంది లాయర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పోలీస్ అధికారిపై న్యాయవాదులు గుంపుగా దాడి చేసిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# వృద్ధుడి ఇంట్లో గుట్టలుగుట్టలుగా మారణాయుధాలు

## కేరళలో సంచలనం సృష్టిస్తున్న ఉదంతం




**మలప్పురం,(కేరళ), సెప్టెంబరు 17:** సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన 69 ఏళ్ల వయసున్న వృద్ధుడి ఇంట్లో భారీగా ఆయుధాలు ఉన్నాయన్న పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. నిందితుడిని అదుపులోకి తీసుకుని, ఆయుధాలను సీజ్ చేశారు. ఘటనపై కేసు నమోదుచేసి లోతైన దర్యాప్తు చేపట్టారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లాకు చెందిన ఉన్నికమద్ అనే 69 ఏళ్ల వృద్ధుడి ఇంట్లో అక్రమంగా ఆయుధాలు నిల్వ ఉంచినట్లు పోలీసులకు రహస్యంగా సమాచారం అందింది. ఈ సమాచారం విశ్వసనీయమైనదని నిర్ధారించుకున్న పోలీసులు వెంటనే ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అతడి ఇంటిపై మెరుపుదాడి చేశారు. ఇల్లంతా జల్లెడ పట్టారు. కనిపించిన ప్రతీ బ్యాగును, సంచిని, డబ్బాను వెతికారు. ఈక్రమంలోనే పోలీసులే నివ్వెరపోయేలా పెద్ద సంఖ్యలో ఆయుధాలు బయటపడ్డాయి. ఆయుధాలను చూసిన పోలీసులు తాము ఇంత భారీ మొత్తంలో ఆయుధాలు ఒకేసారి ఒక వ్యక్తి ఇంట్లో కనుగొనడం ఇదే మొదటిసారి అని చెప్పారు. అధికారులు వృద్ధుడి నివాసం నుంచి 20 ఎయిర్‌గన్‌లు, మూడు రైఫిల్స్, 200 బుల్లెట్లు, 40 పెల్లెట్ బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఇంట్లో ఆయుధాలను అమర్చిన తీరు చూస్తే అతను ఎంతోకాలం నుంచి వీటిని నిల్వ చేస్తున్నట్లు తెలుస్తోందని పోలీసులు అభిప్రాయ పడ్డారు. ఈ భారీ మొత్తంలో ఆయుధాలను చూసి స్థానికులు కూడా ఆశ్చర్యపోయారు. ఈ ఆయుధాలన్నీ కేవలం వ్యక్తిగత అవసరాల కోసమే కాదని.. వాటి వెనుక ఏదైనా పెద్ద నేర సామ్రాజ్యం ఉండి ఉండవచ్చు అని అనుమానిస్తున్నారు. ఆయుధాలు దొరికిన తర్వాత ఉన్నికమద్‌ను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. వారితోపాటే జీపులో ఎక్కించుకుని నేరుగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ భారీ మొత్తంలో ఆయుధాలను ఎక్కడి నుంచి సేకరించారు వాటిని విక్రయించేందుకు నిల్వఉంచారా లేక వ్యక్తిగత అవసరాల కోసం దాచారా అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఆయుధాలకు ఏమైనా క్రిమినల్ గ్యాంగులకు సంబంధం ఉందా అని కూడా పోలీసులు విచారిస్తున్నారు. అలాగే ఆయుధాలు సేకరించడంలో ఉన్నికమద్‌కు ఎవరైనా సహాయం చేశారా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. ఒకవేళ ఇవి కేవలం వ్యక్తిగత అవసరాల కోసమే అయితే ఏ ప్రయోజనాల కోసం అతను ఇంత భారీ మొత్తంలో మారణాయుధాలను నిల్వ ఉంచుకున్నాడు అని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

# కర్ణాటక విజయపుర జిల్లా ఎస్‌బిఐలో భారీ దోపిడి

### 20 కిలోల బంగారు నగలు

### రూ.1.4 కోట్ల నగదు లూటీ

### తుపాకులు, కత్తులతో మాస్కులు ధరించి దోపిడికి పాల్పడ్డ అంతర్రాష్ట్ర ముఠా

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** కర్ణాటకలో మరో బ్యాంకును దుండగులు లూటీ చేశారు. రెండు నెలల క్రితం కెనరా బ్యాంకులో జరిగిన దోపిడి ఘటనను మరువక ముందే మంగళవారం సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో విజయపుర జిల్లాలోని చడచన్ పట్టణంలో గల ఎస్‌బిఐలో అంతర్రాష్ట్ర దోపిడి దొంగల ముఠా మాస్కులు ధరించి తుపాకులు, కత్తులతో సిబ్బందిని తాళ్లతో కట్టివేసి 20 కిలోల బంగారు నగలు, కోటీ 40 ల క్షల రూపాయల నగదును నిమిషాల వ్యవధిలో దోచుకుని పారిపోయారు. ఈ ఘటన కర్నాటక వ్యాప్తంగా సంచలనం రేపింది. వివరాలు ఇలావున్నాయి. విజయపుర జిల్లా చడచన్ పట్టణంలో ఎస్‌బిఐ చాలా కాలంగా ప్రజలకు సేవలందిస్తోంది. స్థానిక వ్యాపా రులతో పాటు రైతులు, వివిధ రంగాలకు చెందిన వేలాది మంది ఖాతాదారులు ఇక్కడ తమ బంగారాన్ని లాకర్లలో నిలువ వుంచారు. చడచన్ ఎస్‌బిఐగా పేరొందిన ఇక్కడి ఎస్‌బిఐ బ్యాంకు లో నిత్యం కోటి రూపాయలకు పైగా లావాదేవీలు జరుగుతుంటాయి. దీనిపై పక్కా సమాచారం అందుకున్న దుండగులు సాయంత్రం ఆరుగంటల సమయంలో బ్యాంకులోకి వచ్చారు. ఆ సమయంలో బ్యాంకు సిబ్బంది బ్యాంకును మూసివేసే పనిలో వుండగా ముందుగా ఒక నేరగాడు తన ఖాతా వివరాలు కావాలనే నెపంతో ఉద్యోగితో మాట్లాడి వివరాలు తెలుసుకుంటున్న తరుణంలో మరో ఇద్దరు వచ్చారు. ముగ్గురు మాస్కులు ధరించి వున్నారు. దీని తరువాత ముగ్గురు తమ వద్ద వున్న తుపాకులను, కత్తులతో బ్యాంకు మేనేజర్‌తో పాటు సిబ్బందిని భయపెట్టారు. మర్యాదగా లాకర్లలో వున్న బంగారు నగలు, బ్యాంకులో వున్న నగదును ఇవ్వాలని, లేకుంటే అందరిని చంపేస్తామని బెదిరించారు. అనంతరం అందరిని ఒక గదిలో బంధించి వారి చేతులను వెనక్కు కట్టేశారు. దీని తరువాత బ్యాంకులోని లాకర్లలో గల బంగారు నగలతో పాటు కోటీ 40 లక్షల నగదును దోచుకుని నిమిషాల వ్యవధిలో అక్కడి నుంచి పారిపోయారు.

# భారత్ కాన్సులేట్‌ను సీజ్ చేస్తాం

### ఖలిస్థానీల బెదరింపులు




**ఒట్టావా, సెప్టెంబరు 17:** కెనడాలోని ఖలిస్థానీ ఉగ్రవాదులు మరోసారి రెచ్చిపోయారు. వాంకోవర్‌లోని భారత్ కాన్సులేట్‌ను సీజ్ చేస్తామంటూ బెదరింపులకు పాల్పడ్డారు. ఖలిస్థానీ సిఖ్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్ఐ) సంస్థ ఈ బెదరింపులకు దిగింది. వాంకోవర్‌లోని భారత్ కాన్సులేట్‌ను ముట్టడిస్తామని పేర్కొంది. ఈ నెల 18న (గురువారం) దీన్ని స్వాధీనం చేసుకుంటామని, ఆ సమయంలో ఇక్కడికి ఎవరూ రావొద్దంటూ హెచ్చరికలు చేసింది. ఈ సందర్భంగా భారత హైకమిషనర్ దినేశ్ కె. పట్నాయక్‌ను లక్ష్యంగా చేసుకుని ఉన్న పోస్టర్లను కూడా విడుదల చేసింది. దీంతో ఇది కాస్తా తీవ్ర కలకలం రేపింది. 'రెండేళ్ల క్రితం సెప్టెంబరు 18న హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని దర్యాప్తులో వెల్లడైన విషయాన్ని నాటి ప్రధాని జస్టిన్ ట్రూడో పార్ల మెంటులో పేర్కొన్నారు. ఇప్పుడు కూడా భారత కాన్సులేట్లు ఖలిస్థానీలను లక్ష్యంగా చేసుకుని నిఘా నెట్‌వర్క్‌ను నడుపుతోంది. మాపై గూఢచర్యం కొనసాగిస్తూనే ఉంది' అని ఆరోపించింది. కెనడా గడ్డపై భారత్ చేస్తున్న నిఘా, బెదరింపుల నేపథ్యంలో కాన్సులేట్‌ను ముట్టడి చేస్తున్నట్లు తెలిపింది. ఈ బెదరింపులపై వాంకోవర్‌లోని భారత్ కాన్సులేట్ ఇప్పటివరకు స్పందించలేదు. ఖలిస్థానీ ఉగ్రవాదులకు తమ దేశం నుంచే నిధులు అందుతున్నాయని ఇటీవల కెనడా ప్రభుత్వం ఒక సంచలన నివేదికను విడుదల చేసిన సంగతి తెలిసిందే. భారత్‌లోని పంజాబ్‌లో స్వతంత్ర దేశస్థాపన కోసం హింసాత్మక మార్గాలకు మద్దతు ఇచ్చే ఖలిస్థానీ ఉగ్రమూకలు కెనడా సహా అనేక దేశాల్లో నిధులు సేకరిస్తున్నట్లు నివేదికలో వెల్లడించింది.

అప్పట్లో ట్రూడో ఆరోపణలతో భారత్-కెనడా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఖలిస్థానీ ఉగ్రవాది హార్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆయన ఆరోపించారు. ఈ ఆరోపణలను భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూ వచ్చింది. ఇరుదేశాలూ పరస్పరం దైత్యవేత్తలను వెనక్కి పంపించాయి. ఇటీవల కెనడాలో జరిగిన ఎన్నికల్లో మార్క్ కార్నీ విజయంతో ఇరుదేశాల మధ్య సంబంధాల పునరుద్ధరణకు కృషి జరిగింది. ఈ క్రమంలోనే ఇరుదేశాలు పరస్పరం దౌత్యవేత్తలను కూడా పునర్నియమించాయి.




# టిక్‌టాక్‌పై నిషేధం పొడిగించిన ట్రంప్

**వాషింగ్టన్, సెప్టెంబరు 17:** అమెరికాలో టిక్‌టాక్ యాప్‌పై విధించిన నిషేధం గడువును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పొడిగించారు. ఫెడరల్ నిబంధనలను పట్టించుకోకుండా టిక్‌టాక్‌ను మూసివేసే గడువును ట్రంప్ పొడిగింపు ఉత్తర్వులు ఇవ్వడం ఇది నాలుగోసారి. ఈ మేరకు ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. టిక్‌టాక్‌పై నిషేధం ఎత్తివేసేందుకు చైనాతో ఒక ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం కుదిరిందని రెండురోజుల కిందట చెప్పి నిషేధం పొడగించడం గమనార్హం. అమెరికా, చైనా మధ్య టిక్‌టాక్ యాప్ విషయంలో ఒప్పందం కుదిరిందన్నారు. ఈ నిర్ణయం తర్వాత బైట్‌డాన్స్ యాజమాన్యంలోని ఈ యాప్ అమెరికాలో వాడుకలోకి వస్తుందన్నారు. టిక్‌టాక్‌ను కొనుగోలు చేసేందుకు చాలా కంపెనీల గ్రూప్ యూఎస్ వద్ద ఉందన్నారు. ఈ ఒప్పందం రాబోయే 30 నుంచి 45 రోజుల్లో పూర్తవుతుందని భావిస్తున్నారు. ఈ ఒప్పందం చైనా నియంత్రణలో నున్న కాంగ్రెస్ నుంచి ఆమోదం కూడా అవసరమయ్యే అవకాశం ఉంది. నివేదికల ప్రకారం మైక్రోసాఫ్ట్, అమెజాన్, బిలియనీర్ ఫ్రాంక్ మెక్‌కోర్ట్, ఓన్లీఫాన్స్ వ్యవస్థాపకుడు నేతృత్వంలోని కన్సార్టియం బిడ్డర్స్ జాబితాలో ఉన్నాయి. 2024లో బైడెన్ పరిపాలన సమయంలో టిక్‌టాక్ డేటా భద్రతపై ఆందోళన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఈ ఏడాది అధికారంలోకి వచ్చిన ట్రంప్ టిక్‌టాక్ నిషేధానికి సంబంధించిన ఇప్పటి వరకు నాలుగుసార్లు పొడిగించారు. అధ్యక్షుడైన తర్వాత తొలిసారిగా జనవరి 20న ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. టిక్‌టాక్‌ను అమెరికన్ కంపెనీగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమయంలోనే ఏప్రిల్‌లో రెండోసారి గడువును పొడిగించారు. కానీ, ట్రంప్ టారిఫ్ ప్రకటన తర్వాత చైనా వెనక్కి తగ్గడంతో ఒప్పందం జరుగలేదు. మూడోసారి జూన్‌లో ట్రంప్ గడువును 90 రోజులు పొడిగించారు. నిజానికి టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డాన్స్. ఇది చైనాకు చెందిన కంపెనీ. ఈ యాప్ యూజర్ల డేటాను చైనా ప్రభుత్వానికి ఇచ్చే అవకాశం ఉంటుందని అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తుంది. దాంతో జాతీయ భద్రతకు ముప్పుగా పేర్కొంటున్నది. అయితే,టిక్‌టాక్‌ను అమెరికన్ కంపెనీ అప్పగించాలని బైట్‌డాన్స్‌ను ఆదేశించింది.

# క్రాస్ బోర్డర్ ఉగ్రబాధితులకు రెండునెలల్లోపు పరిహారం చెల్లించాలి

### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు జమ్ము కాశ్మీర్ హైకోర్టు ఆదేశాలు

**శ్రీనగర్, సెప్టెంబరు 17:** సరిహద్దు కాల్పులు, ఉగ్రవాద బాధితులకు పరిహారం కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను నాలుగేళ్ల తర్వాత జమ్ము కశ్మీర్ హైకోర్టు ముగించింది. రెండు నెలల్లోపు బాధితులకు సహాయ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వానికి ఆదేశించింది. పరిహారాన్ని నిర్దిష్ట సమయంలోగా నిర్ణయించాలని పేర్కొంది. 2021లో ఉరి పౌండేషన్ ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. సివిలియన్ విక్టిమ్స్ ఆఫ్ టెరరిస్ట్, కమ్యూనల్ అండ్ లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజం వైలెన్స్ అండ్ క్రాస్‌బోర్డర్ ఫైరింగ్ అనే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకం అమలులో జరుగుతన్న జాప్యాన్ని సవాలు చేసింది. ఈ పథకం ఉగ్రవాద బాధితులకు ఆర్థిక సహాయం అందించడానికి తీసుకొచ్చింది. కొన్ని సంవత్సరాలుగా కేంద్రం, కేంద్రపాలిత ప్రభుత్వాన్ని అఫిడవిట్లును సమర్పించాలని కోర్టు ఆదేశించింది. కానీ బాధితులు సాయం కోసం ఎదురుచూస్తునే ఉంటడంతో కేసు నిలిచి పోయింది. సెప్టెంబర్ ప్రారంభంలో పథకం కింద ఇంకా పరిహారం రాని వారు అర్హత ఉన్నా చెల్లింపులు నిరాకరించిన వారిపై పూర్తి వివరాలతో కూడిన అఫిడవిట్ ఇవ్వాలని ప్రత్యేకంగా ఆదేశించింది. ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ అదనపు అడ్వకేట్ జనరల్ మోహ్సిన్ ఖాదిరీ మాట్లాడుతూ, పిటిషన్‌లో పేర్కొన్న 71 కేసులు విచారణలో ఉన్నాయని కోర్టుకు తెలిపారు.



### టీనేజర్ల అకృత్యాలకు తల్లిదండ్రులకు భారీ జరిమానా

# రూ.2.71కోట్లు విధించిన కోర్టు

**షాంఘై, సెప్టెంబరు 17:** పిల్లలు చేసే తప్పిదాలకు తల్లిదండ్రులు భారీ మూల్యం చెల్లించు కోవాల్సి వస్తుంది. ఇలాంటి ఘటనే చైనాలోని షాంఘైలో చోటుచేసుకుంది. ఇద్దరు టీనేజర్లు ఓ రెస్టారెంట్‌లో చేసిన అకృత్యానికి వారి తల్లిదండ్రులు ఏకంగా 2.2 మిలియన్ యువాన్లు (సుమారు రూ.2.71కోట్లు) నష్టపరిహారం చెల్లించాలంటూ స్థానిక కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. షాంఘైలోని ప్రముఖ హైదిలావో హాట్‌పాట్ రెస్టారెంట్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 24న ఈ ఘటన జరిగింది. మద్యం మత్తులో ఉన్న 17 ఏళ్ల వూ, టాంగ్ అనే ఇద్దరు మైనర్లు, తాము భోజనం చేస్తున్న ప్రైవేట్ డైనింగ్ రూమ్‌లోని టేబుల్‌పైకి ఎక్కి, అందరూ కలిసి తినే మరిగే సూప్‌లో మూత్ర విసర్జన చేశారు. ఈ ఘట నతో రెస్టారెంట్ యాజమాన్యం తీవ్రంగా నష్టపో యింది. కస్టమర్ల నుంచి ఫిర్యాదులు రాకపోయి నప్పటికీ, ముందుజాగ్రత్త చర్యగా ఘటన జరిగిన రోజు నుంచి మార్చి 8వరకు వచ్చిన సుమారు 4,000మందికి పైగా కస్టమర్లకు పూర్తి డబ్బులు వాపసు ఇవ్వడమే కాకుండా, బిల్లుకు పది రెట్ల నగదును పరిహారంగా చెల్లించింది. రెస్టారెంట్‌లోని పాత్రలన్నింటినీ ధ్వంసం చేసి, కొత్తవి కొనుగోలు చేసింది. ప్రాంగ ణాన్ని పూర్తిగా శుభ్రం చేసి, క్రిమిసంహారకాలతో శుద్ధి చేసింది. ఈ వ్యవహారంపై కోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపిన న్యాయస్థానం టీనే జర్ల చర్యలను తీవ్రంగా తప్పుబట్టింది. వారి ప్రవర్తన కంపెనీ ఆస్తి హక్కులను, ప్రతిష్ఠను దెబ్బతీసిందని స్పష్టంచేసింది. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు తమ బాధ్యతను సరిగ్గా నిర్వర్తించలేదని వ్యాఖ్యానించింది. ఈక్రమంలో కంపెనీకి జరిగిన నష్టానికి, పాత్రల ఖర్చులకు, న్యాయపరమైన ఫీజులకు కలిపి మొత్తం 2.2మిలియన్ యువాన్లు చెల్లించాలని ఆదేశించింది. దీంతో పాటు పత్రికల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని కూడా తీర్పులో పేర్కొంది. ప్రపంచవ్యాప్తంగా 1,000కి పైగా బ్రాంచులు కలిగిన హైదిలావో రెస్టారెంట్ చైన్, తమ అద్భుతమైన కస్టమర్ సర్వీస్‌కు, కుటుంబ అనుకూల వాతావ రణానికి ప్రసిద్ధిచెందింది. అలాంటి రెస్టారెంట్‌లో ఈఘటన జరగడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

# జార్జియాలో భారతీయులకు ఘోర అవమానం


### ప్రధాని, విదేశాంగశాఖలకు సోషల్‌మీడియా పోస్టులు



**తిబ్లిసి, సెప్టెంబరు 17:** జార్జియాలో భారతీయ పర్యాటకులకు తీవ్ర అవమానం ఎదురైంది. సరైన పత్రాలు, ఈవీసాలు ఉన్నప్పటికీ 56 మంది భారతీయుల బృందాన్ని ఆర్మేనియా నుంచి జార్జియాలోకి ప్రవేశించకుండా సరిహద్దు అధికారులు అడ్డుకున్నారని, అమానుషంగా ప్రవర్తించారని ఓ మహిళ ఆరోపించారు. ఈ ఘటనపై భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకో వాలని ఆమె డిమాండ్ చేశారు. ధృవీ పటేల్ అనే మహిళ తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో ఈ చేదు అనుభవాన్ని పంచుకున్నారు. ఆర్మేనియా, జార్జియా మధ్య ఉన్న సదఖ్లో సరిహద్దు వద్ద తమ బృందాన్ని ఐదు గంటలకు పైగా గడ్డకట్టే చలిలో నిలబెట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో కనీసం ఆహారం గానీ, టాయిలెట్ సౌకర్యం గానీ కల్పించలేదని తెలిపారు. తమ పాస్‌పోర్టులను రెండు గంటల పాటు స్వాధీనం చేసుకుని, పశువుల్లా ఫుట్‌పాత్‌పై కూర్చోబెట్టారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, అధికారులు తమను నేరస్థుల్లా వీడియోలు తీశారని, కానీ తాము వీడియో తీయకుండా అడ్డుకున్నారని ధృవీ పటేల్ పేర్కొన్నారు. తమ పత్రాలను సరిగా తనిఖీ చేయకుండానే వీసాలు 'సరిగ్గా లేవని' చెప్పి వెనక్కి పంపారని ఆమె తెలిపారు. "జార్జియా భారతీ యుల పట్ల ఇలాగే ప్రవర్తిస్తుంది. ఇది సిగ్గుచేటు, ఆమోదయోగ్యం కాదని ఆమె తన పోస్టులో రాశారు. ఈ విషయంలో భారత ప్రభుత్వం స్పందించాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీ, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌లను ట్యాగ్ చేశారు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో చాలా మంది నెటిజన్లు స్పందించారు. గతంలో తమకు కూడా జార్జియాలో ఇలాంటి అనుభవాలే ఎదురయ్యాయని పలువురు కామెంట్లు చేశారు. భారతీయుల పట్ల జార్జియా అధికారుల వివక్ష చాలా కాలంగా కొనసాగుతోందని ఒకరు పేర్కొనగా, ఇది జాతి వివక్షలో భాగమేనని మరికొందరు ఆరోపించారు. ఈ సంఘటనపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

## సంక్షిప్తంగా..

### చొరబాటుదారుల ఓట్లతో కాంగ్రెస్ గెలవాలని చూస్తోంది: అమిత్‌షా



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు బిజెపి మద్దతిస్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా వెల్లడించారు. చొరబాటుదారుల ఓట్లతో గెలవాలని కాంగ్రెస్ చూస్తోందని ఆరోపించారు. ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా ఢిల్లీలోని త్యాగ రాజ్ స్టేడియంలో స్థానిక ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. చొరబాటుదారులను కాపాడేందుకే రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఇటీవల ఓటర్ అధికార్ యాత్ర నిర్వ హించింది. వారి ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. దేశ ఓటర్లను విశ్వసించడం లేదు. హస్తం పార్టీ అసలు స్వరూపాన్ని గుర్తించే సమయం ఆసన్నమైంది. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం ప్రత్యేక సమగ్ర సవరణకు బిజెపి మద్దతిస్తోంది అని అమిత్ షా పేర్కొన్నారు.

### పెట్రోల్‌లో 20% ఇథనాల్‌పై కేంద్ర మంత్రి హార్దీప్‌సింగ్ వివరణ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ సురక్షితం కాదంటూ గత కొంతకా లంగా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చ జరుగు తున్న విషయం తెలిసిందే. బయో ఇంధనాల వల్ల ఆటోమొబైల్ ఇంజిన్లు దెబ్బతింటాయని పలువురు చేస్తున్న ప్రచారాలను కేంద్ర మంత్రి హార్దీప్‌సింగ్ పురి కొట్టిపారేశారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందనేది చెత్త వాదన అన్నారు. ఈ 20 ఇంధనం పర్యావరణపరంగా ఉపయోగించడానికి సురక్షితమని పేర్కొన్నారు. అయితే దీర్ఘకాలంలో పాత వాహనాల్లో గ్యాస్కెట్లు, ఇంధన రబ్బరు గొట్టాలు, పైపులను మార్చాల్సి రావచ్చని అది సాధారణమైన విషయమేనని పేర్కొన్నారు. పలువురు ఉద్దేశపూర్వకంగానే ఇథనాల్‌తో సమ స్యలు వచ్చే అవకాశం ఉందని ప్రజల్లో తప్పుడు భయాలను సృష్టిస్తున్నారని హార్దీప్‌సింగ్ పురి పేర్కొన్నారు. అంతర్జాతీయ ఇంధన సంస్థ అంచ నాల ప్రకారం భారత్‌లో ఇంధన డిమాండ్ రాబో యే రెండు దశాబ్దాలలో ప్రపంచ దేశాల్లో ఉన్న దానికంటే మూడురెట్లు పెరుగుతుందన్నారు.

### ఉగ్రదాడుల వెనుక మసూద్ హస్తం నిజమే: జైషే



**ఇస్లామాబాద్, సెప్టెంబరు 17:** భారత పార్లమెంట్‌పై జరిగిన ఆత్మాహుతి దాడి, 26/11 ముంబయి మారణకాండ వెనుక జైషే అధినేత మసూద్ అజర్ హస్తం ఉందని ఆ సంస్థ టాప్ కమాండర్ అంగీకరించాడు. తాజాగా దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఇటీవల ఆ సంస్థకు చెందిన మసూద్ ఇలియాస్ కశ్మీరి ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ 'అమిర్ ఉల్ ముజాహిద్దీన్ మౌలానా మసూద్ అజర్ భారత్ జైలు నుంచి బయటపడి పాకిస్థాన్ వచ్చాక బాలాకోట్‌లో ఆయనకు ఆశ్రయం లభించింది.' అని పేర్కొన్నాడు. పాకిస్థాన్‌లో ఉగ్రవాదులు ఆశ్రయం పొంది భారత్‌పై దాడులు చేస్తున్నా రన టానికి ఈ ప్రకటన బలమైన ఆధారంగా నిలిచింది. ఇలి యాస్ కశ్మీరీ చెప్పిన దాని ప్రకారం మసూద్ అజార్ బాలాకోట్‌ను అడ్డాగా చేసుకొని ఎప్పటినుంచో భారత్‌పై ఉగ్రకుట్రలు పన్నుతున్నట్లు తేలింది.

### పాక్ నకిలీ ఫుట్‌బాల్ జట్టు..వచ్చింది చొరబడేందుకు



**టోక్యో, సెప్టెంబరు 17:** పాకిస్థాన్ ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎఫ్ఐఎ) ప్రొఫెషనల్ ఫుట్‌బాల్ జట్టు పేరుతో జపాన్‌లోకి అక్రమంగా ప్రవే శించిన పాక్ పౌరులను ఆ దేశం ఎయిర్‌పోర్టు నుంచే డిపోర్టు చేసింది. అంతర్జాతీయ మీడియా వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం దేశంలో జరుగుతున్న ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొ నడానికి పాక్ నుంచి వచ్చినట్లుగా చెప్పుకుంటూ ఇటీవల 22 మంది వ్యక్తులు జపాన్‌కు వెళ్లారు. పాక్ విదేశాంగ మంత్రిత్వశాఖ జారీ చేసిన నకిలీ నో-అబ్జెక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌ఒసిలు) కూడా వారి వద్ద ఉండడంతో ఫుట్‌బాల్ నిర్వాహకులకు వారిపై ఎటువంటి అనుమానం రాలేదు. జపాన్‌లోని విమానాశ్రయానికి చేరుకున్న తర్వాత విచారణ సమయంలో ఇమ్మిగ్రేషన్ అధికారులకు వారిపై అనుమానం రావడంతో దర్యాప్తునకు ఆదేశించారు. తర్వాత వారిని నకిలీ జట్టుగా గుర్తించిన జపాన్ అధికారులు విమానాశ్రయం నుంచే వెనక్కి పంపేశారు. అయితే వీరు పాకిస్థాన్ విమానాశ్రయం అధికారుల నుంచి ఎలా తప్పించుకోగలిగారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యానికి కెసిఆర్ కారణం

### ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రెజర్వేషన్ల కు కెసిఆర్ క్యాప్ విధించడం వల్లనే ఎన్నికలు లేటు అవుతున్నాయని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. గాంధీభవన్‌లో బుధవారం విలేఖరులతో మాట్లాడుతూ కాలేజిలకు ఫీజు రియంబర్స్‌మెంట్ 1200కోట్లు బకాయిలు మీరు ఎగ్గొట్టం వల్లే వచ్చాయని కెటిఆర్‌కు సమాధానం చెప్పారు. కెటిఆర్ ఉద్దేశం ఏంటి?తెలంగాణ ప్రజలు ఎవరు బాగుపడొద్దని ఉద్దేశమా?గ్రూప్1 అభ్యర్థుల తల్లిదండ్రులు ఒక్కో పోస్ట్ కు 3కోట్లు ఇచ్చారని కేటిఆర్ అంటుండు533 మంది గ్రూప్1 విద్యార్థుల మీద విషం కక్కుతుండు, అవమానిస్తున్నారని ఆయన ఆరోపించారు. కెటిఆర్‌పై ఖచ్చితంగా ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డిని కొరతా అని అన్నారు. మాకు ఓటు వేయలేదు మీరు అనుభవించండి అని కెసిఆర్ శాపాలు పెట్టారు అందుకే ఆరోజే అర్థం అయిందని వివరించారు. అధికారంలో ఉండి తెలంగాణ ను కూల్చారు ప్రతి పక్షం లో ఉండి కూడా కూల్చాలనీ చూస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి ఎక్కడికి పోయిండు అని కెటిఆర్ అంటుండు ఈరోజు ముఖ్యమంత్రి సచివాలయంలో ఉండు ప్రతి పక్ష నేత మీ నాయన ఎక్కడికి పోయిండు అని అన్నారు. కెటిఆర్ ఎనిమిది మంది ఎంపీల గురించి బేస్ లెస్ ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు.ఎల్ అండ్ టి నష్టా గురించి మాట్లాడుతున్నారు కానీ మెట్రో ఎవరి హాయంలో వచ్చింది అని ప్రశ్నించారు. మీ పదేళ్ళ హాయంలో ఎల్ అండ్ టి నష్టాల్లోకి పోయిందని ఆరోపించారు. 2010 మెట్రో 2వ స్థానంలో ఉందని అన్నారు. 2014 తర్వాత 20వ స్థానానికి పడి పోయిందని చెప్పారు. కెటిఆర్ 12వేల కోట్ల డ్రగ్స్ గురించి మాట్లాడుతున్నారనీ మేము వచ్చాక నే విచ్చల విడిగా కేసులు పెరుగుతున్నాయనీ ఆరోపించడం అవాస్తవం అని అన్నారు. మీ హయాంలో దందా చేశార అందువల్ల కేసులు పెరగలేదు మా హాయంలో కేసులు పెడుతున్నాం అందులవల్ల కేసులు పెరుగుతున్నాయని తెలిపారు రాజాకార్లను తరిమి కొట్టిన రోజున కేటిఆర్ ఏమి ప్రచారం చేయదల్చుకున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి నియంత పాలన అంటుండు మరీ కెటిఆర్ మీ హాయంలో మీ అయ్య నియంత పాలన చేసింది గుర్తుకులేదా అని నిలదీశారు.

# బిజెపికి చరిత్ర తెలియదు.. దాన్ని తిరగరాయడమే తెలుసు!



### వీళ్లకు గాంధీ అంటే పడదు.. ఆయనను హత్య చేసిన గాడ్సే దేవుడు

### నెహ్రూ ఆదేశాలతోనే 'పోలో' ఆపరేషన్‌తో హైదరాబాద్ సంస్థానాన్ని విలీనం చేసిన పటేల్

### ఇప్పుడు ఉన్నది పాత బిజెపి కూడా కాదు.. 2014 నుంచి పుట్టిన మోడీ-షా బిజెపి

### తెలంగాణ విలీనదినోత్సవం సందర్భంగా పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** బిజెపికి భారత స్వాతంత్ర్య సమరం చరిత్ర తెలియదుకానీ చరిత్రను వక్రీకరణలతో తప్పుగా తిరగ రాయడం మాత్రమే తెలుసని వీళ్లకు సత్యాగ్రహం అనే ఆయుధంతో దేశంకు స్వాతంత్ర్యం ప్రసాదించిన గాంధీ అంటే పడదు ఆయనను హత్యచేసిన గాడ్సే ను దేవుడుగా కొలుస్తారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ విమర్శించారు. గాంధీభవన్‌లో హైదరాబాద్ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకం ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర విలీనానికి కాంగ్రెస్ పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను ఈ రోజున స్మరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. విలీనం కోసం అహర్నిశలు కృషి చేసిన రామనంద తీర్థ, జమాల పురం కేశవరావు, బూర్గు ల రామ కృష్ణారావు, పివి నరసింహారావు వంటి మహ నీయులను, నిజాం వ్యతిరేకంగా పోరాడిన కొమురం భీమ్, దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి, కమ్యూనిస్టు యోధులను స్మరించడం ప్రతి తెలంగాణ వాసి బాధ్యత అన్నారు. బిజెపి మాతృసంస్థ జనసంఘ్ ఏనాడు దేశస్వాతంత్రం కోసం పాటుపడలేదని అందులోంచి బిజెపి పార్టీ 1980లో పుట్టిందని, స్వాతంత్రం, తెలంగాణ విలీన పోరాటాలకు సంబంధం లేనిదని మహేష్‌కుమార్ ఎద్దేవా చేశారు. ఇది పాత బిజెపి కూడా కాదు, 2014లో పుట్టిన మోడీ,షాలకు పుట్టిన కొత్త బిజెపి అని అభివర్ణించారు. వీరికి చరిత్ర తెలియదు, చరిత్రను వక్రీకరించడం మాత్రమే తెలుసు. గాంధీని గౌరవించని, గాడ్సేను దేవుడిగా చూసే వారి నుండి దేశభక్తి ఆశించడం వృథా ప్రయాసగా అభివర్ణించారు.1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆపరేషన్ పోలో" ద్వారా నాలుగు రోజుల్లో హైదరాబాద్ సంస్థానాన్ని భారతదేశంలో విలీనం చేసిందని గుర్తుచేశారు. కానీ, నేడు అదే పటేల్ పేరుతో రాజకీయాలు చేస్తున్న బిజెపి ఆయన చేసిన విలీనాన్ని విమోచనంగా పిలవడం పటేల్ ను అవమానించడం కాదా అని ప్రశ్నించారు.ప్రస్తుతం అన్ని రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ఎన్నికల సంఘాన్ని లొంగదీసుకుని మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ పాలనను ఆయన తీవ్రంగా విమర్శించారు. బీహార్‌లో ఓటు దోపిడీ ప్రయత్నాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని బల హీనపరుస్తున్నారని ఆరోపించారు. రాహుల్ గాంధీ నడిపిస్తున్న ఓటు చోరీ ఉద్యమం" బిజెపి గుండెల్లో వణుకు పుట్టిస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ త్యాగ స్వరూపమని, స్వాతంత్రం కోసం అనేక మంది నాయకులు జైలు పాలయ్యారని... సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు ప్రధాని అయ్యే అవకాశమున్నా ఆర్థిక నిపుణుడు డా. మన్మోహన్ సింగ్‌ను రెండుసార్లు ప్రధాని చేశారు అనేది కాంగ్రెస్ త్యాగానికి నిదర్శనం అన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం రేవంత్ రెడ్డి నేతృత్వంలో అద్భుతమైన ప్రజా పాలన కొన సాగుతోందని, మహిళలకు ఉచిత బస్ ప్రయాణం నుంచి సన్నబియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

## హైదరాబాద్ భూములు అమ్ముకొన్నది ఎవరో ప్రజలకు తెలుసు

### ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో భూములు అమ్ముకుంది ఎవరో తెలంగాణ ప్రజలకు తెలుసనీ,ఎకరం వంద కోట్లకు అమ్మామని గొప్పలు చెప్పుకుంది మీరు కాదా? అనిప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్ సిఎల్‌పి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కెటిఆర్ చిట్ చాట్ పేరుతో చెత్త అంతా వాగుతున్నాడని దుయ్యబట్టారు. పని పాటా లేక సోది పోగిసి మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. మా ముఖ్య మంత్రి పైన పడి ఏడవడం తప్ప కెటిఆర్ కు పనిలేకుండా పోయిందని విమర్శించారు. చిట్ చాట్ లో చెల్లెలు కవిత గురించి మాత్రం నోరు మెదపడం లేదని అన్నారు. కవిత అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము ,ధైర్యం లేదని విమర్శించారు. కవితపైన కనీసం చిట్ చాట్ లో కూడా మాట్లాడే ధైర్యం చేయడం లేదు.మా ముఖ్యమంత్రి సెక్రటేరియట్ కు రావడం లేదని కెటిఆర్ అంటున్నాడుకానీ కెటిఆర్ చిట్ చాట్ చేసే టైం కి మా సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ నూతన విద్యా విధానంపైన సెక్రటేరియట్ లో సమావేశం నిర్వహిస్తున్నారని తెలిపారు. కెటిఆర్ కళ్లు కాకులు ఎత్తుకుపోను, మీది ఫాంహౌస్ పాలన మాది ప్రజా పాలన అని ఆయన అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి బెదిరింపుల వల్లనే మెట్రో నుంచి ఎల్ అండ్ టీ తప్పుకుంటుందని కెటి ఆర్ చెత్త వాగుడు వాగుతున్నాడని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో నిర్వహించలేమని చాలా కాలం నుంచి ఎల్అండ్‌టీ కేంద్రానికి, రాష్ట్రానికి లేఖలు రాస్తోంది.. గతంలో బేగంబజారు నుంచి మెట్రో లైన్ వేయకుండా ఎల్ అండ్ టీ ని బెదిరించింది కెసిఆరే అని గుర్తుకు చేశారు. మా ముఖ్యమంత్రి హైదరా బాద్‌లో మెట్రోను నాలుగు వైపులకు విస్తరి స్తున్నారని తెలిపారు. ఎల్అండ్‌టీ ని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు. తన నీచ రాజకీ యాల కోసం హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీయడమే కెటిఆర్ లక్ష్యంగా మారిందన్నారు.

## తగ్గనున్న పాల ఉత్పత్తుల ధరలు: మదర్ డెయిరీ

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** పాలు, ఇతర ఆహార ఉత్పత్తుల కొత్త ధరలను మదర్ డెయిరీ ప్రకటించింది. జీఎస్టీ సంసరణలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నది. ఈ కొత్త ధరలు ఈనెల 22నుంచి అమల్లోకి వస్తాయని వెల్లడించింది. ఈ మేరకు ఒక ప్రకటనలో వినియోగదారులు ఎకువగా కొనుగోలు చేసే పనీర్, వెన్న, చీజ్, నెయ్యి, మిల్‌షేక్‌లు, ఐస్‌క్రీమ్స్ ధరలు తగ్గాయని వివరించింది. సాధారణ పాల ప్యాకెట్ ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నది. తమ ఉత్పత్తులు జీఎస్‌టీ తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా జీరో ట్యాక్స్ లేదా 5శాతం పన్ను పరిధిలోకి వస్తుందని చెప్పింది. దీంతో వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేసే పనీర్, వెన్న, చీజ్, గీ, మిల్క్‌షేక్‌లు, ఐస్‌క్రీమ్స్ ధరలు తగ్గాయని మదర్ డెయిరీ తెలిపింది. 500 గ్రాములు వెన్న ప్యాకెట్ ధర రూ.305గా ఉండేది. ఇప్పుడు రూ.285కు చేరింది. అలాగే బటర్ స్కాచ్ కోన్ ఐస్‌క్రీమ్ ధర రూ.35 నుంచి రూ.30కి తగ్గింది. ఇక రోజువారీ పాలప్యాకెట్ల ధర కూడా తగ్గింది. ఒక లీటర్ టోన్డ్ టెట్రా ప్యాక్ ధర రూ.77గా ఉండేది. ప్రస్తుతం రూ.75కు చేరింది. అయితే, సాధారణ పాలీ ప్యాక్ మిల్క్ ధరల్లో మార్పు ఉండదని మదర్ డెయిరీ తెలిపింది. ఫుల్ క్రీమ్, టోన్డ్, ఆవుపాలు వంటి అన్ని పాలీ ప్యాక్ పాలు ఎప్పటినుంచో జీఎస్‌టీ మినహాయింపులో ఉన్నాయని, వాటి ధరలపై ఎటువంటి ప్రభావం లేదని కంపెనీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

## పోలీసు శాఖలో ఖాళీల భర్తీపై హైకోర్టులో పిటిషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ పోలీసు శాఖలో మంజూరైన పోస్టులను సర్కారు భర్తీ చేయడం లేదని హైకోర్టులో బుధవారం పిటిషన్ దాఖలయ్యింది. గత మూడేళ్లుగా పోలీసు శాఖలో ఎలాంటి భర్తీలు జరగలేదని, పోలీసు శాఖలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పిటిషనర్ తెలిపారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు దీనిపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. దీనిపై విచారణను హైకోర్టు రెండు వారాలు వాయిదా వేసింది.

## అసెంబ్లీ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించిన స్పీకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 17:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా బుధవారం శాసనసభ ఆవరణలో జాతీయ జెండాను రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆవిష్కరించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్, జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహాలకు సభాపతి ప్రసాద్ కుమార్ పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లెజిస్లేటివ్ సెక్రటరీ డా. వి నరసింహా చార్యులు, శాసనసభ అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంతకు ముందు



తెలంగాణ శాసనమండలి ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని మండలి చైర్మన్ గుత్తా సుఖేం దర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యులు బోగ రపు దయానంద్, తక్కెళ్ల పల్లి రవీందర్‌రావు, శ్రీపాల్‌రెడ్డి, లెజిస్టేటీవ్ సెక్రటరీ డా.వి. నరసింహా చార్యులు అధికారులు తదితురులు పాల్గొన్నారు.

## డిజిపి కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** సెప్టెంబర్ 17వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర వ్యహించిన ప్రజా పాలన దినోత్స వాన్ని బుధవారం నాడు డిజిపి కార్యాలయంలో పోలీసు శాఖ ఘనంగా నిర్వహించింది.
ఈ సందర్భంగా రైల్వేస్, రో డ్ సేఫ్టీ ఐజి రమేష్ నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కో..ఆర్డినేషన్ ఐజి ఎం. శ్రీనివాసులు, లీగల్ ఎస్‌పి సతీష్, శాంతి భద్రతల ఏఐజి రమణ కుమార్, డిజిపి కార్యాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ యోగేశ్వరరావు, డిఎస్‌పి ఉదయ భాస్కర్ తదితరులు, డిజిపి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మోడీ జన్మదిన వేడుకలు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ప్రధాని నరేంద్ర మోడీ 75వ జన్మదినం సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్‌రావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సేవా పక్వాడలో భాగంగా పార్టీ ఆఫీసులో రక్తదానం శిబిరాన్ని ప్రారంభించారు. ప్రధాని మోడీ ఆయు రారోగ్యాలతో వర్ధిల్లాలని కోరుకుంటూ, దేశసేవలో నిరంతరం ముందుకు సాగాలని హృదయపూర్వకంగా ఆకాంక్షి ంచారు. వికసిత భారత్ నిర్మాణంలో ప్రధానమంత్రి మోడీ నాయకత్వం మార్గదర్శకంగా నిలు స్తుందని అన్నారు.

# మోడీ నేతృత్వంలో అవినీతిరహిత, సుపరిపాలన



### బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవాలు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, బిజెపి తమిళ నాడు, కర్ణాటక ఇంచార్జ్ సుధాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ అంజి రెడ్డి, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఇతర సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ దేశంలో ప్రతి సంవత్సరం మనం 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాం. కానీ మనకు స్వా తంత్రం వచ్చినప్పుడు, నాడు హైదరాబాద్ సంస్థానంలో 1948 సెప్టెంబర్ 17 వరకు స్వాతంత్రం రాలేదన్నారు. ఆ రోజు ఆపరేషన్ పోలో ద్వారా నియంత నిజాంకు వ్యతిరేకంగా భారత ప్రభుత్వంలో హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో చరిత్రాత్మక పోలీస్ యాక్షన్ ద్వారా తెలంగాణను భారతదేశంలో అంతర్భాగంగా చేసుకోవడం జరిగిందని, ఈ విజయం వెనుక అనేక మంది త్యాగాలు ఉన్నాయన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసి, కాసిం రజ్వీ ఏర్పాటు చేసిన రజాకార్ల సైన్యం హైదరాబాద్ సంస్థానంలో అనేకమంది అమాయకులను వేధించారు, మహిళలపై అత్యాచారాలకు ఒడిగట్టారన్నారు. అనేకమంది ప్రాణాలు బలితీసుకున్నారు. బైరాన్ పల్లి, పరకాల, గుండ్రాంపల్లి, నిర్మల్ వంటి అనేక ప్రదేశాల్లో రజాకార్లు మహిళలపై వేధింపులు జరిగాయి. దాడులు చేశారు. రజాకార్లపై ఈ ప్రాంతాల్లో అనేకమంది పోరాటం చేశారు. ఈ చరిత్ర మనందరికీ గుర్తుగా నిలిచిపోవాలని, అప్పుడు జరిగిన సంఘటనలు మనం ఎప్పటికీ మరచిపోకూడదని అన్నారు.
మనం గుర్తించు కోవాల్సింది ఏమిటంటే నియంత నిజాం వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు చేసిన పోరాటం, హైదరాబాద్ స్టేట్ అప్పట్లో మన ప్రజలు నిరంకుశ నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడి, స్మరించుకోదగిన త్యాగాలు చేశారని అన్నారు. గత 25 సంవత్సరాలుగా మన భారతీయ జనతా పార్టీ ఆ పోరాటయోధులను స్మరించుకునేలా, తెలంగాణ లిబరేషన్ డే ని అధికారికంగా జరుపు కోవాలని నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రతి ఏడాది 17 సెప్టెంబర్ రోజును తెలంగాణ ప్రజల హృదయాలను కదిలించే, గౌరవింపదగిన దినంగా గుర్తించాలని, సర్దార్ వల్లభాయి పటేల్ ఆపరేషన్ పోలో ద్వారా పోలీస్ యాక్షన్ సిన కీలక పాత్ర లేకపోతే, ఈ ప్రాంతం పాకిస్తాన్ లేదా మరో స్వతంత్ర దేశంగా ఉండే పరిస్థితి ఏర్పడేదని అన్నారు. పోరాటయోధుల త్యాగాన్ని మర్చిపోకుండా, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా జరుపుకోవాలన్నారు. కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత , కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రేరణతో హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ వేడుకలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించారని, మన భారత సైనిక, కేంద్ర బలగాలు సైతం ఈ సెప్టెంబరు 17 తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను గత మూడు సంవత్సరాలుగా నిర్వహించుకోవడం జరుగు తుందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో, అవినీతి రహిత, సుపరిపాలనతో భారత్ దేశం వికసిత్ భారత్ గా ఎదుగుతుందని, ఈ రోజు విశ్వకర్మ దినోత్సవం కావడంతో, దేశ నిర్మాణం కోసం కృషి చేస్తున్న శ్రామికుల సేవలను గుర్తు చేసుకుంటూ, విశ్వకర్మ మహర్షిని స్మరించుకోవాలన్నారు. ఇన్ని కార్యక్రమాల మధ్య కూడా తెలంగాణ విమోచన దినోత్సవాన్ని విజయవంతంగా జరుపుకునేందుకు పార్టీ కార్యకర్తలు, నాయకులు ముందుకొచ్చి భాగస్వామ్యం కావడం అభినందనీయమన్నారు.

## 14 లక్షల మంది విద్యార్థులకు 8 వేల కోట్ల బకాయిలు చెల్లించాలి

### దసరా తర్వాత వినూత్న పద్ధతిలో ఉద్యమం: ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** కళాశాలల బంద్ విరమణ సందర్భంగా ప్రభుత్వం చర్చలు జరిపి కేవలం 600 కోట్లు బడ్జెట్ విడుదల చేస్తామనడం సరి కాదని, 8 వేల కోట్లు బకాయిలు ఉంటే, 600 కోట్లు ఏ మూలకు సరిపోతాయని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రశ్నించారు. ప్రభుత్వం ఒక్కొక్క కాంట్రాక్టర్‌కు 6, 7 కోట్లు ఏక కాలంలో చెల్లిస్తూ, చదువుకునే 14 లక్షల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజుల రీయింబర్స్‌మెంట్ బకాయిలు 8 వేల కోట్లు ఇవ్వడానికి అవరోధం ఏమిటని ఆయన నిలదీశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేష్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ల సతీష్ అధ్యక్షత జరిగిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనేక ఇతర పథకాలకు ఉదారంగా బడ్జెట్ కేటాయిస్తూ రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పథకాలకు బడ్జెట్ కేటాయించకపోవడం దుర్మార్గమైన చర్యని విమర్శించారు. ఫీజుల బడ్జెట్ చెల్లించకపోతే రాష్ట్రంలో యుద్ధమే కొనసాగుతుందని, దసరా తరువాత విన్నూత పద్ధతిలో ఆందోళనలు కొనసాగిస్తామని, బడ్జెట్ విడుదల చేసేంతవరకు ఉద్యమాలు ప్రతిరోజు కొనసాగుతాయని ఆర్.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. చిత్రంలో నీల వెంకటేశ్, పగిళ్ళ సతీష్ తదితరులు

కృష్ణయ్య హెచ్చరించారు. 22 నెలల క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు 20 రూపాయలు కూడా విడుదల చేయలేదని, ఈ పథకం అమలుకు నాలుగు శాఖల ద్వారా బడ్జెట్‌లో 5 వేల కోట్లు కేటాయించి, ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని, కేంద్ర ప్రభుత్వం కూడా ఎస్సీ, ఎస్టీలకు ఈ పథకం కింద వేల కోట్లు కేటాయిస్తున్నదని, వీటిని ఎం చేస్తున్నారని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిసి నాయకులు మణికంఠ, రాందేవ్ మోదీ, రవియాదవ్, నిఖిల్ పటేల్, లీలా తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ స్థాయి నుంచి సంస్థాగతంగా కాంగ్రెస్ బలోపేతానికి కృషి

### ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి


**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** గ్రామీణ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్ కార్యకర్తలకు ప్రభుత్వాన్ని అనుసంధానం చేయాడానికి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సి రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ టిపిసిసి చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించి తొలిసంవత్సరం కావడంతో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సి రెడ్డి స్వగృహానికి అహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ"మహేష్ కుమార్ గౌడ్ ఒక సంవత్సర కాలంలో పార్టీని బలపర్చడంలో కార్యకర్తలను ఉత్తేజపరచడంలో విశేష పాత్ర పోషించారు. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్‌ను మరింత చైతన్య వంతం చేసే దిశగా ఆయన కృషి అభినందనీయమైనదన్నారు.

## రేపు పశువైద్య విశ్వవిద్యాలయం ఐదో స్నాతకోత్సవం

### రైతులకు సేవ చేయడంలో వర్సిటీ ముందంజ

### వర్సిటీ ఉపకులపతి జ్ఞానప్రకాష్

**హైదరాబాద్ (అత్తాపూర్) సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** విద్యార్థులకు విద్యతో పాటు రైతులకు సేవ చేయడంలో పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ముందుందని విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవ ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఉపకులపతి జ్ఞాన ప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి జ్ఞానప్రకాష్ మాట్లాడుతూ.. ఈనెల 19న పశువైద్య విశ్వవిద్యాలయం 5వ స్నాతకోత్సవాన్ని ఉదయం 10 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ స్నాత కోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరు కానున్నారని, అతిథులుగా జాతీయ డెయిరీ అభివృద్ధి బోర్డు ఆనంద్ గుజరాత్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మీనేష్ షా హాజరై ప్రసంగిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు, అకాడమిక్ కౌన్సిల్ సభ్యులు, పూర్వ ఉపకుల పతులు, పశువైద్య విభాగంలో నిష్ణాతులు పాల్గొననున్నారని ఆయన అన్నారు. ఈ స్నాతకోత్సవంలో 2023 జనవరి 1 నుండి 2024 డిసెంబరు 31 వరకు పట్టభద్రులైన మొత్తం 524 మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయబడతాయి. వీరిలో 16 మంది పిహెచ్.డి. పట్టభద్రులు, 69 మంది మాస్టర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (ఎస్‌బిఎస్‌సీ) పట్టభద్రులు, 345 మంది బాచిలర్ ఆఫ్ వెటర్నర్ సైన్ అండ్ యానివాల్ హాస్బండరీ (బివిఎస్‌సి, ఎహెచ్) పట్టభద్రులు, 54 మంది బిటెక్ (డెయిరీ టెక్నాలజీ, పట్టుభద్రులు, 40 మంది బాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ పట్టభద్రులు, వివిధ విభాగాలలో విశిష్ట ప్రతి కనబరిచిన ప్రతిభావంతులైన విద్యార్థులకు 25 బంగారు పతకాలను ప్రధానం చేయనున్నామని ఉత్తమ అధ్యాకులకు రెండు అవార్డులు అంద జేయనున్నట్లు తెలిపారు. పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం రైతులకు క్షేత్రస్థాయిలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నమని రైతులకు అత్యాధునిక టెక్నాలజీతో కూడిన సేవలను అందజేస్తున్నామని పేర్కొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఉపకులపతి జ్ఞాన ప్రకాష్ ,రిజిస్ట్రార్ శరత్ చంద్ర, ఉదయకుమార్ తదితరులు

## ఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ 1,743 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి తెలంగాణ పోలీసు నియామక మండలి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆర్టీసీలో 1000 డ్రైవర్, 743 శ్రామిక్ పోస్టులు భర్తీ చేయనున్నట్టు నోటిఫికేషన్లో పేర్కొన్నారు. అక్టోబరు 8 నుంచి 28 వరకు దరఖాస్తు గడువు తేదీగా నిర్ణయించారు. డ్రైవర్ పోస్టులకు 22 నుంచి 35 ఏళ్లు. శ్రామిక్ పోస్టులకు 18 నుంచి 30ఏళ్ల వయసు వారు అర్హులని తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, కేటగిరి వారికి 5 ఏళ్లు, ఎక్స్ సర్వీస్ మెన్ అయితే 3ఏళ్లు వయో పరిమితి సడలింపు ఉంటుందని బోర్డు తెలిపింది. స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపిక చేయనున్నట్లు పేర్కొంది. పూర్తి వివరాల కోసం డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. టిజిపిఆర్‌బి.ఐఎన్‌లో చూడాలని పోలీసు నియామక మండలి తెలిపింది.



# యుద్ధప్రాతిపదికన రాంబన్‌లో స్టీల్‌బ్రిడ్జి నిర్మించిన ఆర్మీ

**శ్రీనగర్, సెప్టెంబరు 17:** భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన జమ్ముకశ్మీర్‌లోని రాంబన్ జిల్లాలో భారత సైన్యం మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. వరదల కారణంగా కొట్టుకుపోయిన కీలక రహదారిని పునరుద్ధరించి, ప్రజల కష్టాలను తీర్చింది. కేవలం కొద్ది రోజుల్లోనే 150 అడుగుల పొడవైన మైత్రా వంతెనను నిర్మించి, రాకపోకలను పునరుద్ధరించింది. ఇటీవల కురిసిన ఎడతెరిపిలేని వర్షాలకు రాంబన్ జిల్లాను ఇతర ప్రాంతాలతో కలిపే కారోల్‌మైత్రా రహదారిలోని ఒక ప్రధాన భాగం పూర్తిగా కొట్టుకుపోయింది. చీనాబ్ నదికి దాదాపు 20 మీటర్ల ఎత్తున, ప్రమాదకరమైన కొండచరియల కింద ఉన్న ఈ మార్గం ధ్వంసం కావడంతో స్థానిక గ్రామాలు, ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధాలు తెగిపోయాయి. దీంతో వాహనాలు నిలిచిపోయి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో, జిల్లా యంత్రాంగం సహాయం కోసం సైన్యాన్ని ఆశ్రయించింది. తక్షణమే స్పందించిన భారత సైన్యంలోని వైట్ నైట్ ఇంజినీర్స్ బృందం రంగంలోకి దిగింది. భారీ వాహనాల రాకపోకలను కూడా తట్టుకునేలా 150 అడుగుల పొడవైన ట్రిపుల్ ప్యానెల్, డబుల్ స్టోరీ, రీఇన్‌ఫోర్స్‌డ్ బెయిలీ బ్రిడ్జి నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసింది. ఈ బృహత్కార్యంలో సరిహద్దు రహదారుల సంస్థ (బీఆర్ఓ), జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్ హెచ్ఏఐ), జమ్ముకశ్మీర్ పోలీసులు, ఇతర పౌర సంస్థలు సైన్యానికి పూర్తి సహకారం అందించాయి. ఈ వంతెన నిర్మాణంతో పాటు హమ్ ఆప్కే సాథ్ హై ప్రాజెక్టు కింద విస్తృత సహాయక చర్యలు కొనసాగుతున్నాయని రక్షణ శాఖ పీఆర్ఓ, లెఫ్టినెంట్ కల్నల్ సునీల్ బర్త్వాల్ తెలిపారు. కిష్త్వార్, దోడా, రాంబన్, ఉధంపూర్, రియాసి, రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో వరదలు, కొండచరియలు విరిగిపడటంతో నష్టపోయిన సుమారు 5,000 మందికి పైగా ప్రజలకు సహాయం అందించినట్లు ఆయన వివరించారు. ఈ సహాయక చర్యల్లో భాగంగా మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి, అవసరమైన మందులు, ఆహారం, పశువైద్య సేవలు అందించాం. ఇలాంటి కార్యక్రమాలు సైన్యానికి, స్థానిక ప్రజలకు మధ్య విశ్వాసాన్ని, నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తాయని లెఫ్టినెంట్ కల్నల్ బర్త్వాల్ పేర్కొన్నారు. తాము సేవ చేసే ప్రజలకు సైన్యం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.



గ్రంథాన్ని డా. కె.వి.రమణాచారి, పుష్పలత దంపతులకు అంకితమిస్తున్న బ్రహ్మానందరావు, విశ్వనాథం, జయరాములు, విజయకుమార్, జీడిగుంట తదితరులు

# తెలుగు, సంస్కృత భాషల్లో వైవిధ్యభరితం మాదిరాజు రచనలు

డా. కె.వి.రమణాచారి

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** తెలుగు, సంస్కృత భాషల్లో వైవిధ్యభరితమైన రచనలు చేయడంలో డా. మాదిరాజు బ్రహ్మానందరావు ప్రత్యేకత అని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. బుధవారం రాత్రి శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలోని డా. రావిచెట్టు రంగారావు కళావేదికలో యువభారతి, నవ్యసాహితీ సమితి సంయుక్త ఆధ్వర్యంలో డా. మాదిరాజు బ్రహ్మానందరావు రచించిన ప్రత్యుక్తులు గ్రంథావిష్కరణ సభలో ఆయన గ్రంథస్వీకర్తగా పాల్గొని తన స్పందన తెలిపారు. ప్రత్యుక్తులు గ్రంథం తెలుగు సాహిత్యంలో వినూత్న ప్రక్రియని, 232 నూతన పదాలతో, పద్యాలతో కూడిన విలక్షణ రచన అన్నారు. సంస్కృతం, తెలుగులో వేర్వేరు అర్థాలను స్ఫురింపజేసే ఒకేపదాన్ని గ్రంథకర్త మాదిరాజు ప్రత్యుక్తిగా పేర్కొనడం, దాని అర్థాన్న వివరించడం శ్లాఘనీయమన్నారు. ఆచార్య ఫణీంద్ర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యువభారతి వ్యవస్థాపకులు ఆచార్య వంగపల్లి విశ్వనాథం, విశిష్ట అతిథులు తెలుగు అకాడమీ పూర్వ సంచాలకుడు ఆచార్య కె.యాదగిరి, ఆచార్య తాడేపల్లి పతంజలి, డా. జోష్ సంతోష్‌కుమార్, డా. ఇ.జయరాములు, సమితి సమన్వయకర్త వేమరాజు విజయకుమార్, జీడిగుంట తదితరులతో కలిసి డా. మాదిరాజు బ్రహ్మానందరావు రచించిన ప్రత్యుక్తులు గ్రంథాన్ని ఆవిష్కరించారు. అనంతరం గ్రంథరచయిత బ్రహ్మానందరావు తన గ్రంథాన్ని డా. కె.వి.రమణాచారి, పుష్పలత దంపతులకు అంకితమిచ్చి ఘనంగా సత్కరించారు. సంతోష్ కుమార్, జయరాములు గ్రంథ సమీక్ష కావించారు.

# సినిమా కార్మికులు నైపుణ్యాలు పెంచుకోవాలి, సమ్మెలు వద్దు

## తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌తో సిఎం సమావేశం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 17:** హైదరాబాద్‌ను హాలీవుడ్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి సినిమా కార్మికులకు ఏమీ కావాలో చర్చించుకుని చెప్పండని సూచించారు. సినిమా కార్మికులను విస్మరించవద్దని నిర్మాతలకు హితవు చెప్పారు. బుధవారం సాయంత్రం జూబ్లీహిల్స్ నివాసంలో సిఎం రేవంత్‌రెడ్డితో తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ సినిమా కార్మికులలో నైపుణ్యాల పెంపుకు సహకరించాల్సిందిగా నిర్మాతలను కోరాను. స్కిల్ యూనివర్సిటీలో సినిమా కార్మికులకు శిక్షణ ఇస్తామన్నారు. సినిమా కార్మికులు తమ నైపుణ్యాలను పెంచుకోవాలని చెప్పారు. అన్ని భాషల చిత్రాలు తెలంగాణలో షూటింగ్ జరిగేలా సహకరించాలని చెప్పారు. చిన్న సినిమా నిర్మాతలకు సహకరించాలని, పరిశ్రమలో పని వాతావరణాన్ని చెడగొట్టుకోవొద్దని చెప్పారు. సమ్మెలకు పోతే రెండు వైపులా నష్టం జరుగుతుందన్నారు. సమస్యను సమస్యగానే చూస్తా..వ్యక్తిగత పరిచయాలను చూసుకోను అని చెప్పారు. సినిమా కార్మికుల తరుపున నిర్మాతల తో ప్రభుత్వం చర్చలు జరుపుతుందన్నారు. ఈ ప్రభుత్వం మీది..మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత నాది అని చెప్పారు. నేను కార్మికుల వైపు ఉంటాను..అదే సమయం లో నాకు రాష్ట్ర ప్రయోజనాలు కూడా ముఖ్యం అని చెప్పారు. సమ్మె జరుగుతుంటే చూస్తూ ఉర్కోలేమన్నారు. సినిమా కార్మికుల కు హెల్త్ ఇన్సూరెన్స్ అందజేసే ప్రయత్నం చేస్తామన్నారు. సినీ కళాకారులకు గద్దర్ అవార్డ్ లను ఇచ్చాం, గత ప్రభుత్వం 10 ఏళ్ల పాటు సినిమా వాళ్లకు అవార్డు లు కూడా ఇవ్వలేదన్నారు.

# అణుముప్పులకు భారత్ భయపడదు

## మరోమారు పాక్‌కు మోడీ హెచ్చరిక

## స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని విజ్ఞప్తి

**ధార్(మధ్యప్రదేశ్), సెప్టెంబరు 17:** అణుముప్పులకు నవభారతం భయపడదు అని ప్రధాని నరేంద్ర మోడీ పునరుద్ఘాటించారు. దేశ ఐక్యత కోసం మన సైనికులు అనేక త్యాగాలు చేశారని గుర్తుచేశారు. బుధవారంనాడు మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో నిర్వహించిన ఓ బహిరంగ సభలో ప్రధాని మోడీ మాట్లాడుతూ... ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత సైనికుల ప్రదర్శించిన ధైర్యసాహసాలు అమోఘమని ప్రశంసించారు. 'భరతమాత భద్రత దేశ అత్యున్నత ప్రాధాన్యం. పాకిస్తాన్ నుంచి వచ్చిన ఉగ్రవాదులు మన కుమార్తెలు, సోదరీమణుల గౌరవాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేశాం. అనేక మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం" అని తెలిపారు. మన సైనికులు ధైర్యసాహసాలతో పాక్‌ను మోకాళ్లపైకి తెచ్చారని కొనియాడారు. అణ్వాయుధాలున్నాయంటూ బెదిరింపులకు దిగినా, భయపడేది లేదని ధీటుగానే సమాధానమిచ్చాం. అణుముపునవలకు భారత్ భయపడదని మరోమారు స్పష్టం చేశారు.

**స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించండి**

స్వదేశీ వస్తువులను కొనుగోలు చేసి దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. ఇది పండుగ కాలమని, స్వదేశీ మంత్రాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మీరు ఏది కొనుగోలు చేసినా, అది మన దేశంలోనే తయారు చేసి ఉండాలి. ఎవరైనా భారతీయుల చెమటను భరించాలి అని 140 కోట్ల మంది భారతీయులను అభ్యర్థిస్తున్నానని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ పర్యటన సందర్భంగా దేశంలోని మొట్టమొదటి ప్రధానమంత్రి మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్ అండ్ అప్పారెల్ (పీఎం మిత్రా) పార్క్‌కు ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. అలాగే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్, రాష్ట్రీయ పోషణ్ మాహ్ ప్రచారాలను కూడా ప్రారంభించారు.

# సంక్షేమంలో దూసుకుపోతున్న సర్కార్

## అమరుల త్యాగాల ఫలితంగా నెరవేరిన స్వరాష్ట్ర ఆకాంక్ష

## రాచరిక వ్యవస్థ నుండి ప్రజాస్వామ్యం ఆవిర్భావం

## నిజాంకు వ్యతిరేకంగా చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో కీలకం

## ప్రజాపాలన దినోత్సవాల్లో మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రభాతవార్త, నడిగూడెం (సూర్యాపేట):** జిల్లాలో ప్రజాపాలన దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, విద్యాసంస్థల్లో అధికారులు, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాలను ఎగురవేశారు. సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవాల్లో రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, పరిశ్రమలు, వాణిజ్య, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజు అని పేర్కొన్నారు. రాచరిక వ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భవించింది అన్నారు. అమరులైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధులకు, స్వాతంత్ర సమరయోధులకు, తెలంగాణ అమరవీరులకు జోహార్లు తెలిపారు. దేశం అందరిదీ అనే భావన ప్రతి ఒక్కరిలో ఉండాలని మహాత్మా గాంధీ కలలు కన్న ఆశయాలను నెరవేర్చాలన్నారు. నిజాం వ్యతిరేక పోరాటం తెలంగాణ అంతట వ్యాపించిందని జనమంతా ఏకమై హైదరాబాద్ సంస్థానాన్ని భారత్ యూనియన్‌లో విలీనం విలీనం చేయాలని సాయుధ పోరాటం ఉధృతం చేశారని మంత్రి గుర్తు చేశారు. నిజాం కు వ్యతిరేకంగా చేసిన పోరాటంలో అప్పటి ప్రధానమంత్రి పండిట్ జవహర్లాల్ నెహ్రూ, హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నిర్వ హించిన పాత్ర ఎనలేనిది అన్నారు. ఆపరేషన్ పోలోతో నిజాం పాలన నుండి హైదరాబాద్ కు విముక్తి లభించిందని అన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమ చరిత్రను మంత్రి గుర్తు చేశారు. 1969లో ప్రారంభమైన తెలంగాణ ఉద్యమము దశలవారీగా 2014 వరకు జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుల త్యాగాలు వెలకట్టలేమన్నారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణ బిడ్డల త్యాగాలను పోరాటాలను చూసి చలించిపోయి రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వము తెలంగాణ అమరవీరులకు తగిన గౌరవాన్ని కల్పిస్తుందన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాం గం వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని ఆరు గ్యారెం టీలు పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజావాణిలో భాగంగా సమస్యల పరిష్కారానికై రాష్ట్ర జిల్లా స్థాయిలో ప్రజా దర్బార్, ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు మూడు కోట్ల 69 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారన్నారు. రూ. 205 కోట్ల 73 లక్షల మొత్తాన్ని ఆదా చేసుకున్నట్లు గుర్తు చేశారు. 500 రూపాయలకే గ్యాస్ కింద 15 కోట్ల 26 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. రైతు భరోసా పథకం కింద 2,87,234 మంది రైతుల ఖాతాల్లోకి రూ. 366 కోట్ల 50 లక్షలు జమైనట్లు తెలిపారు. రుణమాఫీ పథకం కింద రూ. 1005 కోట్ల రూపాయలు మాఫీ చేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాలు జనరల్ ఆసుపత్రి ఏరియా ఆస్పత్రుల ద్వారా ప్రజలకు విలువైన వైద్య సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమ శాఖలో భాగంగా జిల్లాలో 91 కోట్ల 67 లక్షలు పెట్టుబడి పెట్టి 385 మందికి ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ 24 గంటలు విధులను నిర్వహిస్తూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను ప్రవేశపెట్టి సమర్థవంతంగా అమలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు మంచి స్పందన లభిస్తుందని జిల్లా సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్, అదనపు కలెక్టర్ సీతారామారావు, అదనపు ఎస్పి జనార్ధన్, నరసింహ చారి, ఆర్డీవో వేణుమాధవ్ జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సంక్షోభంలో తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్

## సభ్యత్వమే లేని జిల్లాలకు ఓటు హక్కు ఇచ్చి ఎన్నికల నిర్వహణ

## క్రీడామంత్రికి రాష్ట్ర వెయిట్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు సాయిలు ఫిర్యాదు

**హైదరాబాద్, సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** కొందరు వ్యక్తుల స్వార్థంతో తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ సంఘం సంక్షోభంలో కూరుకుపోయిందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సాయిలు విమర్శించారు. నకిలీ పత్రాలు, ఫోర్జరీ సంతకాలతో వ్యవస్థలను మేనేజ్ చేస్తూ శ్రుతి అనే మహిళ అక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోదాడకు చెందిన వ్యక్తిగా చెప్పుకునే శ్రుతి అనే మహిళ విశాఖపట్నంలో నివసిస్తూ తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ సంఘాన్ని అనైతికంగా నడిపిస్తోందని అన్నారు.

నకిలీ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఏర్పాటు చేసి,తన సన్నిహితులను అందులో సభ్యులుగా పెట్టుకుని రాష్ట్రంలో అక్రమంగా వెయిట్‌లిఫ్టింగ్ పోటీలను నిర్వహిస్తోందన్నారు.

వెయిట్‌లిఫ్టింగ్‌తో ఎలాంటి సంబంధం లేని ఆమె గతంలో వేసిన అడహాక్ కమిటీకి చైర్మన్‌గా ఉన్న సుబ్రమణ్యం, వెంకటరమణ, హన్మంత్ రాజ్‌తో కలిసి కొన్ని నకిలీ పత్రాలు సృష్టించి, అనైతికంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి పోటీల నిర్వహణ పేరిట నిధుల దుర్వినియోగం చేస్తోందన్నారు. అసలు తెలంగాణ వెయిట్ లిఫ్టింగ్ సంఘంలో సభ్యులే కాని వారికి సభ్యత్వం ఇచ్చి, వాస్తవ జిల్లా సంఘాల గుర్తింపును రద్దు చేసే అధికారం శ్రుతికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. ప్రస్తుతం ఆమె నడుపుతున్న వెయిట్‌లిఫ్టింగ్ సంఘంలో పోలీసు, ఇన్‌కం ట్యాక్స్, పోస్టల్ డిపార్ట్‌మెంట్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను సభ్యులుగా చూపిస్తోందని, వారిలో సగం మందికి వారిని సభ్యులుగా పెట్టినట్టు కూడా వారికి తెలియదని ఆరోపించారు.

జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సంఘంలోని ఒక పెద్దమనిషి, శాట్‌లోని ఒక డిప్యూటీ డైరెక్టర్, తెలంగాణ ఒలింపిక్ సంఘం మాజీ కార్యదర్శి అండదండలతో ఆమె ఈ విధంగా వ్యవహరిస్తోందని అన్నారు.

ఈ విషయమై ఇప్పటికే క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి గారికి ఫిర్యాదు చేశామని, తెలంగాణ వెయిట్‌లిఫ్టింగ్ సంఘం పేరిట జరుగుతున్న అక్రమా లు, దోపిడిలపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.

# అక్టోబర్ 2 వరకు రాష్ట్రవ్యాప్తంగా 20,639 హెల్త్ క్యాంపులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 17:** రాష్ట్రవ్యాప్తంగా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యం లో సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకూ రాష్ట్రవ్యాప్తంగా 20,639 హెల్త్ క్యాంపులు నిర్వహించనున్నారు. ప్రైమరీ హెల్త్ సెంటర్ల నుంచి టీచింగ్ హాస్పిటల్స్ వరకూ అన్ని చోట్ల క్యాంపుల నిర్వాహణకు ఏర్పాట్లు చేశారు. ప్రైమరీ హెల్త్ సెంటర్లలో స్క్రీనింగ్ క్యాంపులు, టీవీవీపీ హాస్పిటళ్లు, టీచింగ్ హాస్పిటళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్లతో క్యాంపులు నిర్వహించనున్నారు. సూపర్ స్పెషలిస్ట్ డాక్టర్లతో ప్రతి జిల్లాలో ఒక మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించాలని... తద్వారా మహిళల ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి సారించేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఇందులో భాగంగా రక్తపోటు, మధుమేహం సహా ఓరల్, సర్వైకల్, బ్రెస్ట్ క్యాన్సర్లు, తదితర వ్యాధులపై స్క్రీనింగ్ నిర్వహించనున్నారు. కౌమార దశ బాలికలు, మహిళల్లో రక్తహీనత పరీక్షలు చేసి కౌన్సెలింగ్ అందించనున్నారు. క్షయవ్యాధి (టీబీ) పరీక్షలు నిర్వహిస్తారు. గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్ వ్యాధి (ఎస్సీడీ) పరీక్షలు చేసి కార్డులు పంపిణీ చేసి, సలహా సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా గైనకాలజిస్టులు, పిల్లల వైద్యులు, నేత్ర నిపుణులు, ఈఎన్టీ వైద్యులు, దంత వైద్యులు, ఢెర్మటాలజిస్టులు, మానసిక వైద్యులు తదితరులను మెడికల్ కాలేజీలు, జిల్లా ఆసుపత్రులు, జిల్లా రెసిడెన్సీ ప్రోగ్రామ్ నుండి ప్రత్యేకంగా సమకూరుస్తున్నారు. మాతాశిశు సంరక్షణలో భాగంగా గర్భిణీ స్త్రీలకు పూర్తి వైద్య పరీక్షలు (ఏఎన్సీ), హీమోగ్లోబిన్ పరీక్షలు, గర్భధారణ సమయంలో పోషకాహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించనున్నారు. మాతాశిశు సంరక్షణ కార్డులను సైతం పంపిణీ చేస్తారు.



# వన్డే సిరీస్ సమం

## భారత్ చేతిలో ఆస్ట్రేలియా చిత్తు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17 :** మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగిన రెండో వన్డేలో టీమిండియా 102 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 49.5 ఓవర్లలో 292 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఓపెనర్ స్మృతి మంధన (91 బంతుల్లో 117, 14 ఫోర్లు, 4 సిక్సర్లు) విధ్వంసకర శతకంతో విరుచుకుపడింది. భారత్ ఇన్నింగ్స్‌లో స్మృతి మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. దీప్తి శర్మ (40), రిచా ఘోష్ (29), ప్రతిక రావల్ (25), స్నేహ్ రాణా (24) ఫర్వాలేదనిపించారు. హర్లిన్ డియోల్ (10), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (17), రాధా యాదవ్ (6), అరుంధతిరెడ్డి (4), క్రాంతి గౌడ్ (2) స్వల్ప స్కోర్లకే ఔటై నిరాశపరిచారు.

ఆసీస్ బౌలర్లలో డార్సీ బ్రౌన్ 3, అష్లే గార్డ్‌నర్ 2, మెగాన్ షట్, అన్నాబెల్ సదర్‌ల్యాండ్, తహ్లియా మెక్‌గ్రాత్ తలో వికెట్ తీశారు. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ హీలీ ఏకంగా ఎనిమిది బౌలర్లను ప్రయోగించింది. అనంతరం 293 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా ఏ దశలోనూ గెలుపు దిశగా సాగ లేదు. క్రాంతి గౌడ్ (9.5-1-28-3), దీప్తి శర్మ (6-0-24-2), రేణుకాసింగ్ ఠాకూర్ (6.3-0-28-1), స్నేహ్ రాణా (6-0-35-1), అరుంధతిరెడ్డి (7.3-0-46-1), రాధా యాదవ్ (5-0-27-1) ధాటికి 40.5 ఓవర్లలో 190 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో సదర్‌ల్యాండ్ (45), ఎల్లిస్ పెర్రీ (44) మాత్రమే ఓ మోస్తరు స్కోర్లు చేశారు. ఈ గెలుపుతో భారత్ సిరీస్‌లో 1-1 తో సమంగా నిలిచింది. నిర్ణయాత్మక మూడో వన్డే న్యూఢిల్లీ వేదికగా ఈ నెల 20న జరుగనుంది.



# విషప్రయోగంతో నా భర్తను జైలులోనే హత్య చేసారు

## పౌర హక్కుల నేత అలెక్సీనవాల్నీ భార్య సంచలన ప్రకటన

**మాస్కో, సెప్టెంబరు 17:** రష్యాజైలులో మృతిచెందినపౌరహక్కుల నాయకుడు అలెక్సీ నవాల్నీ విషప్రయోగం వల్లనే మరణించారని ఆయన భార్య యూలియా నవాల్నా వెల్లడించారు. అధికారయంత్రాంగంలోను, ప్రభుత్వంలోను పెచ్చుమీరిన అవినీతిపై నవాల్నీ ఉద్యమించిన సంగతి తెలిసిందే. క్రెమ్లిన్‌కు వ్యతిరేకంగా ఆయన భారీ ఆందోళనలు చేపట్టడంతో అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్‌కు గట్టిపోటీదారుగా కూడా ఎదిగాడు. వివిధ నేరాలు అభియోగాలపై అరెస్టుచేసిన నవాల్నీని ఆర్కిటిక్ పీనల్ కాలనీకి తరలించారు. అక్కడే జైలుజీవితం అనుభవిస్తూ అలెక్సీ నవాల్నీ గతేడాది ఫిబ్రవరిలో మరణించారు. రాజకీయ ప్రేరపణతోనే ఆయనకు 19 ఏళ్ల జైలుశిక్ష విధించారని అప్పట్లో విమర్శలు కూడా పుతిన్‌పై వెల్లువెత్తాయి. 47 ఏళ్ల వయసులో ఆయన జైలులో ఉన్నపుడే కొద్దిదూరం నడుస్తూ కూలబడిపోయారని ఆయన భార్య వెల్లడించారు. బుధవారం ఇందుకు సంబంధించి యూలియా ఒక విడియోను విడుదలచేసారు. ఆయన బయలాజికల్ శాంపిల్స్‌ను రష్యా బయట ప్రాంతానికి తీసుకెళ్లి పరీక్షలుచేయించామని, విదేశాల్లో రెండు లేబొరేటరీల్లో పరీక్షలుజరిగాయని రెండింటా కూడా నవాల్నీపై విషప్రయోగంజరిగిందని ధృవీకరిస్తూ నివేదికలు ఇచ్చాయన్నారు. అయితే రాజకీయంగా ఎదురవుతున్న సమస్యల కారణంగా ఆమె వాటి నివేదికలు విడుదలచేయలేదని చెప్పారు. అలాగే ఈ విషప్రయోగానికి సంబంధించి నిర్దిష్టమైన ఆధారాలను కూడా ఆమె చూపించలేకపోయారు.

రెండుదేశాలకు చెందిన ల్యాబ్‌లలో పరీక్షలు చేయించామని నివేదిక అలెక్సీని హత్యచేసరానే వచ్చాయని ప్రత్యేకించి ఆయనపై విషప్రయోగం జరిగిందని తేల్చాయని నవాల్నాయా వెల్లడించారు. సోషల్‌మీడియాలో ఈ విడియోక్లిప్‌ను ఆమె పోస్టుచేసారు. చనిపోయేరోజు ఆయన ఉన్న సెల్‌లో వాంతులుచేసుకున్నట్లు నేలపై చారికలు ఉన్నాయని, అయితే ఇందుకు సంబంధించికూడా ఆమె ఆధారాలుచూపించలేకపోయారు. 12కుపైగా వ్యాధుల ఉధృతికి నవాల్నీ చనిపోయారని రష్యా దర్యాప్తు అధికారులు తనకు నివేదించారన్నారు. అలెక్సీకి గుండెసంబంధిత వ్యాధులే లేవని ఆమె చెప్పారు. 2020లో కూడా ఒక పర్యాయం విషప్రయోగం చేసారని రష్యాలోనే దేశీయ విమానంలో అస్వస్థతకు లోనయ్యారు. వెనువెంటనే బెర్లిన్‌కు వెళ్లి అక్కడ చికిత్సచేయించుకున్నారు. రెండురోజుల తర్వాత జర్మనీ ల్యాబ్స్, ఫ్రాన్స్, స్వీడన్ ల్యాబ్‌లు కూడా రష్యాకు సంబంధించి సోవియట్‌కాలం నాటి నోవిచోక్ నెర్వ్ ఏజెంట్ అనే రసాయన పదార్థం ప్రయోగించారని తేల్చినట్లు యూలియా చెప్పారు.

# 87శాతం ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు సమ్మెకు దూరం

## 13 శాతం ఆస్పత్రుల్లో మాత్రమే ఆగిన ఆరోగ్యశ్రీ సేవలు

## నెలకు రూ.100 కోట్లు ఆరోగ్యశ్రీకి చెల్లిస్తున్నాం: మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు 17:** నెట్వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీ.ఏ.ఎన్.హెచ్.ఏ) ప్రకటించినా వైద్య సేవలపై ఆ ప్రభావం పడలేదు. రాష్ట్రంలో చాలా నెట్వర్క్ హాస్పిటల్స్‌లో యథావిధిగా ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగాయి, ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్ చాలా మటుకు సమ్మెకు దూరంగా ఉన్నాయి. బుధవారం ఆరోగ్యశ్రీ పేషెంట్లకు వైద్య సేవలు అందించిన హాస్పిటల్స్ 87 శాతంగా ఉందని వైద్య, ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో కేవలం 13 శాతం హాస్పిటళ్లలోనే వైద్య సేవలు ఆగినట్లు సమాచారం. అయినప్పటికీ వైద్య సేవలు కొనసాగించాలని ఆయా హాస్పిటళ్లకు ఆరోగ్యశ్రీ సీఈవో ఉదయ్ కుమార్ మరోసారి విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యశ్రీ కింద గత రెండు వారాలుగా సగటున రోజూ 844 సర్జరీలు నమోదవగా... ఒక్క బుధవారం నాడే 799 సర్జరీలు నమోదు అయ్యాయని ఆరోగ్యశ్రీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు టీ.ఏ.ఎన్.హెచ్.ఏ వైద్య సేవలకు దూరంగా ఉంటామని ప్రకటించిన తరుణంలో రోగులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వ దవాఖానలో మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 477 ప్రైవేటు హాస్పిటల్స్ ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తుండగా... కేవలం 62 హాస్పిటల్స్ మాత్రమే సేవలు బంద్ చేశాయని 415 హాస్పిటల్స్ లో సేవలు యథావిధిగా నడుస్తున్నాయని అధికారులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ పథకానికి కనీసం రూ.50 కోట్లు కూడా ఇచ్చే పరిస్థితి లేదని... కానీ తాము నెలకు రూ. 100 కోట్లు చెల్లించేందుకు అంగీకారం తెలిపినా సమ్మె చేయడమేంటని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మండిపడ్డారు. బుధవారం అమీర్ పేట పిహెచ్‌సీలో జరిగిన ఓ కార్యక్రమం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత తొమ్మిదన్నర ఏళ్లలో చేయని సమ్మె ఇప్పుడు చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు తాము ఎంతో కమిట్‌మెంట్ తో కృషి చేస్తున్నామని తెలిపారు. తాము ఆరోగ్యశ్రీలో కొత్తగా 163 ప్రొసీజర్స్ తీసుకురావడంతో పాటు ధరలను రివైజ్ చేయడంతో సుమారు రూ.487 కోట్ల భారం ప్రభుత్వంపై పడిందన్నారు. ప్రస్తుతం 1385 ప్రొసీజర్స్ ద్వారా తాము వైద్యం అందిస్తున్నామన్నారు. గతంలో ఇప్పటికీ ఆరోగ్యశ్రీ చెల్లింపుల అంశంలో తేడా గమనించాలని కోరారు. ఇప్పటికే ఈ నెలకు అవసరమైన రూ.100 కోట్లను తాము విడుదల చేశామని... ఇప్పటికైనా సమ్మె విరమించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గతంలో తక్కువ ధరకే సేవలు అందించిన నెట్వర్క్ హాస్పిటల్స్... తాము ధరలు పెంచినందుకు స్ట్రైక్ చేస్తున్నారా అని నిలదీశారు. ఇప్పటికైనా పేదలకు వైద్య సేవలు అందించేందుకు నెట్వర్క్ హాస్పిటల్స్ ముందుకు రావాలని ఆయన కోరారు. వైద్య సేవలు ఆగే పరిస్థితి ఉండబోదని స్పష్టం చేశారు.

# వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్.. ఫైనల్స్‌కు నీరజ్, సచిన్




**న్యూఢిల్లీ:** ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2025, జావెలిన్ ఫైనల్‌కు నీరజ్, సచిన్ అర్హత సాధించగా, అనిమేష్ కుజుర్, రోహిత్, యష్ వీర్ ఓటమితో టోర్నీ నుండి నిష్క్రమించారు. ప్రవీణ్ చిత్రవెల్, అబ్దుల్లా అబూబకర్ కూడా ట్రిపుల్ జంప్ ఫైనల్‌కు చేరుకోలేకపోయారు. గ్రూప్ ఎలో అర్హత రౌండ్‌ను ప్రారంభించిన చోప్రా, ప్రత్యక్ష అర్హత మార్కు 84.5 మీటర్లు కాగా, కేవలం ఒకే ఒక్క త్రోతో 84.85 మీటర్ల దూరం నమోదు చేసి ఫైనల్‌కు చేరాడు. 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో చోప్రా కేవలం ఒక త్రోతో ఫైనల్‌కు అర్హత సాధించిన ఐదవ వరుస ప్రపంచ ఈవెంట్‌గా నిలిచాయి. ఇక పోటీలో ఉన్న ఇతర భారతీయ జావెలిన్ త్రోయర్లలో, ఫైనల్‌కు చేరుకున్న ఏకైక వ్యక్తి సచిన్ యాదవ్. అర్హత రౌండ్‌లో సచిన్ వరుసగా 80.16 మీ, 83.67 మీ, మరియు 82.63 మీ.తో మూడు త్రోలు వేశాడు. ఆటోమేటిక్ క్వాలిఫికేషన్ మార్కుకు తక్కువ అయినప్పటికీ, అతని ఉత్తమ ప్రయత్నం 83.67 మీటర్లు, టాప్ 12లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించడానికి సరిపోయింది. అతను గ్రూప్ ఎ లో ఆరవ స్థానంలో మరియు మొత్తం మీద పదవ స్థానంలో నిలిచాడు. రోహిత్ యాదవ్ 77.81 మీటర్లతో మొత్తం మీద 28వ స్థానంలో, యశ్వీర్ సింగ్ 77.51 మీటర్లతో 30వ స్థానంలో నిలిచాడు





# వరల్డ్ రెజ్లింగ్‌లో వైష్ణవి, ప్రియాపైనే ఆశలు

**న్యూఢిల్లీ:** ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో మహిళల జట్టు భారత పతక ఆశలను సజీవంగా ఉంచుతుండగా, పురుషుల ఫ్రీస్టైల్ సుజీత్, విక్కీ తదితర రెజ్లర్లు తమ రిపేచేజ్ బౌట్‌లలో ఓడిపోయి ఖాళీ చేతులతో తిరిగి వచ్చారు. 65 కిలోల మహిళల విభాగంలో వైష్ణవి లాట్వియాకు చెందిన ఎల్మా జైడ్లెరేపై 3-1 తేడాతో విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ఆ తర్వాత ఆమె క్వార్టర్ ఫైనల్స్‌లో మంగోలియాకు చెందిన ప్రపంచ ఐదవ ర్యాంకర్ ఎంఖ్జిన్ తువ్షింజార్గల్ చేతిలో 2-4 తేడాతో ఓడిపోయింది. తువ్షింజార్గల్ ఫైనల్‌కు చేరుకుంటేనే పాటిల్‌కు రెపిచేజ్‌లోకి ప్రవేశించే అవకాశం ఉండటంతో ఆమె పతకం ఆశలు సజీవంగా ఉంటాయి. ఇక 76 కిలోల విభాగంలో, ప్రియా మాలిక్ 1/8 రౌండ్‌లో ఈక్వెడార్‌కు చెందిన జెనెసిస్ రియాస్కో వాల్డెజ్ చేతిలో 2-4 తేడాతో ఓడిపోయింది. వాల్డెజ్ ఫైనల్‌కు చేరుకుంటేనే మాలిక్‌కు రెపెచేజ్‌లో పోటీ పడే అవకాశం లభిస్తుంది. మహిళల జట్టులోని ఇతర సభ్యులు ముందుగానే నిష్క్రమించారు. కాగా భారత పురుషుల ఫ్రీస్టైల్ రెజ్లర్లు తమకు లభించిన రిపేచేజ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోయారు. 65 కిలోల విభాగంలో సుజీత్ కల్కల్ 5-7 తేడాతో అమెరికన్ రియల్ మార్షల్ రే వుడ్స్ చేతిలో ఓడిపోయాడు. 97 కిలోల విభాగంలో విక్కీ, బల్గేరియాకు చెందిన అఖ్మద్ మగమాయేవ్ చేతిలో పతనంలో నిష్క్రమించాడు. ఈ ఓటములతో, భారత పురుషుల ఫ్రీస్టైల్ జట్టు ఎటువంటి పతకాలు లేకుండా ఛాంపియన్‌షిప్‌ను ముగించింది.

## ఆసియా టెన్నిస్ ఛాంపియన్‌షిప్.. మీనాకు కాంస్యం



**న్యూఢిల్లీ:** ఆసియా సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లలో పతకం గెలుచుకున్న తొలి భారతీయుడిగా జే మీనా నిలిచాడు. గత సంవత్సరం, మీనా ఆధ్య తివారీతో కలిసి ప్రపంచ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో భారత దేశానికి తొలి పతకాన్ని గెలుచుకున్నాడు. బుధవారం జరిగిన ఆసియా సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్‌లో పతకం గెలుచుకున్న దేశం నుండి తొలి అథ్లెట్‌గా నిలిచి భారత క్రీడా చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. జే చైనాకుచెందిన లి రన్ చెంగ్‌ను 4-1 తేడాతో ఓడించి సెమీఫైనల్స్‌కు చేరుకుని చారిత్రాత్మక పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. ఆ తర్వాత జరిగిన సెమీఫైనల్లో చైనీస్ తైపీకి చెందిన చెన్ పో యి చేతిలో 1-4 తేడాతో ఓడిపోయి కాంస్య పతకంతో సరిపెట్టుకున్నాడు.

# 416 రన్స్‌తో వెనుకబడిన భారత్

## తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 532 రన్స్




**న్యూఢిల్లీ:** జోష్ ఫిలిప్ అద్భుతమైన సెంచరీతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 532 పరుగులు చేసింది. భారతదేశం కేవలం ఒక వికెట్ కోల్పోయి 416 పరుగులు వెనుకబడి ఉంది. ఇండియా, ఆస్ట్రేలియా మధ్య జరుగుతున్న తొలి అనధికారిక టెస్ట్ రెండో రోజు బుధవారం ఆట ముగిసింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 532 పరుగులు చేసి, 6 వికెట్లు మాత్రమే కోల్పోయి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఇక భారత్ ఒక వికెట్ నష్టానికి 116 పరుగులు చేసింది. భారత్ తరపున అభిమన్యు ఈశ్వరన్ 44 పరుగులు చేసినా చివరికి లియామ్ స్కాట్ చేతిలో ఔటయ్యాడు. ప్రస్తుతం, ఎన్. జగదీశన్ మరియు సాయి సుదర్శన్ ఇద్దరూ వరుసగా 50 మరియు 20 పరుగులతో క్రీజులో ఉన్నారు. అయితే, టీం ఇండియా ఇంకా 416 పరుగులు వెనుకబడి ఉంది. రెండో రోజు ఆస్ట్రేలియా 5 వికెట్లు కోల్పోయి 337 పరుగులతో ఆలౌటైంది. వారు 25 ఓవర్లలో మరో 195 పరుగులు చేశారు. జోష్ ఫిలిప్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి సెంచరీ సాధించాడు. జగదీసన్ 55 బంతుల్లో తన 50 పరుగులు చేశాడు. హర్ష్ దుబే వేసిన ఒక ఓవర్‌లో 19 పరుగులు చేశాడు. మరో ఎండ్‌లో బార్ట్‌లెట్ అతనికి మద్దతు ఇచ్చాడు. ఆల్ రౌండర్ 24 బంతుల్లో 39 పరుగులు చేశాడు. ఆ ఆల్ రౌండర్ 62 బంతుల్లో ఆరో వికెట్‌కు 118 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకున్నారు. భారతదేశం తరపున ఏకైక పురోగతి హర్ బ్రార్ నుండి వచ్చింది. అతను 81 పరుగుల వద్ద ఉన్న స్కాట్‌ను అవుట్ చేశాడు. భారత జట్టుకు ఈశ్వరన్, జగదీసన్ మంచి ఆరంభాన్ని అందించారు. వారు 88 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని పంచుకున్నారు.

## చైనా మాస్టర్స్ 16వ రౌండ్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ

### లక్ష్యసేన్, కపిల, తనీషా ఓటమి




**న్యూఢిల్లీ:** చైనా మాస్టర్స్ 2025లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదుర య్యాయి. సాత్విక్ చిరాగ్ జోడీ 16వ రౌండ్‌లోకి ప్రవేశించగా, లక్ష్యసేన్ నిష్క్రమించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో జోడీ కూడా చైనా చేతిలో ఓడిపోయింది. బుధవారం జరిగిన బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 750 ఈవెంట్ అయిన చైనా మాస్టర్స్‌లో రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్ వరుస గేమ్‌ల విజయంతో రౌండ్ ఆఫ్ 16లో తమ స్థానాన్ని బుక్ చేసుకున్నారు. రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌షిప్ కాంస్య పతక విజేతలు సాత్విక్, చిరాగ్ 42 నిమిషాల్లో మలేషియా ద్వయం జునైది ఆరిఫ్-రాయ్ కింగ్ యాప్‌ను 24-22, 21-13 తేడాతో ఓడించారు. గత వారం జరిగిన హాంకాంగ్ ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో కూడా ఈ రెండు జంటలు తలపడ్డాయి, అక్కడ భారతీయులు మూడు ఆటల్లో గెలిచారు. పురుషుల సింగిల్స్‌లో, హాంకాంగ్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచిన లక్ష్య సేన్, మొదటి రౌండ్‌లో అరగంటలో ఫ్రెంచ్‌కు చెందిన టోమా జూనియర్ పోపోవ్ చేతిలో 21-11, 21-10 తేడాతో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల, తనీషా క్రాస్టో జోడీ కూడా 21-19, 21-13 తేడాతో చైనాకు చెందిన ఫెంగ్ యాన్ జెహువాంగ్ డాంగ్ పింగ్ చేతిలో ఓడిపోయింది.

# శాఫ్ ఛాంపియన్‌షిప్‌లో.. భారత్ తొలి విక్టరీ



**న్యూఢిల్లీ:** శాఫ్ అండర్ 17 ఛాంపియన్‌షిప్ 2025 ఫుట్‌బాల్ టోర్నీ ఓపెనర్‌లో భారత్ జట్టు తొలి మ్యాచ్‌లో 6-0 తేడాతో మాల్దీవులను ఓడించింది. శ్రీలంకలోని కొలంబోలో రేస్‌కోర్స్ ఇంటర్నేషనల్ స్టేడియంలో బుధవారం జరిగిన తమ తొలి గ్రూప్ బి మ్యాచ్‌లో భారత జట్టు మాల్దీవులను ఓడించి ఛాంపియన్‌షిప్ 2025 టైటిల్ పోరును ప్రారంభించింది. బ్లూ కోల్ట్స్ మొదటి నుంచే అద్భుత ప్రదర్శన చేశారు. దల్లాల్ముఖ్వాన్ గాంగ్టే రెండుసార్లు కొట్టాడు. హృషికేశ్ చరణ్ మనవతి, కమ్‌గౌహావో డౌంగెల్, వాంగ్‌ఖైరక్‌పమ్ గున్‌లీబా, అజీమ్ పర్వేజ్ నాజర్ పిచ్ రెండు చివర్లలో పూర్తి ప్రదర్శనతో స్కోర్‌షీట్‌లో చేరారు. దీంతో బిబియానో ఫెర్నాండెజ్ జట్టు అధిక వత్తిడికి గురయ్యారు. ముఖ్యంగా వాంగ్‌ఖైరక్‌పమ్ గున్లీబా ఎడమ వింగ్‌లో చివరి మూడవ భాగం 12వ నిమిషంలో భారత్ ఆధిక్యంలోకి వెళ్లింది. వాంగ్‌ఖైరక్‌పమ్ తన మార్కర్‌ను దాటి దూసుకెళ్లి బంతిని ముందుకు నడిపించాడు. 29వ నిమిషంలో భారత్ తమ ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. బ్లూ కోల్ట్స్ జట్టు రెండో అర్ధభాగం 49వ నిమిషంలో మరింత పెంచుకుంది. ఆ తర్వాత 58వ నిమిషంలో వాంగ్‌ఖైరక్‌పమ్ అద్భుతమైన ప్రదర్శనతో గోల్‌ను నమోదు చేశాడు. 68వ నిమిషంలో, వేధింపులకు గురైన అవ్సామ్ అబ్దుల్లా రహాన్ అహ్మద్‌ను బాక్స్‌లోనే పడగొట్టాడు. గాంగ్టే తన రెండవ గోల్ సాధించి మ్యాచ్‌ను 5-0తో ముగించాడు. అజ్లాన్ షా కుడివైపు నుండి టీజింగ్ క్రాస్ కొట్టాడు. దానిని ఆజిమ్ పర్వేజ్ నజార్ ఎదుర్కొన్నాడు. దీంతో 86వ నిమిషంలో భారత్ మరో గోల్ చేసి 6-0తో విక్టరీ సాధించింది.

# ఇండిగో డైరెక్టర్ల బోర్డులోకి నీతిఆయోగ్ మాజీ సిఇఒ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** చౌకధరల విమానయానసంస్థ ఇండిగో మాజీ నీతి ఆయోగ్ సిఇఒ, జి20 షెర్పా అమితాబ్‌కాంత్‌ను తమ బోర్డులో అదనపు డైరెక్టర్‌గా నియమించుకుంది. నాన్‌ఎగ్జిక్యూటివ్; నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా ఆయన సంస్థలో కొనసాగుతారని ఇండిగో తెలిపింది. ఇందుకు సంబంధించి పౌరవిమానయానశాఖ కూడా ఆమోదం తెలిపింది. అంతకుముందే ఎయిర్‌లైన్స్ జులై 3న కాంత్‌నియామకాన్ని ప్రకటించింది. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఒక ప్రకటన విడుదలచేస్తూ తాము విమానయాన మంత్రిత్వశాఖనుంచి ఇతర సంస్థలనుంచి ఆమోదం పొందామని తదనుగుణంగానే కాంత్ నియామకం ఈనెల 15నుంచి అమలులోకి వచ్చిందని తెలిపింది. అలాగే హెచ్‌సిఎల్ టెక్ కూడా అమితాబ్‌కాంత్‌ను తన డైరెక్టర్లబోర్డులో నియమించుకుంది. నాన్ ఎగ్జిక్యూటివ,ఇ ండిపెండెంట్ డైరెక్టర్‌గా ఐదేళ్లకాంపాటు కొనసాగుతారని హెచ్‌సిఎల్‌టెక్‌ప్రకటించింది. కాంత్ నియామకంపై సెబీ కూడా సానుకూలంగానే స్పందించింది. 69 ఏళ్ల అమితాబ్‌కాంత్ జి20 షెర్పాగా ఈ ఏడాది జూన్‌నెలలోనే వైదొలిగారు లింక్డ్‌ఇన్‌లో 45 ఏళ్ల ప్రభుత్వ సర్వీసుల్లో కొనసాగినతర్వాత కొత్త అవకాశాలు, కొత్త అధ్యాయం ప్రారంభించబోతున్నట్లు ఆయన తెలిపారు. 2023లో జి20ని భారత్ నిర్వహించడంలో కాంత్ కీలకపాత్రపోషించారు. అంతకుముందు నీతి ఆయోగ్ సిఇఒగా కూడా పనిచేసి స్ఫూర్తిదాయక జిల్లాల పథకం అటల్ ఇన్నొవేషన్ మిషన్, డిజిటల్ ఇన్‌ఫ్రా, గ్రీన్‌హైడ్రోజెన్ వంటి కీలక కార్యాచరణలను అమలులోకి తెచ్చారు. అంతకుముందు కేంద్ర పారిశ్రామికవిధానాలు, ప్రోత్సాహకాల వ్యవస్థ డిప్‌ను పర్యవేక్షించారు. కాంత్‌చేపట్టిన కార్యాచరణ వల్లనే భారత్‌ప్రపంచ బ్యాంకు ర్యాంకింగ్స్‌లో 79 స్థానాలు ఎగబాకింది.


# డాలర్ వర్సెస్ రూపాయి 87.84



**ముంబయి, సెప్టెంబరు 17:** డాలరుతోరూపాయి మారకం విలువల్లో రూపాయి కొంతమేర పటిష్టం అయింది. 25 పైసలు పెరిగి 87.84 వద్ద నడిచింది. బుధవారం ఇంటర్ బ్యాంకు ఫారిన్ కరెన్సీ మార్కెట్లలో డాలరుతో రూపాయి మారకం విలువలు 87.84గా నడిచాయని తేలింది. దీనితో దేశీయ ఈక్విటీ మార్కెట్లకు అండ లభించింది. విదేశీ ట్రేడర్లు చెలామణీలో వరుసగా నాలుగో రోజు కూడా రూపాయి పటిష్టం కావడం కనిపించింది. అమెరికా ఫెడ్‌రిజర్వు ఫండ్‌రేట్లను కుదిస్తే నగదు మార్కెట్లలోని పెట్టుబడులన్నీ కూడా ఈక్విటీ, బంగారం మార్కెట్లవైపు వెళతాయన్నది తెలిసిందే. వడ్డీరేట్లు తగ్గింపును జీర్ణించుకోరు అందువల్లనే ఈ పెట్టుబడులు దేశీయ ఈక్విటీల్లోకి వస్తాయి. ఫలితంగా రూపాయి మారకం విలువలు గణనీయంగా పెరుగుతాయి. ఫెడ్‌రిజర్వు 25 బేసిస్ పాయింట్లు రేట్ కుదిస్తుందని అంచనాలతో ఉన్నారు. అందువల్లనే ఇన్వెస్టర్లు ఫెడ్‌రిజర్వు ఛైర్మన్ ప్రసంగంపైనే ఫోకస్ పెట్టారు. రూపాయి ప్రారంభంలో 87.84వద్ద కొనసాగి చివరకు 87.71వద్దకు చేరింది. మళ్లీ పెరిగి 87.86వద్దకు చేరింది. దేశీయంగా డాలరుతోరూపాయి చివరకు 87.84వద్దనే ముగిసింది. దీనితో 25 పైసలు ముందురోజుకంటే బలపడిందని ట్రేడర్లు తెలిపారు. ముందురోజు రూపాయి ఏడుపైసలు పెరిగి 88.09పైసలుగా ఉంది. ఇదిలా ఉంటే బ్రెంట్ ముడిచమురు 0.66శాతం దిగువన బ్యారెల్‌కు 68.02వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సెన్సెక్స్ 313.02 పాయింట్లుపెరిగి 82,693.71 పాయింట్లవద్దస్థిరపడితే నిఫ్టీ 91.15 పాయింట్లుపెరిగి 25,330.25 పాయింట్లవద్ద స్థిరపడింది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు 308.82కోట్ల మేర ఈక్విటీల్లో కొనుగోళ్లుజరిపారు. దీనికితోడు భారత్ అమెరికాలమధ్య నడుస్తున్న వాణిజ్యసంప్రదింపులు సానుకూలదిశగా కొనసాగుతున్నట్లు బ్రెండన్ లించ్ వెల్లడించడం కూడా మార్కెట్లకు కలిసొచ్చింది.

# నిఫ్టీలో దుమ్మురేపిన పిఎస్‌యు బ్యాంక్ సూచీ

## లాభాల్లో ముగిసిన సెన్సెక్స్ నిఫ్టీ




**ముంబయి,సెప్టెంబరు 17:** దేశీయ స్టాక్ మార్కెట్‌సూచీలు బుధవారం కూడా లాభాల్లోనే ముగిసాయి. భారత్ అమెరికా వాణిజ్య సంప్రదింపుల్లో సానుకూలత, ఫెడ్‌రిజర్వు రేట్‌కట్ వంటి అంశాలు సెన్సెక్స్ నిఫ్టీలకు కలిసొచ్చాయి. నిఫ్టీ 25,300 స్థాయిలో ట్రేడింగ్ నిలిపివేసింది. ఎస్‌అండ్‌పి బిఎస్‌ఇ సెన్సెక్స్ 313.02 పాయింట్లు లాభపడి 82,693.71 పాయింట్లవద్ద స్థిరపడింది. నిఫ్టీ 50 సూచీ 91.15 పాయింట్లు లాభంతో 25,330.25 పాయింట్లవద్ద నిలిచిపోయింది. ఈ రెండు సెషన్లలోను సెన్సెక్స్ 1.11శాతం, నిఫ్టీ 1.04శాతం పెరిగాయి. ఎస్‌అండ్‌పి బిఎస్‌ఇ మిడ్‌క్యాప్‌సూచీ 19శాతంపెరిగితే బిఎస్‌ఇ స్మాల్‌క్యాప్‌సూచీ 0.51శాతంపెరిగింది. మార్కెట్లధోరణులు ఆసాంతం సాను కూలంగానే కొనసాగాయి. ఇక విభాగ సూచీల్లో నిఫ్టీ పిఎస్ యుబ్యాంకు సూచీ 2.61శాతం, నిఫ్టీ ఐటిసూచీ 0.65శాతం, నిఫ్టీ ఆయిల్ గ్యాస్‌సూచీ 0.63 శాతం పెరుగుదల నమోదుచేసాయి. ఇక నిఫ్టీ మెటల్‌సూచీ 0.59శాతం, మిడ్ స్మాల్ హెల్త్‌కేర్‌సూచీ 0.44శాతం, కన్స్యూమర్ డ్యూరబుల్స్ 0.30శాతం నిఫ్టీలో క్షీణించాయి. పదేళ్ల బెంచ్‌మార్క్ ఫెడ్ రిజర్వు బాండ్లు 0.28శాతం తగ్గి 6.472గా ముగిసాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి 87.8450 వంతునట్రేడ్ అయిందని సమాచారం. ఎంసిఎక్స్‌లో గోల్డ్‌ఫ్యూచర్స్ అక్టోబరు 3వ తేదీనాటిదరలు 0.71శాతంపెరిగి 1,09,370 రూపాయలుగా కొనసాగింది. ఇక కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు మార్కెట్ 41సెంట్లు తగ్గి బ్యారెల్‌కు 68.06 డాలర్లుగా నడించింది. యూరోపియన్ మార్కెట్లు కూడా పెరిగాయి. యుకె ద్రవ్యోల్బణం గణాంకాలు ఆగస్టునెలకుగాను 3.8శాతంగా ఉన్నాయి. ఆసియా మార్కెట్లు మిశ్రమంగా ఉన్నాయి. వాల్‌స్ట్రీట్ కొంతమేర ఫెడ్‌రిజర్వు రేట్ల కోతల అంచనాలతో దిగజారాయి. జపాన్ ఎగుమతులు కూడా 0.1శాతం తగ్గాయి. ఎస్‌అండ్‌పి 500 సూచీ 0.13శాతందిగువస్థాయిలోనే ముగి సింది. నాస్‌డాక్ కాంపోజిట్ 0.07శాతంగా క్షీణించింది. డౌజోన్స్ పారిశ్రా మిక సగటు 125.55 పాయింట్లు క్షీణించింది.

# ఉద్యోగులతో హుండయి మోటార్స్ ఒప్పందం

## రూ.31వేల వంతున వేతనాల్లో పెరుగుదల




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ఆటోమొబైల్‌రంగంలోని హుండయి మోటార్స్ ఇండియా ఉద్యోగులతో దీర్ఘకాలిక వేతన ఒప్పందంచేసుకుంది. యునైటెడ్ యూనియన్ ఆఫ్ హుండయి ఎంప్లాయిస్‌తో మూడేళ్ల కాలానికి చెల్లుబాటయ్యేవిధంగా ఈ వేతన ఒప్పందం జరిగింది. ఈ కొత్త వేతనాలు పెరిగి పరిశ్రమలోనే అత్యుత్తమ వేతన ప్యాకేజిగా నిలుస్తుంది కొత్తగా ఉద్యోగులకు 31 వేల రూపాయలు వంతున పెరుగుతుంది. మూడేళ్లకాలం పాటు మొదటి విడత 55శాతం, 25శాతం, 20శాతంగా ఉంటుంది. వేతన పెంపుతోపాటు కార్మిక సంక్షేమానికి కూడా అదనంగా ఖర్చుచేస్తామని ప్రకటించింది. వెల్‌నెస్ కార్యాచరణల్లో పరిశ్రమలోనే బెస్ట్‌ఇన్‌క్లాస్ సేవలు అందచేస్తామని తెలిపింది. 2024 ఏప్రిల్ ఒకటవ తేదీనుంచే ఈ ఒప్పందం అమలులోకి వస్తుంది. 2027 మార్చి 31వరకూ కొనసాగుతుంది. పరిశ్రమ పీపుల్‌స్ట్రాటజీ హెడ్ యంగమ్యూంగ్‌పార్క్ మాట్లాడుతూ మా ఉద్యోగులే మా విజయానికి కారకులని, ప్రస్తుత ఒప్పందం పరస్పర నమ్మకం, గౌరవంతో నిర్మాణాత్మకచర్చలతోముగిసిందని అన్నారు. 2011లో రిజిస్టరు అయిన యునైటెడ్ యూనియన్ ఆఫ్ హుండయి ఎంప్లాయీస్ మేనేజ్‌మెంట్ గుర్తించిన అధికారిక యూనియన్‌గా నిలిచింది. మొత్తం 1981 మంది ఉద్యోగులు అంటే 90శాతం మంది ఈయూనియన్‌లోనే ఉన్నారు. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, యాజమాన్యంతో సామరస్య పూర్వక సంప్రదింపులు వంటివి కొనసాగిస్తోంది.

Urban Company

# ప్రీమియం ధరలకు అర్బన్ కంపెనీ షేర్లు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** యాప్ ఆధారిత బ్యూటీ, గృహసేవలసంస్థ అర్బన్ కంపెనీ బుధవారం ప్రీమియం ధరలకు అమ్ముడుపోయింది. ఇష్యూధరకంటే 62శాతం అధికంగా కొనుగోళ్లు జరిగాయి. అంటే షేరుధర 103గా కొనసాగింది. కంపెనీస్టాక్స్ ట్రేడింగ్161వద్ద ప్రారంభం అయి 56.31శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఐపిఒలో ఇష్యూధరకంటే అధికంగా వెళ్లియింది. ఒకదశలో 73.78శాతంపెరిగి 179 రూపాయలకు కూడా వెళ్లింది. కంపెనీచివరకు 167.05వద్ద ట్రేడింగ్‌ముగించింది. ఎన్‌ఎస్‌ఇలో కూడా కంపెనీ షేర్లు 57.52 ప్రీమియంకు 162.25కు వెళ్లాయి. నిఫ్టీలో అర్బన్ కంపెనీ షేర్లు 166.83వద్ద ముగిసాయి. 61.97 శాతం ప్రీమియంకు విక్రయించారు. కంపెనీమార్కెట్ విలువలు 23,986.74కోట్లుగా వెల్లడించింది. ఐపిఒ జారీచేసిన తర్వాత ఇప్పటివరకూ 149.88 లక్షల షేర్లు ట్రేడ్ అయ్యాయి. ఎన్‌ఎస్‌ఇలో అయితే 1960.31 లక్షల షేర్లు కొనుగోళ్లుజరిగాయి. కంపెనీ జారీచేసినైపిఒకు మంచి స్పందన లభించింది. మొత్తం 103.63 రెట్లు బిడ్డింగ్ జరిగింది. 1900 కోట్ల ఐపిఒకు ఇష్యూధర 98 నుంచి 103 రూపాయలుగా నిర్ణయించారు.

# ఎస్‌బ్యాంకులో ఎస్‌బిఐ వాటా అమ్మకం

## రూ.8889కోట్లకు జపాన్ ఎస్‌ఎంబిసి కొనుగోలు




**న్యూఢిల్లీ,సెప్టెంబరు 17:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ ఎస్‌బ్యాంకులోని తన వాటాను జపాన్‌కు చెందిన ఎస్‌ఎంబిసికి విక్రయించింది. ప్రతి వాటాకు 21.50 రూపాయలు చొప్పున మొత్తం 8889 కోట్లు ఈషేర్లు విత్‌డ్రాద్వారా రాబడిసాధించింది. మొత్తంఎస్‌బ్యాంకులో ఎస్‌బిఐకి 413.44 కోట్ల ఈక్విటీ వాటాలున్నాయి. జపాన్‌కు చెందిన సుమితోమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్‌ఎంబిసి)కి తన వాటాలను విక్రయించింది. రెండోత్రైమాసికంలో ఈ రాబడులు బ్యాంకు ఇతర ఆదాయవనరులకింద వచ్చినట్లయింది. షేర్ల విత్‌డ్రా తర్వాత ఎస్‌బిఐ ఎస్‌బ్యాంకులో వాటాదారుగా కూడా కొనసాగుతుంది. విత్‌డ్రాచేసిన తర్వాత కూడా 108శాతం వాటాతో ఉంది. 2020 మార్చినెలలో ఎస్‌బిఐ ఎస్‌బ్యాంకులో అతిపెద్ద వాటాదారుగా ఉంది. ఎస్‌బ్యాంకు పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియలోభాగంగా బ్యాంకులోని అదనపు షేర్లను ఎఫ్‌పిఒద్వారా 2020 జులైలో కొనుగోలు చేసింది. ఇపుడు ఈ మొత్తంలో కొన్ని షేర్లను ఎస్‌ఎంబిసికి విక్రయించింది. ఇందుకుసంబంధించి ఎస్‌బ్యాంకు వాటాను కొనుగోలుచేసేందుకు ఎస్‌ఎంబిసి రిజర్వుబ్యాంకునుంచికూడా అనుమతి సాధించింది. జపాన్‌లో 14వ అతిపెద్ద ప్రపంచస్థాయి ఆర్థికసేవల బ్యాంకింగ్‌గ్రూప్‌గా ఎస్‌ఎంఎఫ్‌జి ఉంది. రెండు లక్షలకోట్ల డాలర్ల స్థిరాస్థి విలువలతో కొనసాగుతోంది. ఈ ఏడాది మేనెలలో ఎస్‌బ్యాంకు ఎక్ఛేంజిలకు ఈ ఎస్‌ఎంబిసి కొనుగోలు గురించి కూడా తెలియజేసింది. ఈకొనుగోలు 13.19 శాతం వాటా ఎస్‌బిఐనుంచి, 6.81శాతం ఏడుగురు ఇతర ఆటాదారులనుంచి కొనుగోలుచేస్తున్నట్లు వెల్లడించింది. యాక్సిస్ బ్యాంకు, బంధన్ బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, ఐడిఎఫ్‌సి ఫస్ట్‌బ్యాంకు, కోటక్ మహీంద్ర బ్యాంకులకు ఇందులో వాటాలున్నాయి. ఈ కొనుగోలుతో ఇతరదేశాల్లోని బ్యాంకుల్లో అతిపెద్ద వాటా చేజిక్కించుకన్నసంస్థగా ఎస్‌ఎంబిసి నిలిచింది. నెలరోజులముందే ఆర్‌బిఐ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియాలనుంచి అనుమతులు పొందింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.